WWW.nindam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం, నవంబర్ 8, 2024 | సంపుటి - 21 | సంచిక 50 | వెల - 7 | పేజీలు -12 + 12

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## కలెక్టర్‌కే ఎసరు పెట్టిండ్లు..

- ములుగు జిల్లా కలెక్టర్ పేరుతో ఫేక్ ఖాతాలు
- ఫేక్ మేసేజ్‌లు పంపుతున్న కేటుగాళ్లు
- నియంత్రణ కాని సైబర్ నేరాలు
- మోసపూరిత మెసేజ్‌లు నమ్మవద్దు
- పోలీసులకు కలెక్టర్ ఫిర్యాదు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):

వివరాలు 3లో..

## మధ్యలో నిబంధనలు మార్చరాదు

ఉద్యోగ నియామకాల ఎంపిక ప్రక్రియ

సుప్రీంకోర్టు కీలక తీర్పు



వివరాలు 2లో..



# కులగణన దేశానికి ఆదర్శం

## అభివృద్ధి, సంక్షేమ విధానాలకు దోహదం పడుతుంది

- ఇది ఎక్స్రే లాంటిదని అభివర్ణన
- మంథనిలో కేడీసీసీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు

**పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్7(నినాదం):**

తెలంగాణలో నిర్వహిస్తున్న కులగణన కుటుంబ సర్వే దేశానికే ఆదర్శమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇది చరిత్రలో నిలుస్తుందని వ్యాఖ్యానించారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో కేడీసీసీ బ్యాంక్ భవన నిర్మాణానికి గురువారం శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి విధానాలను రూపొందించేందుకు కులగణన దోహదం చేస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చెప్పినట్లు కులగణన ఎక్స్రే లాంటిదని అభివర్ణించారు. ప్రతి కుటుంబానికి సంబంధించి ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయ తదితర 56 అంశాల వివరాలను ఈ సర్వేలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. నవంబర్ 30 వరకు కొనసాగే సర్వే కోసం రాష్ట్రవ్యాప్తంగా 80వేల మంది పైగా ఎన్యుమరేటర్లను నియమించినట్లు తెలిపారు. 2లో..

## సర్పంచులను రోడ్ల మీదకు తెచ్చిందే బీఆరెస్

- బిల్లులు చెల్లించక ఆత్మహత్యలకు కారణమైన వారే ధర్నాలు చేస్తరా?
- బీఆరెస్ నేతలను నిలదీసిన మంత్రి శ్రీధర్ బాబు

వివరాలు 2లో..

## కనుమరుగు కానున్న మణుగూరు సింగరేణి సంస్థ ?



### పర్యావరణ పేరుతో అనుమతులు నిరాకరణ

- ఆందోళనలో కార్మిక సంఘాలు
- పాత గనుల్లో ప్రైవేట్ కంపెనీల పెత్తనం

2లో..

ఉత్తర తెలంగాణ ప్రాంతంలో నల్ల బంగారంగా పేరున్న మణుగూరు సింగరేణి కాలరీస్ సంస్థ, రాబోవు ఆరేళ్లలో కనుమరుగయ్యే పరిస్థితులు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లోప భూయిష్ట విధానాలతో సింగరేణి సంస్థ మనుగడకు ప్రమాదం ఏర్పడినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని బట్టి తెలుస్తుంది.

**మణుగూరు, నవంబర్7(నినాదం):**



1973సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మణుగూరు సింగరేణి సంస్థను ఆయన చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. 50 ఏళ్ల చరిత్రలో మణుగూరు సింగరేణి కాలరీస్ సంస్థ అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ తన మార్కును చాటుకుంది. భూగర్భ గనుల నుంచి ఉపరితల గనుల వరకు అనేకమార్పులతో తమ లక్ష్యాలను అధిగమిస్తూ లాభాల బాటలో కొనసాగింది. కానీ పర్యావరణ అనుమతులు నిరాకరిస్తూ అటవీశాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో కొత్త గనులకు అవకాశం లేకుండా పోయింది.

## పలువురు డీఎస్పీల బదిలీ




**హైదరాబాద్, నినాదం:** తెలంగాణలో పలువురు డీఎస్పీ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ఇవాళ (గురువారం) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న జీ మహేశ్ బాబుని కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా ఉన్న బీ.రామానుజంను కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు.

2లో..



వివరాలు 4లో..

## ప్రాణాలతో చెలగాటం

### లైఫ్ జాకెట్స్ లేకుండా పడవ ప్రయాణం

- ప్రమాదకరంగా పెద్దిపల్లి రేవుపై ప్రయాణం
- అయినా పట్టించుకోని అధికారగణం
- తక్కువ బరువు పడవ వినియోగం
- పడవపై పరిమితికి మించి ప్రయాణీకులు
- ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు..?

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి (నినాదం) :**

పెద్దిపల్లి వద్ద గోదావరి రేవుపై ప్రమాదకరంగా పడవ ప్రయాణం సాగుతున్నా సంబంధిత అధికార యంత్రాంగానికి పట్టినట్లుగా లేదు. ధరల సూచిక బోర్డు రేవు వద్ద మచ్చుకైనా కానరాదు. పరిమితికి మించి పడవపై ప్రయాణికులను ఎక్కించుకోవడమే కాకుండా లైఫ్ జాకెట్లు వాడడం లేదు. ఇక ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా చార్జి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాటదారు నిబంధనలను నీళ్లలో ముంచినా అడిగేవారు లేరు. ఊహించని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరనేది తెలియడం లేదు.

## 11 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత




- పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లుగా పరిస్థితి
- ధాన్యం కొనే దిక్కులేక రైతుల అవస్థలు
- దళారులతో కుమ్మక్కయిన మిల్లర్లు
- సంస్థాగతంగా బిజెపి బలోపేతం చేయాలి
- ప్రజల సమస్యలపై ఎక్కడికక్కడ పోరాటాలు
- పార్టీ కార్యశాలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

వివరాలు 2లో..




### కమ్యూనిటీ వెల్‌నెస్‌ను ప్రోత్సహించడానికి ఫ్రీడం పార్క్‌ని ప్రారంభించిన జీఈఎఫ్ ఇండియా

**సమాజం యొక్క విభిన్న అవసరాలను తీర్చగల సమ్మిళిత , పర్యావరణ అనుకూల స్థలాలను "ఫ్రీడమ్ పార్క్స్" గా రూపుదిద్దుతున్న ఫ్రీడం ఆయిల్స్**

**హైదరాబాద్, నినాదం:**

ఫ్రీడమ్ హెల్తీ వంట నూనెల తయారీదారులు, జెమిని ఎడిబుల్ & ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (జీఈఎఫ్ ఇండియా) తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా 'ఫ్రీడం పార్క్' ని ప్రారంభించింది. కూకట్‌పల్లి మరియు చుట్టుపక్కల ప్రాంతాలలోని ప్రజలకు విశ్రాంతి తీసుకోవడానికి, వ్యాయామం చేయడానికి, ఆడుకోవడానికి మరియు బంధాలను పెంచుకోవటానికి ప్రత్యేకంగా రూపొందించిన హరిత ప్రాంగణం ఇది. ▸▸తరువాయి 2లో

## అప్పు ఆ కుటుంబం పాలిట శాపమైంది

### వేధింపులు తాళలేక గోదావరిలో దూకి తండ్రి, కూతురు మృతి

**హైదరాబాద్, నినాదం:**

చేసిన అప్పు ఓ కుటుంబం పాలిట శాపంగా మారింది. అప్పుల వాళ్ల వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడిరది. ఈ విషాదకర సంఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ న్యాల్ కల్ రోడ్డులో నివాసం ఉండే వేణు(50) చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య అనురాధ, కూతురు పూర్ణిమ (24) ఉన్నారు. 02

## కొడుకుతో కలిసి తల్లి, సోదరి హత్య

**భువనేశ్వర్ :** ఆస్తి కోసం ఒక వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. కొడుకుతో కలిసి వృద్ధురాలైన తల్లి, సోదరిని హత్య చేశాడు. అగ్నిప్రమాదంలో వారు చనిపోయినట్లు నమ్మించేందుకు ప్రయత్నించాడు.






## కమ్యూనిటీ వెల్‌నెస్‌ను ప్రోత్సహించడానికి ఫ్రీడం పార్క్‌ని ప్రారంభించిన జీఈఎఫ్ ఇండియా

**మొదటిపేజీ తరువాయి**

కమ్యూనిటీ వెల్‌నెస్‌ను ప్రోత్సహించడానికి 'ఫ్రీడం పార్క్'ని ప్రారంభించిన జీఈఎఫ్ ఇండియా

ఈ పార్క్‌ను జీఈఎఫ్ ఇండియా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి మరియు జీఈఎఫ్ ఇండియా సేల్స్ & మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి . చంద్ర శేఖర రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసి) నుండి ప్రతినిధులు మరియు స్థానిక నివాసితులు హాజరయ్యారు.

జీఈఎఫ్ ఇండియా ఈ ఫ్రీడం పార్క్‌ను రూ. 2.76 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసింది. ఇది జాగింగ్/వాకింగ్ ట్రాక్, ఒక యాంఫీథియేటర్, కమ్యూనిటీ సమావేశాల కోసం కవర్ జోన్, ప్రకాశవంతమైన మరియు రంగురంగుల స్వింగ్‌లతో కూడిన ప్రత్యేక పిల్లల ఆట స్థలం, బహిరంగ వ్యాయామశాల కోసం పరికరాలు, యోగా జోన్, బెంచీలు, వాష్‌రూమ్ మరియు పార్కులో ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్ కలిగి వుండేలా తీర్చిదిద్దారు. ఇది కాంక్రీట్ జంగిల్ మధ్య స్వాగతించే ఏకాంత ప్రదేశంగా నిలువనుంది. ప్రజలు నివసించే మరియు పని చేసే కమ్యూనిటీల నడుమ ఆరోగ్యకరమైన మరియు చురుకైన జీవనశైలిని ప్రోత్సహించాలనే జీఈఎఫ్ ఇండియా యొక్క అంకితభావాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. విస్తారమైన సౌకర్యాలతో, వినోదం, ఆరోగ్యం మరియు సామాజిక అనుసంధానిత కోసం ప్రతిష్టాత్మకమైన వనరుగా ఈ పార్క్ మారింది. నిర్మలమైన ఆకుపచ్చ వాతావరణంలో విశ్రాంతి తీసుకోవడానికి మరియు ప్రకృతితో మమేకం కావడానికి నివాసితులను ఈ పార్క్ ఆహ్వానిస్తుంది.

జీఈఎఫ్ ఇండియా గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి మాట్లాడుతూ...బాహ్య కార్యకలాపాలు, కుటుంబ సమావేశాలు మరియు ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించే సురక్షితమైన మరియు స్వాగతించే వాతావరణాన్ని సృష్టించడం తమ లక్ష్యమన్నారు. ఫ్రీడమ్ పార్క్ వినోదం మరియు సామాజిక అనుసంధానిత కోసం ఒక ముఖ్యమైన వనరుగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తూ కమ్యూనిటీని మరింత దగ్గరకు తీసుకురావడానికి ఇది సహాయపడుతుందని పేర్కొన్నారు. నివాసితులు విశ్రాంతి తీసుకోవడానికి మరియు ప్రకృతితో కనెక్ట్ అయ్యే స్వర్గధామంగా మేము దీనిని భావిస్తున్నాము అని అన్నారు.

జెమినీ ఎడిబుల్స్ & ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్, సేల్స్ & మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ పి. చంద్ర శేఖర రెడ్డి మాట్లాడుతూ, "ఫ్రీడమ్ ఆయిల్ వద్ద , ప్రజలు ఆరోగ్యంగా తినడానికి మరియు ఆరోగ్యంగా జీవించడానికి ప్రోత్సహించడాన్ని తాము విశ్వసిస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీతో తమ భాగస్వామ్యం ద్వారా కూకట్‌పల్లి నివాసితుల జీవన నాణ్యతను మెరుగుపరచడమే కాకుండా సమాజం మరియు ప్రజా శ్రేయస్సు యొక్క భావాన్ని పెంపొందించే ప్రాంగణంగా ఇది ఏర్పడిందని అన్నారు. ఫ్రీడమ్ ఆయిల్ పార్క్ అందరికీ ప్రియమైన గమ్యస్థానంగా అభివృద్ధి చెందడం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి దిశగా వారిని ప్రోత్సహించడం పట్ల సంతోషిస్తున్నామన్నారు.

## తెలంగాణలో పలువురు డీఎస్పీల బదిలీ

కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ఉన్న ఏ.కరుణాకర్‌ను అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా ఉన్న పీ.సదయ్యను బదిలీపై హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని డీజీపీ కోరారు. ప్రస్తుతం వనపర్తి డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న కే.క్రిష్ణ కిశోర్‌ను తొర్రూర్ (మహబూబాబాద్) ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. ఇక తొర్రూర్ ఎస్‌డీపీవోగా ఉన్న వీ సురేశ్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నిర్మల్ డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న పీ.రవీందర్ రెడ్డిని ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా బదిలీ చేశారు. ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా ఉన్న డీ.ప్రసన్న కుమార్‌ను మెదక్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌పర్ చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు డీజీపీ ఉత్వర్వులు జారీ చేశారు. కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో తక్షణమే రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు.

## అప్పు ఆ కుటుంబం పాలిట శాపమైంది

కాగా, వ్యాపార నిమిత్తం స్థానిక వడ్డీ వ్యాపారులు రోషన్, వికాస్ వద్ద రెండేళ్ల కింద రూ.3 లక్షల అప్పు తీసుకున్న వేణు మొత్తానికి వడ్డీతో సహా అసలు చాలావరకు కట్టాడు. అయినా వడ్డీ, చక్రవడ్డీల కింద జమ చేసి ఇంకా అప్పు కట్టాలని లేదంటే భార్యాకూతుళ్లను అందరిలో వివస్త్రలను చేస్తామని బెదిరించారు. దీంతో వడ్డీ వ్యాపారస్తుల వేధింపులు తట్టుకోలేక వేణు కుటుంబం బాసర వద్ద గోదావరిలో దూకారు. గమనించిన స్థానిక జాలరులు అనురాధను అతి కష్టం మీద కాపాడారు. వేణు మృతదేహం లభించింది. కూతురు పూర్ణిమ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## కొడుకుతో కలిసి తల్లి, సోదరి హత్య

**భువనేశ్వర్:**

ఆస్తి కోసం ఒక వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. కొడుకుతో కలిసి వృద్ధురాలైన తల్లి, సోదరిని హత్య చేశాడు. అగ్నిప్రమాదంలో వారు చనిపోయినట్లు నమ్మించేందుకు ప్రయత్నించాడు. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయం తెలియడంతో నిందితులు అరెస్ట్ అయ్యారు. ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 5న రాత్రి వేళ హటాపాడా ప్రాంతంలోని బిల్డింగ్ మొదటి అంతస్తులో మంటలు, పొగలు రావడాన్ని స్థానికులు గమనించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అక్కడ నివసిస్తున్న 90 ఏళ్ల స్నేహలత దీక్షిత్, ఆమె కుమార్తె అయిన 62 ఏళ్ల సాయిరేంద్రి దీక్షిత్ కాలిన మృతదేహాలను గుర్తించారు. అసహజ మరణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆస్తి తగాదాల నేపథ్యంలో పక్కా ప్లాన్‌తో ఇద్దరు మహిళల హత్య జరిగినట్లు పోలీసులు తెలుసుకున్నారు. స్నేహలత దీక్షిత్ కుమారుడు జగన్నాథ్ తన కుమారుడు సంకేత్‌తో కలిసి తల్లి, సోదరి గొంతునొక్కి హత్య చేశారని పోలీస్ అధికారి తెలిపారు. ఆ తర్వాత వారి మృతదేహాలకు నిప్పుపెట్టి అగ్నిప్రమాదంలో చనిపోయినట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించారని చెప్పారు. స్నేహలత చిన్న కూతురు ఇంద్రాణి ఫిర్యాదు ఆధారంగా హతురాలి కొడుకు, మనవడ్ని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

## ఉద్యోగ నియామకాల ఎంపిక ప్రక్రియ మధ్యలో నిబంధనలు మార్చరాదు సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ :

సుప్రీంకోర్టు గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చలేమని కోర్టు పేర్కొంది. పోస్టుల ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత నియమాలను మధ్యలో మార్చలేమని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ కేసు రాజస్థాన్ హైకోర్టులో ఓ ప్రభుత్వ పోస్టు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పుల చెప్పింది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ హ్రిషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. 2008లో కె.మంజుశ్రీ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బెంచి సమర్థించింది. ఆ కేసు తీర్పు సరైనదని.. దానిని తప్పు అని చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. 'ప్రభుత్వాలు నియామక పక్రియకు ముందే నిబంధనలు సిద్ధం చేసి ఆ తర్వాతే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించాలి. చివరికి ఖాళీలను పూరించిన తర్వాత ఆ పక్రియ ముగుస్తుంది. నిబంధనలు మార్చొచ్చని ముందుగానే చెబితే పర్వాలేదు. నియామక పక్రియ నిబంధనలు ఎవరికి నచ్చినట్లు వారు మార్చడానికి వీల్లేదు. కచ్చితంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. మధ్యలో నిబంధనలు మార్చి అభ్యర్థులను ఇబ్బందిపెట్టరాదు.' అని ధర్మాసనం పేర్కొంది.

# కులగణన దేశానికి ఆదర్శం

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, ఇతర ఉద్యోగులు ఒక్కో కుటుంబం గురించి 30-40 నిమిషాల సమయం కేటాయించి వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. ఈ సర్వే భవిష్యత్తులో వివిధ రకాలుగా ఉపయోగపడుతుందని చెప్పారు. పూర్తి వివరాలు వెల్లడించి సర్వేకు సహకరించాలని శ్రీధర్ బాబు ప్రజలను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం ఉమ్మడి జిల్లాకు ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

మునుపెన్నడూ లేనివిధంగా మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తున్నామని తెలిపారు. ఈసారి సన్న రకాల ధాన్యం పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు వస్తుందని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం విధించిన నాణ్యత ప్రమాణాలను పాటించి రైతులు మద్దతు ధర పొందాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.18,000 కోట్లతో రైతులకు రుణమాఫీ చేశామని తెలిపారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు త్వరలోనే వర్తింప జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ రావు, బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్, కెడిసిసి బ్యాంక్ సిఈఓ సత్యనారాయణరావు, వైస్ చైర్మన్ పింగిలి రమేష్, డైరెక్టర్ పుచ్చిడి మోహన్ రెడ్డి, సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, డిజిఎం బ్రహ్మనందరావు, ఏజిఎంలు లోకె రాజశేఖర్, హనుమంతరావు, మేనేజర్ ఉదయశ్రీ, డీఈ దిలీప్, మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రు రమ, కాంగ్రెస్ నాయకులు శశి భూషణ్ కాచే, తిరుపతి యాదవ్, ఒడ్నాల శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, పోలు శివ, తోట చంద్రయ్య, లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులను రోడ్ల మీదకు తెచ్చిందే బీఆరెస్

హైదరాబాద్ :

కాంట్రాక్టు పనుల బిల్లులు చెల్లించకుండా సర్పంచులను రోడ్ల మీదకు తెచ్చిన బీఆరెస్ పార్టీ పెద్దలు ఇప్పుడు వారి ముందుండి ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎద్దేవా చేసారు. చిన్న చిన్న పనులకు స్థానిక కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని సర్పంచులే స్వయంగా ఆ పనులు చేస్తే అప్పటి ప్రభుత్వ పాలకులు వారిని అప్పుల పాల్జేసి తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేసారని ఆయన ఆరోపించారు. సర్పంచులకు చెల్లించాల్సిన దాదాపు రూ. 1300 కోట్లను దారి మళ్లించి ఇతర అవసరాలక వాడుకున్న వారే ఇప్పుడు వారి తరపున వకాల్తా పుచ్చుకుని దొంగ సానుభూతి కనబరుస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసునని శ్రీధర్ బాబు గురువారం నాడు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పు తెచ్చి పనులు పూర్తి చేస్తే బీఆరెస్ ప్రభుత్వం 30 నెలలు పెండింగులో పెట్టిందని ఆయన ధ్వజమెత్తారు. ఆ భారం తమ ప్రభుత్వంపై వేసి ఇప్పుడు దొంగే దొంగ అని అరిచినట్టుగా గోల చేస్తున్నారని ఆయన విమర్శించారు. పెండింగు బిల్లులతో వడ్డీలు పెరిగి అప్పులు తీర్చే మార్గం లేక 60 సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడింది నిజం కాదా అని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మరో 200 మంది ఆత్మహత్యా యత్నాలు చేస్తే అప్పటి గుడ్డి పాలకుల నుంచి కనీస స్పందన కరవైందని



ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. అప్పట్లో పిసిసి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి ఆందోళన చేస్తున్న సర్పంచులకు కాంగ్రెస్ పార్టీ తరపును మద్ధతు తెలిపితే రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొడ్తున్నారని శోకాలు పెట్టిన చరిత్ర మీది కాదా అని ఆయన బీఆరెస్ పెద్దలపై ధ్వజమెత్తారు. ఇంత అవకాశవాదం ఎక్కడా ఉండదని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కొంత మంది సర్పంచులు ఇంట్లోని మహిళల బంగారం అమ్మి వడ్డీలు కట్టినట్టు మీడియాలో అనేక వార్తలు వచ్చాయని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సర్పంచ్ అంటే గ్రామ ప్రథమ పౌరుడు. దశల వారిగా నిధులను విడుదల చేస్తామని వెల్లడించారు. మాజీ సర్పంచులు ఎవరూ రెచ్చగొట్టే వారి మాటలు నమ్మి ధర్నాలు, ఆందోళనలు చేయవద్దని శ్రీధర్ బాబు హితవు చెప్పారు.

# 11 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత




హైదరాబాద్ :

రాష్ట్రంలో 11 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారని వివరించారు. అలాగే ఆరు గ్యారెంటీల అమలులో విఫలం అయ్యారని అన్నారు. సంస్థాగతంగా భాజపాను బలోపేతం చేసుకోవాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల పక్రియపై కార్యశాల నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు, రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయని చెప్పారు. భాజపాకు సంస్థాగత ఎన్నికల వ్యవస్థ ఊపిరి అని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. మహిళ, యువత, రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సంస్థాగత ఎన్నికలకు తెలంగాణ బీజేపీ సిద్ధం అవుతుంది.. ఈ నెల 15 వరకు సభ్యత్వ సేకరణ కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. నేటితో మెంబర్ షిప్ డ్రైవ్ చివరి దశకు చేరుకుంది. బూత్ , మండల, జిల్లా కమిటీ ల ఎన్నికలపై మార్గనిర్దేశర నిర్వహించేందుకు సిద్ధమైంది బీజేపీ. బూత్ కమిటీ ఎన్నికల షెడ్యూల్ పై చర్చ నిర్వహిస్తున్నారు ఈ నెల 15 నుండి 25 వరకు బూత్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర , జిల్లా రిటర్నింగ్ అధికారుల నియామకం జరిగిన విషయం తెలిసిందే. తెలంగాణలో బీజేపీ సభ్యత్వం సుమారు 31 లక్షలు దాటిందని అంచనా వేస్తున్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ బీజేపీ అన్నారు. రెగ్యులర్ గా సంస్థాగత ఎన్నికల నిర్వహించుకుంటున్న పార్టీ బీజేపీ అని తెలిపారు. తెలంగాణ లో సుమారు 35 లక్షలు చేరుకుందని అన్నారు. ఈ నెల 15 వరకు సభ్యత్వ సేకరణ కొనసాగుతుందన్నారు. వివిధ స్థాయిల్లో బీజేపీ కమిటీల్లో 30శాతం కొత్త వారికి అవకాశం ఇచ్చారని తెలిపారు. బూత్ నుండి జాతీయ స్థాయి వరకు సమర్ధులైన వారితో కమిటీ వేసినట్లు వెల్లడిరచారు. బీజేపీలో కొత్త వారిని చేర్పించాలని, భాగస్వామ్యులను చేయాలన్నారు. ఇతర పార్టీల్లో ఏమీ జరుగుతుంది తెలుసు. కుటుంబాల ఆధారంగా నడిచే పార్టీ లు అవి. ఆ పార్టీ లకి తరవాత ప్రెసిడెంట్ అవుతారో ముందే చెప్పొచ్చని తెలిపారు. బీజేపీ మాత్రం ప్రజాస్వామ్యంగా ముందుకు వెళ్తుంది? ఎవరైనా పార్టీ లో అధ్యక్షులు కావొచ్చన్నారు. ఇకపోతే తెలంగాణ పరిస్థితి పెనం నుండి పొయ్యి లో పడ్డట్టు అయిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుంది. ఒక కొత్త పెన్షన్ ఇవ్వలేదని మండిపడ్డారు. అప్పులు మాత్రం విపరీతంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేయాలని కిషన్ రెడ్డి తెలిపారు. ఒక వైపు సంస్థాగత అంశాల పై దృష్టి పెడుతూనే.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. ప్రజలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు కి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లు, మధ్య దళారులతో కుమ్మక్కు అయ్యి రైతులకు నష్టం కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ పనులు మాత్రం జరగడం లేదన్నారు. ఇక్కడ ఇచ్చిన హామీలు అమలు చేసినట్టు మహారాష్ట్రలో దుర్మార్గంగా ప్రకటనలు ఇచ్చుకుంటున్నారు.

## అంతర్జాతీయంగా కొనుగోళ్ల మద్ధతులో క్షీణత

### స్వల్పంగా తగ్గుతున్న బంగారం ధరలు

ముంబై :

అక్టోబరులో ఎన్నడూ లేనంత గరిష్ఠస్థాయిలకు బంగారం, వెండి ధరలు చేరినా..కొనుగోళ్ల మద్దతు లేకపోవడంతో మెల్లగా దిగి వస్తున్నాయి. అయితే పెరిగనప్పుడు ఉన్న దూకుడు దిగి రావడంలో కనిపించచడం లేదు. దీంతో బంగారం ఇప్పటికీ కరీదైనదిగానే ఉంది. డాలర్ విలువ ఎన్నడూ లేనంత గరిష్ఠస్థాయి అయిన రూ.84.30కు చేరింది. మనదేశం బంగారం దిగుమతులకు పూర్తిగా దిగుమతుల పైనే ఆధారపడి ఉన్నందున, డాలర్ల రూపేణానే అంతర్జాతీయంగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా ఇతర దేశాల్లో బంగారం ధరలు బాగా తగ్గినా, మనదేశంలో ఆ మేర ప్రయోజనం మన కొనుగోలుదార్లకు ఉండటం లేదు. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర బుధవారం ఒక్కరోజే 75 డాలర్ల మేర తగ్గి 2660 డాలర్లకు చేరింది. ఫలితంగా హైదరాబాద్ బులియన్ విపణిలో బుధవారం 10 గ్రాముల మేలిమి (999 స్వచ్ఛత) బంగారం ధర రూ.80,000 కంటే దిగి, రూ.79,100కు పరిమితమైంది. కిలో వెండి ధర కూడా రూ.92,700కు చేరింది. పసిడి ఔన్సు గరిష్ఠంగా అక్టోబరు 30న 2801 డాలర్లకు చేరింది కూడా. ఆ పరిస్థితుల్లో దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రికార్డు స్థాయిలో రూ.82,000కు చేరింది. కిలో వెండి ధర రూ.1.02 లక్షలను అధిగమించింది కూడా. ఫలితంగా దేశీయంగా ఈ లోహాల అమ్మకాలు గణనీయంగా తగ్గాయని బులియన్ సంఘాలు చెబుతున్నాయి.

# కనుమరుగు కానున్న మణుగూరు సింగరేణి సంస్థ ?

**మొదటిపేజీ తరువాయి**



ఉన్న గనులను ప్రైవేటు యాజమాన్యం చేతిలోకి . వెళ్లిపోయాయి. ఇప్పటివరకు సిరి సంపదలతో వెలిగిపోయిన సింగరేణి కాలరీస్ సంస్థ, పాలకుల విధానాలు లోప భూయిష్ట నిర్ణయాలతో ఇక్కడ సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడింది. మణుగూరు సింగరేణి కాలరీస్ సంస్థ బొగ్గు ఉత్పత్తి రాబోవు ఆరు ఏళ్ల వరకే పరిమితి ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మణుగూరు ఏరియా ప్రాంతంలో సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులను ఇప్పటికే ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం జరిగింది. ఉన్న ఉపరితల గనులను ప్రైవేటు కంపెనీల యాజమాన్య చేతుల్లోకి వెళ్లిపోయాయి. మణుగూరు ఏరియాలో సింగరేణి సంస్థ 50% వరకు ప్రైవేట్ కంపెనీలో యాజమాన్యం చేతుల్లోకి వెళ్లిపోయింది. మిగతా సగభాగం సింగరేణి సంస్థ యాజమాన్య పరిధిలో కొనసాగుతుంది. ఇప్పటివరకు ఉపరితల గనుల విస్తరణ కోసం అటవీశాఖ అనేక అనుమతులు ఇవ్వటం జరిగింది. ఇప్పుడు పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ పేరుతో అటవీశాఖ గనుల విస్తరణకు అనుమతిని నిరాకరించింది. ఇప్పటి వరకు మణుగూరు ఏరియాలో 50 ఏళ్ల చరిత్రలో నల్ల బంగారంతో వెలిగిపోయిన సింగరేణి సంస్థ ఇప్పుడు ప్రమాదంలో పడనున్నది. ఈ ప్రాంతంలో భూగర్భం నుంచి ఉత్పత్తి బొగ్గు ఖనిజ సంపద ఈ ప్రాంతంలో కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నట్లు కార్మికులు, కార్మిక సంఘాలు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి కాలరీస్ సంస్థని నమ్ముకుని కొన్ని వేల కుటుంబాలు ఆధారపడి జీవనం గడుపుతున్నారు. రాబో ఆరు ఏళ్ల వరకే బొగ్గు ఉత్పత్తి అవకాశం ఉన్నట్లు సమాచారం వెలబడడంతో ఇక్కడ స్థానికులు కూడా ఆందోళన మొదలైంది. 50 ఏళ్ల క్రితం ఎటువంటి సౌకర్యాలు లేక పూర్తి మారుమూల ప్రాంతంగా ఉన్న మణుగూరు కి సింగరేణి ద్వారా సిరులు కురిపించింది. గనులు ప్రారంభోత్సవ సమయంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు ఇంకా ఆందోళనలే కొనసాగిస్తున్నారు. సరైన ప్యాకేజీ అందక ఇప్పటికీ రాజకీయ పోరాటాలతో సింగరేణి సంస్థలు అనుబంధంగా పనిచేసే కమ్యూనిస్టులు పార్టీలు నిర్వాసితులకు అండగా నిలబడ్డారు. సింగరేణి సంస్థ త్వరలో మూతపడుతుంది అనే సమాచారం మణుగూరు ప్రాంతంలో ప్రతి ఒక్కరి హృదయాలను కలిసి వేస్తుంది. సింగరేణి లేని మణుగూరు కి సిరులు కురిపించేది ఎలాగా అనే వాదన ప్రజల్లో బలంగా వినిపిస్తుంది. సింగరేణి మనుగడ కాపాడటం కోసం సింగరేణి కార్మికులు ఎదుర్కొనే ప్రధాన సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మిక సంఘాల అభిప్రాయాలను తెలియపరుస్తూ, మణుగూరు సింగరేణి కాలరీస్ కి నూతన బొగ్గు గనులు ప్రారంభించాలి. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి సంస్థకు రావాల్సిన బకాయిలు వసూలు చేయాలి మణుగూరు ఏరియా మనుగడ కోసం సింగరేణి ఆధ్వర్యంలోని సింగరేణి కార్మికులతోనే గనులు నడిపించాలి. భౌగోళిక పరిస్థితుల రీత్యా సర్ఫేస్ మైనర్ యంత్రాలు అవసరమనుకుంటే సింగరేణి సంస్థ కొనుగోలు చేసి ఆ సంస్థలో పనిచేస్తున్న ఆపరేటర్లు చేతనేని నడిపించాలి. సింగరేణి ఈపీ ఆపరేటర్లు సూటబుల్ జాబు అగ్రిమెంట్ అమలు చేయించాలి. అలాగే కారుణ్య నియామకాల కు దరఖాస్తులు చేసుకున్న ప్రతి కార్మికు అన్ఫిట్ చేసి డిపెండెంట్ జాబులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే సింగరేణి కార్మికులు పాలిట పెనుబారంగా మారిన ఆదాయ పన్ను మినహాయింపుకై తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని అలాగే పార్లమెంటుకు కోల్ ఇండియా ఆదాయపు పన్ను మినహాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే సింగరేణి కార్మికులకు సొంత ఇంటి కల నిజం చేసేందుకు ప్రభుత్వమే ఉచిత గృహ పథకం రూపకల్పన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మణుగూరు ఏరియాలో 500 నూతన ఎంసీ క్వార్టర్స్ ను మంజూరు చేపించాలని డిమాండ్ చేస్తున్నారు. సింగరేణిలో విద్యాభివృద్ధికి సెంట్రల్ సిలబస్ అమలకు తగు చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పరిస్థితి ఇలా ఉంటే సింగరేణి ప్రమాదానికి గురై విధంగా పాలకుల నిర్ణయాలు స్థానికుల పాలిట శాపంగా మారనున్నాయి. సింగరేణి చరిత్రలో ఉపరితల గనులు 1996 డిసెంబర్ ఆరో తారీఖున, అలాగే ఓ సి ఫోర్ గనులను డిసెంబర్ 10 2014 సంవత్సరంలో గనులు ప్రారంభించారు. రికార్డు స్థాయిలో లాభాలను అధిగమిస్తూ 113. 40 లక్షల టన్నులు బొగ్గు సరఫరా చేయవలసి ఉండగా, రికార్డు స్థాయిలో 151.95 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేసి లాభాల బాటలో మణుగూరు సింగరేణి కాలరీస్ ఉంది. ఇంత ఘన చరిత్ర ఉన్న మణుగూరు సింగరేణి కాలరీస్ కనుమరుగు కానున్నదిని సమాచారం స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారుకనుమరుగు కానున్న సింగరేణి సంస్థపర్యావరణ పేరుతోఅనుమతులు నిరాకరణ తో ఆందోళనలో కార్మిక సంఘాలు ప్రైవేటీకరణ దిశగా నిర్ణయాలు. పాలకుల నిర్ణయాల్లో మార్పులు చేసుకొని కొత్తగన్లకు అనుమతులు ఇస్తూ మణుగూరు సింగరేణి సంస్థను కాపాడాల్సిందిగా స్థానికులు సైతం పాలకులను డిమాండ్ చేస్తున్నారు.



సికింద్రాబాద్ పరిధిలోని తార్నాక డివిజన్‌కు నూతనంగా జలమండలి మేనేజర్‌గా నియమితులై పదవి బాధ్యతలు స్వీకరించిన కుషాల్ కుమార్ గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిని వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్‌డివిజన్‌లో మరింత అభివృద్ధి పనులు చేపట్టేందుకు పలు సూచనలు ఇచ్చారు. అలాగే, డివిజన్‌లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

– హైదరాబాద్, (నినాదం న్యూస్):

## ప్రజల నుంచి పుట్టిన నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### బడంగ్ పేట్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహా రెడ్డి





**హైదరాబాద్, (నినాదం న్యూస్):** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా బడంగ్ పేట్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహా రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వెలువడిన రేవంత్ రెడ్డి జీవిత చరిత్ర "డైనమిక్ లీడర్ " పుస్తకాన్ని ముఖ్యమంత్రి గారి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి సోదరులు ఎనుముల కృష్ణారెడ్డి మరియు ఎనుముల జగదీశ్వర్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకుడు దిండు శ్రీనివాస్ గౌడ్, ఐఎన్టియూసీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకుడు రమేష్ గౌడ్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


పంజాబ్ నేషనల్ బ్యాంక్ punjab national bank

**పంజాబ్ నేషనల్ బ్యాంక్:** సర్కిల్ శాస్త్ర సెంటర్-హైదరాబాద్, రీజెన్సీ ప్లాజా, మైత్రి విహార్ ఏరియా, గాయత్రి నగర్, ప్లాట్ నం. 3, అమీర్‌పేట్, హైదరాబాద్-500038. ఇ-మెయిల్: cs4732@pnb.co.in

**అనుబంధము-IV (రూల్ 8(1))**
**స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **తేది: 31.07.2024న పంజాబ్ నేషనల్ బ్యాంక్** వారి అధీకృత అధికారి అయిన ఈ క్రింది సంతకందారు జారీ చేసిన **డిమాండ్ నోటీస్** ప్రకారం ఋణగ్రహీతలు/ హామీదారులు/ తనఖాదారులైన: **1) శ్రీమతి సీత మహాలక్ష్మీ శ్రీకాకుళపు, 2) శ్రీ శ్రీకాకుళపు వెంకట మురళి మరియు 3) శ్రీ కె. ఆనందం** వారిని నోటీసులో తెలిపిన మొత్తము **తేది: 30.07.2024 నాటికి రూ. 17,12,350.00 (రూపాయలు పదిహేడు లక్షల పన్నెండు వేల మూడు వందల యాభై మాత్రమే) + తేది: 31.07.2024** నుండి వడ్డీ మరియు వ్యయాలతో కలిపి, డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత ఏవైన చెల్లించియున్నచో వాటిని మినహాయించగా మిగిలిన మొత్తమును నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోపుగా తిరిగి చెల్లించమని కోరడమైనది.

సదరు ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులు బకాయి మొత్తమును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ ఈ క్రింద తెలిపిన ఆస్తిని **06 నవంబర్, 2024న** ఈ క్రింది సంతకందారు స్వాధీనం చేసుకోవడమైనదని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులను మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు, ఒక వేళ జరిపినట్లయితే **పంజాబ్ నేషనల్ బ్యాంక్** వారికి చెందవలసిన బకాయి మొత్తము **తేది: 30.07.2024** నాటికి **రూ. 17,12,350.00 (రూపాయలు పదిహేడు లక్షల పన్నెండు వేల మూడు వందల యాభై మాత్రమే) + తేది: 31.07.2024** నుండి తదుపరి వడ్డీ మరియు వ్యయాలతో కలిపి, డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత ఏవైన చెల్లించియున్నచో వాటిని మినహాయించగా మిగిలిన మొత్తము క్రింద వర్తించును.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు మీకు లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా ఋణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులను కోరడమైనది.

**స్థిరాస్తి వివరణ:**

రంగారెడ్డి జిల్లా, బాలానగర్ మండలం, జిహెచ్‌ఎంసి కూకట్‌పల్లి సర్కిల్, కూకట్‌పల్లి గ్రామం, శ్రీ వివేకానంద్ నగర్ వద్ద 245 చ.గ.లు లేదా 204.82 చ.మీ.ల విస్తీర్ణము గల ప్లాట్ నెం. 285పై ఇ.నెం. 14-20-677/285తో గల గృహము యావదాస్తి. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం. 252పై ఇ.నెం. 20-677/252/2/ఎ. **దక్షిణం:** 25'-0" వెడల్పు రోడ్డు, **తూర్పు:** ప్లాట్ నెం. 284లో ఎసి షీట్ రూఫ్ కలిగిన రూమ్, **పడమర:** ప్లాట్ నెం. 286పై ఇ.నెం. 14-20-677/286.

ఆస్తి యజమాని: శ్రీమతి సీత మహాలక్ష్మీ శ్రీకాకుళపు భర్త శ్రీకాకుళపు వెంకట మురళీ.

**తేది: 06.11.2024** సం/- అధీకృత అధికారి
ప్రదేశము: హైదరాబాద్ పంజాబ్ నేషనల్ బ్యాంక్, హైదరాబాద్


# తొలగిన అడ్డంకులు

- మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కు లైన్ క్లియర్
- గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామస్తులతో మంత్రి సురేఖ భేటీ
- 253 ఎకరాల భూసేకరణకు అంగీకారం తెలిపిన రైతులు
- 233 మంది రైతులు, ప్లాట్ల యజమానులతో చర్చలు సఫలం





**వరంగల్ బ్యూరో (నినాదం):** ఓరుగల్లు వాసుల గగనయానం కల త్వరలో నెరవేరబోతున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ గా మామునూరును తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రయాణికుల సర్వీసులతోపాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజ్, కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి మామునూరు ఎయిర్ పోర్టు ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ నిమిత్తం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామస్తులతో మంత్రి సమావేశమై విమానాశ్రయ ఏర్పాటుకు కావలసిన 253 ఎకరాల భూసేకరణపై మాట్లాడారు. ఎయిర్ పోర్ట్ వస్తే స్థానిక ప్రజల జీవితాలు ఎలా మెరుగుపడతాయో సోదాహరణంగా వివరించి, వారిని ఒప్పించారు. ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు తమ అమూల్యమైన భూములు అప్పగిస్తున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తామని మంత్రి సురేఖ స్పష్టంచేశారు. భూమి కోల్పోతున్న 233 మంది రైతులు, ప్లాట్ల యజమానులతో చర్చించి వారి అభిప్రాయాల మేరకు ఇతర భూమి కేటాయించి, వారు కోరిన విధంగా మౌలిక సదుపాయలైన రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, ఇతర సదుపాయాలను కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈసందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు ధీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ ఉందని మంత్రి సురేఖ పునరుద్ఘాటించారు. వరంగల్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వరంగల్ విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప తోపాటు, భద్రకాళి 1000 స్తంభాల ఆలయం, వరంగల్ కోట కాకతీయ కట్టడాలు, మెగా టెక్స్టైల్ పార్క్ అవసరాలు, భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మామునూరు ఎయిర్ పోర్ట్‌ను అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని, జీఎంఆర్ సంస్థను ఒప్పించి మామునూరు ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు మార్గం సుగమం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి సురేఖ కృతజ్ఞతలు తెలిపారు.


గాయత్రి షుగర్స్ లిమిటెడ్

GAYATRI

రిజిస్టర్డ్ & కార్పొరేట్ ఆఫీస్: 6-3-1090, బి-2, టి.ఎస్.ఆర్. టవర్స్, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్-500082, తెలంగాణ, ఇండియా. టెలిఫోన్: +91 4023414823, 23314826, ఫ్యాక్స్: +91 4023414827
ఇ-మెయిల్: compliance.gayatrisugars@gayatri.co.in CIN: L15421TG1995PLC020720

**30 సెప్టెంబర్ 2024 నాటి త్రైమాసికపు మరియు అర్ధ సంవత్సర ముగింపు ఆడిట్‌కాని స్వతంత్ర ఆర్థిక ఫలితాల నమూన**

(రూ. లక్షలలో)

| వివరములు | త్రైమాసికపు ముగింపు 30.09.2024 (ఆడిట్ కానివి) | త్రైమాసికపు ముగింపు 30.09.2023 (ఆడిట్ కానివి) | అర్థ సంవత్సర ముగింపు 30.09.2024 (ఆడిట్ కానివి) |
|---|---|---|---|
| ఆపరేషన్స్ నుండి మొత్తము ఆదాయము | 1,160.73 | 1,892.53 | 3,132.00 |
| ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టము) (పన్నుకు మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ పూర్వము) | (2,133.31) | (1,704.73) | (3902.14) |
| ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టము) పన్నుకు పూర్వము (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తర్వాత) | (2,133.31) | (1,704.73) | (3902.14) |
| ప్రస్తుత కాలమునకు నికర లాభము/(నష్టము) పన్నుల తర్వాత (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్ తర్వాత) | (2,133.31) | (1,704.73) | (3902.14) |
| ప్రస్తుత కాలమునకు మొత్తం సమగ్ర ఆదాయం (ప్రస్తుత కాలమునకు లాభము/ (నష్టము) కలిగియుండి) (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయము (పన్ను తర్వాత) | (2,144.11) | (1,711.01) | (3,923.75) |
| ఈక్విటీ షేర్ క్యాపిటల్ | 6,736.38 | 5,853.38 | 6,736.38 |
| రిజర్వులు (రివాల్యేషన్ రిజర్వు మినహాయించి) క్రితం సంవత్సరం ఆడిట్ అయిన బ్యాలెన్స్ షీట్‌లో చూపిన విధంగా | - | - | - |
| ఒక్కొక్క షేర్ నుండి ఆదాయములు (ఒక్కొక్కటి రూ. 10 చొప్పున) (ఆపరేషన్స్ కొనసాగిన లేక కొనసాగక పోయిననూ) బేసిక్ (రూ. లలో) డైల్యూటెడ్ (రూ. లలో) (* యాంటీ డైల్యూటివ్) | (3.21) *(3.21) | (3.07) *(3.07) | (5.94) *(5.94) |

**గమనిక:**
1. పైన తెలిపిన ఫలితములను ఆడిట్ కమిటీ ద్వారా సమీక్షించి మరియు సిఫార్సు చేసి మరియు 06.11.2024న జరిగిన కంపెనీ యొక్క బోర్డు డైరెక్టర్ల సమావేశంలో ఆమోదించడమైనది.
2. సెబి (లిస్టింగ్ & అదర్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద త్రైమాసికపు/ సంవత్సరపు ఆర్థిక ఫలితాల వివరణాత్మక నమూనాను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదు చేయడమైనది. ఈ వివరణాత్మక త్రైమాసికపు/సంవత్సరపు ఆర్థిక ఫలితాల పూర్తి నమూనాను స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ అనగా **BSE** లిమిటెడ్ యొక్క వెబ్‌సైట్: **www.bseindia.com** వద్ద మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ అనగా **www.gayatrisugars.com** వద్ద కూడా లభ్యమగును.

బోర్డువారి ఆదేశానుసారం
గాయత్రి షుగర్స్ లిమిటెడ్ కొరకు
సం/- టి. సరిత రెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్
(DIN: 00017122)

ప్రదేశము: హైదరాబాద్
తేది: 06.11.2024


## ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలి

- నిర్దిష్ట ప్రణాళికలతో లక్ష్యాలను సాధించుకోవాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ములుగు ప్రతినిధి,(నినాదం):** ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచేలా వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వివిధ ఆరోగ్య సమస్య లతో వస్తున్న రోగులను, ఆప్యాయతతో పలకరిస్తూ, విలువలతో కూడిన వైద్య సేవలను అందించాలన్నారు. మెరుగైన వైద్య అందించినప్పుడే వైద్య ఆరోగ్య శాఖ పట్ల ప్రజలలో నమ్మకం పెరిగి ఎక్కువమంది ప్రభుత్వ దావఖానకు వస్తారని తెలిపారు .అత్యవసర నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏమైనా పరికరాలు , అవసరం పడితే వాటిని కొనుగోలు చేసి వైద్య సేవలు అందించాలని, వాటికి అవసరమైన బడ్జెట్ అందిస్తామన్నారు. వైద్య శాఖ చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలుపై ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును తెలుసుకొని, నిర్దిష్టమైన ప్రణాళికతో, ఒక కాలపరిధిని ఎంచుకొని కార్యక్రమాలను ముందుకు తీసుకుపోయి లక్ష్యాలను సాధించాలని డాక్టర్లకు తెలిపారు. వైద్య సేవలు అందించడంలో ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై ఎవరు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించకూడదని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. గోపాలరావు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారు టేలి మానస్ ఫోన్ కాల్ లను వినియోగించుకోవాలని, అలాగే పాఠశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యం మీద అవగాహన కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో వచ్చే మహిళలకు క్యాన్సర్ల , థైరాయిడ్ మధుమేహం మొదలగు వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ వారికి వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధిక శాఖ అధికారి డాక్టర్. విపిన్ కుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రణధీర్ ,డాక్టర్ భవ్యతో పాటు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్స్ ఆర్ బి ఎస్ కే డాక్టర్స్ డెమో సంపత్, ఎన్ హెచ్ ఎం తిరుపతిరెడ్డి ,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


### ధాన్యం మద్దతు ధరతో 500 రూపాయల బోనస్

## అర్హులైన ప్రతి రైతుకు అందిస్తాం

### రాష్ట్ర, ఐటి, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 07 నినాదం న్యూస్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మల్హర్ , మండలం కొండంపల్లి గ్రామంలో రాష్ట్ర, ఐటి, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సన్న రకం ధాన్యం క్రింద ఏ రకం ధాన్యాన్ని పరిగణిస్తున్నామనే అంశంపై రైతులకు స్పష్టంగా తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దొడ్డు రకం, సన్న రకం తేడాను స్పష్టంగా తెలియజేసేలా కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిల్లాలో ఉన్న మిల్లుల నుంచి బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ ఆఫిడవిట్ తీసుకొని ధాన్యం కేటాయింపులు చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తాలు పేరుతో రైతులకు కోతలు పెట్టవద్దని పేర్కొన్నారు. సన్న రకం దాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ అర్హులైన ప్రతి రైతుకు అందాలని అన్నారు. జిల్లా సరిహద్దులో పటిష్ఠ పర్యవేక్షణ చేయాలని ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం మన జిల్లాకు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కొనుగోలు ప్రక్రియ సజావుగా, సక్రమంగా చేపట్టాలని, రైతుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. విక్రయాల్లో తీసుకోవాల్సిన నాణ్యత ప్రమాణాలపై రైతులకు వివరించాలని, రైతుల కోసమే మనం ఉన్నామనే విషయాన్ని మర్చిపోవద్దని అధికారులకు సూచించారు. రైతులు విక్రయాలకు వచ్చే తప్పుడు వ్యవసాయ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు బుక్ జిరాక్స్ కాపీలను వెంట తెచ్చు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించామని తెలిపారు. సమగ్ర కార్యచరణ అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఖమ్మం జిల్లాలో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటే ప్రస్తుతం 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన వేయింగ్, తేమ పరిశీలించే పరికరాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. మన జిల్లా సరిహద్దులో చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులు 24 గంటల పాటు తనిఖీ చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వ్యవసాయ అధికారులు వారి పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యత, దిగుబడి వివరాలను ధ్రువీకరణ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్పాలిన్లు, గన్ని సంచులు అందుబాటులో పెట్టామని అన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం తరలించేలా అవసరమైన వాహనాలు సన్నద్ధం చేశామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. అత్యవసర సమయాల్లో దాన్యం నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిల్లర్లతో సమావేశం నిర్వహించి బియ్యం అప్పగించిన వెంటనే బ్యాంకు గ్యారంటీలు విడుదల చేస్తామని సమాచారం అందించామని, బ్యాంకు గ్యారంటీ ఇచ్చేందుకు జిల్లాలో మిల్లర్లు అంగీకరించారని తెలిపారు. ధాన్యం రవాణాకు కేటాయించిన వాహనాలు ఇతర పనులకు వినియోగించకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయితా ప్రకాష్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఎస్వో శ్రీనాథ్, డిఎం కనక శేఖర్, డీసీవో వాలియా నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్హూర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో మంత్రి పొన్నం పర్యటన



**భీమదేవరపల్లి నవంబర్ 7 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన.. భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ లో ఇటీవల మరణించిన భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సామల లింగమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సామల లింగమూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణన ఇంటింటి కుటుంబ సర్వే పై ఎన్యుమరెటర్స్ వేస్తున్న స్టిక్కరింగ్ ను గట్ల నర్సింగపూర్ లో పరిశీలించారు. కుల గణన పై అధికారులకు సమగ్ర వివరాలు ఇవ్వాలని సమాచారం గోప్యత ఉంటుందని స్థానికులకు తెలిపారు. అనంతరం స్కూల్ కి వెళ్తున్న విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. గట్ల నర్సింగపూర్ కూరగాయలు అమ్మతున్న మహిళల తో ముచ్చటించారు. వ్యాపారాలు ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు. గ్రామంలో పలు వీధుల్లో తిరుగుతూ ప్రజలతో ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు..

## పత్తి రైతుల ధర్నా



**చింతపల్లి, నవంబర్ 07(నినాదం న్యూస్):** తేమ పేరుతో పత్తి కొనుగోలు చేయకుండా సీసీఐ నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తున్నా రని మండల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలం కేంద్రంలో గురువారం పత్తి మిల్లు ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినా గాని ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు వాపోయారు. వెంటనే పత్తి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

## మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా సాగంటి కొండయ్య



**ధర్మారం నవంబర్ 7 ( నినాదం న్యూస్):** బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులుగా ఖిలావనపర్తి గ్రామానికి చెందిన సాగంటి కొండయ్య, ముదిరాజ్ ను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు నల్ల వెల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ నియామక పత్రం ఈ రోజు నుండి అమల్లోకి వస్తుంది. ఈ సందర్భంగా సాగంటి కొండయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించినందుకు బీసీల సంక్షేమం కొరకు అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎన్నం ప్రకాష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరుగంటి భార్గవరామ్,పెద్దపల్లి జిల్లా బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు కొమ్మ స్వామి, మిత్రులు ముత్యాల విరస్వామి, సాగంటి నర్సయ్య, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభం

**భీమదేవరపల్లి నవంబర్ 7 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో సర్ సివి రామన్ జయంతి సందర్భంగా చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభమ య్యాయి. ఈ సైన్సు సంబరాలు సందర్భంగా సైన్స్ కు సంబంధించిన పరీ క్షలు నిర్వహించారు ఈ పరీక్షలో మండలంలోని 12 పాఠశాల నుండి 1140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సైన్స్ సంబరాలు కార్యక్రమంలో ముల్కనూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు, వంగర గురుకుల విద్యార్థినిలు పాల్గొన్నారు. ముల్కనూర్ హై స్కూల్ ఇన్చార్జి హెడ్మాస్టర్ పోలినేని రవీందర్ ప్రశ్నపత్రాన్ని విడుదల చేశారు. విద్యార్థులు ప్రశ్నించడం ద్వారానే జ్ఞానాన్ని పొందుతారని ఈ సందర్భంగా అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రామంచ బిక్షపతి ముల్కనూర్ మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ రెహమాన్ తో కలిసి పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 21న జరిగే మండల స్థాయి పోటీలకు ప్రతి పాఠశాల నుండి 8, 9,,10 తరగతుల నుండి ఒక్కో విద్యార్థి చొప్పున ముగ్గురు ఒక జట్టుగా ఏర్పడి ఈ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ హైస్కూల్ ఇన్చార్జి హెడ్మాస్టర్ పోల్నేని రవీందర్, ఉపాధ్యాయులు దాసరి రవీందర్ కే సురేష్ రాజ్ మహమ్మద్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

సంపాదకీయం

# భారత్‌తో బంధం బలపడేనా ?

అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ మరోమారు ఎన్నిక కావడంతో..ఇప్పుడు మనదేశం కోణంలో చూస్తే సంబంధాలు బలంగానే ఉండే అకాశం ఉంది. ట్రంప్‌తో ప్రధాని మోడీకి మధ్య మంచి మిత్రృత్వం ఉన్న కారణంగా ఆశాజనకంగా ఉంటుందన్న అంచనాలు మొదలయ్యాయి. అయితే ప్రధానంగా హెచ్`1 వీసాలు, గ్రీన్ కార్డులు, ఉద్యోగావకాశాలు వంటి వాటిపైనే యువత దృష్టి సారిస్తోంది. నిజానికి ఇప్పుడు ఉద్యోగ భద్రత అన్నది అమెరికాలో లేకుండా పోయింది. ఏ రోజు ఎవరిని ఊడబెరుకుతారో అన్నది సమస్యగా మారింది. ఈ అంశాల్లో మోడీ కూడా ట్రంప్‌తో అమరమరికలు లేకుండా మాట్లాడాలి. అమెరికాకు మళ్లీ స్వర్ణయుగాన్ని తీసుకువస్తానని అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే చెప్పారు. నిజానికి రాజకయాంగా మార్పు జరిగినప్పుడు ప్రపంచంలో ఏ దేశంలో అయినా కొత్త ఆశలు పుట్టుకుని వస్తాయి. అగ్రరాజ్యం అమెరికాలో కూడా ఇప్పుడు అదే పరిస్థితి ఉంది. ఈ రాజకీయ మార్పు అమెరికాను మళ్లీ గొప్పదిగా చేసేందుకు దోహదం చేయగలిగితే..అది ప్రపంచ దేశాలపైనా ప్రభావంచూపుతుంది. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్లు నిర్వహించిన ప్రచారం అతిపెద్ద రాజకీయ ఉద్యమంగానే చూడాలి. బైడెన్ వయసు మీద పడడంతో సరిగ్గా నిర్ణయాలు తీసుకోలేక పోయారు. అలాగే కమలా హారిస్ కూడా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ధృఢమైన నిర్ణయాలకు అడుగువేయలేక పోయారు. ఇది ఓ రకంగా సగటు అమెరికన్లను కలచి వేసిందనే చెప్పాలి. అందుకే గతంలో ఎప్పుడూ లేనంతగా అమెరికా గతంలో ఎన్నడూ చూడని విజయాన్ని ట్రంప్ చేజిక్కించుకున్నారు. అందువల్ల ఈ విజయానికి మరింత ప్రాముఖ్యత ఉంది. అమెరికా ను బలంగా, సురక్షితంగా, సుసంపన్నంగా చేసేవరకు విశ్రమించబోనని కూడా ట్రంప్ ప్రకటించారు. దేశాన్ని తీర్చిదిద్దే ప్రయత్నంలో, తన కర్తవ్య నిర్వహణలో ప్రజలంతా చేతులు కలపాలని కోరుతున్నట్లుగా కూడా ట్రంప్ ప్రకటించారు. అమెరికా చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ప్రజలు ఏకపక్షంగా ట్రంప్ విజయానికి దోహదపడ్డారు. భిన్నమైన సంస్కృతులు నేపథ్యాలున్నవారు ఉమ్మడి లక్ష్యాల కోసం ఏకతాటిపైకి రావడం చరిత్రాత్మకం. ప్రజలకిచ్చిన వాగ్దానాలు పూర్తిచేయడంలో ఏ శక్తీ తనను ఆపజాలదని ట్రంప్ కూడా ధృఢంగానే ఉన్నారు. అసలైన అమెరికన్లకు దేశంలో ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతున్నాయనీ, అమెరికా ఉత్పత్తుల అమ్మకాలకు అన్నిచోట్ల అడ్డంకులు ఎదురవుతున్నాయన్నదే ట్రంప్ నినాదం. తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు కూడా ఆయన ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ట్రంప్ పదేపదే చెబుతు న్నట్లుగా.. అమెరికా ఎదుర్కొంటున్న ఈ సమస్యకు కారణం నాలుగు దశాబ్దాలుగా ఆ దేశ పాలకులు అనుసరించిన విధానాలేనని చెప్పవచ్చు. అలాగని అమెరికా మీద ఆధారపడ్డ ఇతర దేశాల వారిని చులకన చేయడం కూడా మంచిది కాదు. అన్ని దేశాల ఆర్థిక విధానాలను నయానా భయాన సరళీకరించి విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచేలా చేసింది అమెరికా విధానకర్తలే. 1990ల నుంచి బాగా ఊపందుకున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక దశ దాటిన తర్వాత అవసరమైన స్థాయిలో అమెరికన్ యువతకు ఉద్యోగాలను సృష్టించలేదు. ఈ రంగంలో కూడా చౌకగా లభ్యమయ్యే ఆసియా నిపుణులే ఎక్కువగా లబ్ది పొందారు. ఇటీవల వచ్చిన కృత్రిమ మేధో సాంకేతిక పరిజ్ఞానం కూడా ఊడిపోయే ఉద్యోగాలతో పోల్చితే సృష్టి అయ్యే ఉద్యోగాల సంఖ్య తక్కువే. కోవిడ్ అనంతరం ఐటీ రంగంలో హేమాహేమీలు అనదగిన కంపెనీలు కూడా పోటీలు పడి ఉద్యోగులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ ప్రధానంగా మధ్యతరగతి శ్వేత జాతీయులను ఆకర్షించడమే లక్ష్యంగా చేసుకుని రాజకీయాలను మొదలుపెట్టారు. మొదటిదఫా అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడేనాటికే ఆ దిశలో అడుగులు వేసి విజయం సాధించారు. శ్వేతజాతి మధ్యతరగతికి ఉద్యోగ అవకాశాలు దక్కకపోవటానికి విదేశాలే కారణమని దుమ్మెత్తిపోశారు. తన ఉత్పత్తులతో అమెరికా మార్కెట్‌ను ముంచెత్తిన చైనాతో మొదలుపెట్టిన రాజకీయయుద్ధంలో అవసరమను కున్న చోట భారత్‌నీ లాగారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ విపరీతంగా దిగుమతి సుంకాలు విధిస్తోందని విరుచుకుపడ్డారు. తాజా ఎన్నికల్లో అయితే మంచి జీతాలుండే ఉద్యోగాలన్నిటినీ భారతీయులు కొట్టేస్తున్నారనీ ఆక్షేపించారు. వివిధ రంగాల్లో అమెరికా ఆధిపత్యం తగ్గటానికి, ఉద్యోగాల క్షీణతకు ఇతర దేశాల చర్యలే కారణమన్నట్లుగా ఆయన చేసిన ప్రచారానికి లక్ష్యం శ్వేత జాతీయులను ఆకర్షించడమే. అమెరికా జనాభాలో 60 శాతానికి కాస్త అటుఇటుగా ఉన్న శ్వేతజాతీయులను తనవైపు తిప్పుకోవటంలో మొదటిసారిలాగే రెండోసారి ట్రంప్ విజయం సాధించారు. శ్వేతజాతీయుల ఆధిపత్యానికి ముప్పు ముంచు కొస్తుందనే ఒకరకమైన భయాన్ని, ఆందోళనను కలిగించటంలో ట్రంప్ సఫలీకృతమయ్యారు. ఉద్యోగ భద్రతను, ఉద్యోగ కల్పనను తగినంత ఇవ్వలేని ఆర్థిక వ్యవస్థ అభద్రతా సమాజాన్ని సృష్టిస్తుంది. కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయ నాయకుల్లో మార్పుని చూడటం సహజం. కానీ ట్రంప్‌ని నిశితంగా చూసిన వారెవరూ ఆయన ఆలోచనల్లో మార్పు వచ్చిందని భావించటం లేదు. నియంతలే కాకుండా, ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారం చేపట్టి నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తున్న నేతలు ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టటాన్ని తమకు సానుకూలంగా భావిస్తున్నారు. రష్యా అధినేత పుతిన్ కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం ఉంది. రష్యా పెట్టే షరతులకు ఉక్రెయిన్ అంగీకరించేలా చేసి యుద్ధాన్ని విరమింపచేస్తానని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించారు. ఇజ్రాయెల్ నేత నెతన్యాహుకు కూడా ట్రంప్ పట్ల వ్యతిరేకత ఉందని చెప్పలేం. హమాస్ నిర్మూలన పేరుతో గాజాలో సాగుతున్న నరమేధాన్ని ఆపేలా ట్రంప్ తనపై ఒత్తిడి తెస్తారని ఇజ్రాయెల్ పాలకవర్గాలూ భావించటం లేదు. వీటన్నిటికంటే ముఖ్యమైంది వాతావరణ మార్పులపై కార్యాచరణ. అసలు వాతావరణ మార్పులే ప్రమాదకరంగా లేవనీ ప్రమాదకరమని ప్రచారం చేసే వాళ్లవి డొల్ల వాదనేనని ట్రంప్ అనేకసార్లు ఈసడిరచారు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగుతున్నట్లు తాను గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ప్రకటించారు. పాత వైఖరికే కట్టుబడి ట్రంప్ వ్యవహరిస్తే ప్రపంచానికి వాతావరణపరంగా గడ్డుకాలం తప్పదనే అనుకోవాలి. మొత్తంగా భారత్‌తో ఉన్న సంబంధాల విషయంలో పెద్దగా కఠిన వైఖరిని ప్రదర్శించే అవకాశం ఉండకపోవచ్చు.



# ఆందోళనకరంగా అంతర్జాతీయ పరిణామాలు

## ఉద్యోగాల కోతతో భారతీయులపై ప్రభావం

## గుబులు పుట్టిస్తున్న హెచ్1 బి వీసాల వ్యవహారం

దేశంలో నిరుద్యోగం తాండవిస్తున్న వేళ అంతర్జాతీయ పరిస్థితులు కూడా భారతీయులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రధానంగా అమెరికా తదితర దేశాల్లో పనిచేస్తున్న వారికి ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. ట్విట్టర్,మెటా తదితర సంస్థల్లో పరిణామాలతో చాలామంది రోడ్డున పడే ప్రమాదం ఏర్పడిరది. ట్విట్టర్ లో ఉద్యోగం కోల్పోయిన అమెరికాలోని మనోళ్లకు కొత్త చిక్కు వచ్చి పడిరది. హెచ్ 1బీ వీసాపై అక్కడ ఉంటున్న మనోళ్లు.. రెండు నెలల్లోగా కొత్త ఉద్యోగంలో చేరాలి. లేదంటే అమెరికా వదిలి వెళ్లిపోవాల్సి ఉంటుంది. దీంతో ట్విట్టర్ తదితర సంస్థల్లో ఉద్యోగం కోల్పోయిన మనోళ్లందరూ కొత్త జాబ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికాలోని కంపెనీలు నాన్ ఇమిగ్రెంట్ వీసా హెచ్ 1బీ కింద ఇతర దేశాల ఎంప్లాయీస్‌ను తీసుకుంటాయి. ఈ వీసా కింద ఎక్కువ శాతం మన దేశం,
చైనా వాళ్లే వెళ్తుంటారు. హెచ్`1బీ వీసాతో మూడేండ్ల పాటు అమెరికాలో ఉండొచ్చు. ఈ గడువు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. మొత్తం మీద ఆరేండ్లకు మించి ఉండరాదు. అయితే చట్ట ప్రకారం.. ఉద్యోగం లేకుండా హెచ్ 1బీ వీసాపై అమెరికాలో ఉండడానికి వీల్లేదు. ఈ వీసా ఉండి ఉద్యోగం కోల్పోయిన వాళ్లు రెండు నెలల వరకు దేశంలో ఉండొచ్చు. అంతలోపు వేరే ఉద్యోగంలో చేరాలి. లేదంటే దేశం వదిలి వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎక్స్‌లో ఎంతమందిని కంపెనీ తొలగించిందనేది స్పష్టత లేదు. ఒకవేళ కొత్త జాబ్ దొరకకున్నా హెచ్ 1బీ వీసాదారులు అమెరికాలో ఉండేందుకు ఒక అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వాళ్లు బీ2 వీసాకు మారాలని సూచిస్తున్నారు. ఇది విజిటర్ వీసా. దీనిపై గరిష్టంగా 6 నెలలు అమెరికాలో ఉండొచ్చు. ఆ తర్వాత కొన్ని నెలలు పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. 45 రోజుల్లోగా జాబ్ దొరక్కపోతే బీ2 వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. దీంతో మాజీ ఉద్యోగులకు కొంత టైమ్ దొరుకుతుంది. అప్పుడు కొత్త జాబ్ చూసుకొని మళ్లీ హెచ్ 1బీకి మారిపోవచ్చు. అయితే బీ2 వీసాపై ఉద్యోగం చేసేందుకు అవకాశం లేదు. ఈ టైమ్‌లో బతికేందుకు అవసరమైన డబ్బులు సమకూర్చుకోవాలని యూఎస్ ఇమిగ్రేషన్ సూచిస్తోంది. కాగా, మాజీ ఉద్యోగులు కొంద రు వర్సిటీల్లో అడ్మిషన్లకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఫేస్ బుక్ మాతృసంస్థ మెటా భారీ సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ వారంలోనే వేలాది మంది ఉద్యోగుల్ని ఇంటికి సాగనంపేం దుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే దీనిపై స్పందించేందుకు మెటా నిరాకరించింది. సెప్టెంబర్ క్వార్టర్ లో నిరాశజనక ఫలితాలు నమోదవుతాయని భావిస్తున్న మెటా వచ్చే ఏడాది నాటికి కంపెనీ స్టాక్ వాల్యూ 67బిలియన్ డాలర్ల మేర తగ్గుతుందని అంచనా వేస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే మెటా అర ట్రిలియన్ డాలర్ల మేర నష్టాన్ని మూటగట్టుకుంది. దీనికి తోడు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వృద్ధిరేటు తగ్గడం, టిక్ టాక్ నుంచి ఎదురవుతున్న పోటీ, యాపిల్ ప్రైవసీ పాలసీలో చేసిన మార్పులు, మెటావర్స్ కోసం భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సి ఉండటం తదితర అంశాలు తలకు మించిన భారాన్ని మోపుతున్నట్లు మెటా చీఫ్ జూకర్ బర్గ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మెటావర్స్ కోసం భారీ మొత్తంలో పెడుతున్న పెట్టుబడి నుంచి పదేళ్ల తర్వాత గానీ రాబడి వచ్చే అవకాశం లేదు. కాస్ట్ కట్టింగ్‌లో భాగంగా ఉద్యోగ నియామకాలను పక్కన బెట్టడంతో పాటు ఉన్న ఉద్యోగులను సైతం సాగనంపాలని అనేక కంపెనీలు నిర్ణయించినట్లు సమాచారం. ఇలాంటి పరిస్తితి అమెరకిన్లకైనా, మనకైనా తట్టుకోవడం కష్టం. అలా కాకుండా మానవ వనరులను ఉపయోగించుకునేలా ఆయా కంపెనీలు ప్రణాళికలు సిద్దం చేసుకోవడం ఉత్తమం.

# అమెరికా రాజకీయాల్లో కొత్త శక్తి

## అనూహ్యంగా పైకి వచ్చిన ఎలెన్ మస్క్

వాషింగ్టన్:

అమెరికా అధ్యక్ష ఎన్నికలను మస్క్ శాసించాడనటం అతిశయోక్తి కాదేమో. ఇప్పుడెక్కడ చూసినా ఇదే చర్చ సాగుతోంది. మస్క్ ప్రొఫైల్‌లో మాత్రం కొత్త ట్యాగ్ యాడ్ అవ్వడం పక్కాగా కనిపిస్తోంది. అమెరికా రాజకీయాల్లో మస్క్ మార్క్ మొదలుకానుంది. ఆయన తనకున్న ఫాలోయింగ్‌తో పాటు ఇతర పద్దతుల ద్వారా ట్రంప్ గులుపు లక్ష్యంగా పనచేశారని చెప్పవచ్చు. ఈ ఎన్నికలతో కొత్త స్టార్‌గా ఎలాన్ మస్క్ ఆవిర్భవించాడని డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పేర్కొనడం విశేషం. అసలు హాఫ్ డెమొక్రట్, హాఫ్ రిపబ్లికన్‌ను అని కొన్నేళ్ల కిందట చెప్పుకొన్న మస్క్ ఇప్పుడు పూర్తిగా ట్రంప్ పక్షం వహించారు. అసలు 2016, 2020 ఎన్నికల్లో డెమొక్రట్ల పక్షానే మస్క్ నిలిచారు. కానీ, బైడెన్ కార్యవర్గంతో ఆయనకు విభేదాల కారనంగా ట్రంప్ వైపు మొగ్గు చూపారు. మస్క్ మొదటి నుంచీ ట్రంప్‌నకు వ్యతిరేకి. 2016 తర్వాత ఒకసారి 'అధ్యక్షుడిగా ఆయన సరైన వ్యక్తి కాదు' అని వ్యాఖ్యానించారు. 2022 మొదట్లో కూడా ట్రంప్ మళ్లీ ఎన్నికల్లో నిలబడకూడదని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. ట్రంప్ పాలనలో నిత్యం చాలా హైడ్రామా ఉంటుందన్నారు. కానీ, మస్క్ ట్విటర్‌ను కొనుగోలు చేశాక ఇద్దరి మధ్య సంబంధాల్లో మార్పు వచ్చింది. అప్పటికే ట్రంప్‌ను సోషల్ మీడియాలు వెలివేశాయి. ఆ సమయంలో మస్క్ ఆయన్ను ఎక్స్ లోకి తిరిగి ఆహ్వానించారు. ట్రంప్ అకౌంట్‌ను పునరుద్ధరించారు. మస్క్ సాధారణంగా తాను తటస్థంగా ఉంటానని చెబుతుంటారు. కొవిడ్ సమయంలో బైడెన్ బాధ్యతలు చేపట్టారు. ఆయన పరిపాలన తీరు, పాలసీలు కొన్ని మస్క్‌కు నచ్చలేదు. వీటిని అతడు బహిరంగంగానే తప్పు పట్టాడు. దీంతో విభేదాలకు బీజం పడిరది. 2021లో శ్వేతసౌధంలో విద్యుత్తు వాహనాలపై ఓ సదస్సు జరిగింది. దీనికి అమెరికాలోని పెద్ద కంపెనీ టెస్లాను ఆహ్వానించలేదు. దేశంలో 74శాతం విద్యుత్తు వాహనాలు టెస్లావే. 2021 సెప్టెంబర్లో మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్ పౌర అంతరిక్ష యాత్రను విజయవంతంగా చేపట్టింది. బైడెన్ తప్ప అందరూ ఆయనకు అభినందనలు తెలిపారు. తాము అనుకున్నది చేయడం సాధ్యం కావడంలేదని మస్క్ ఓ సందర్భంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. 2022లో డెమొక్రటిక్ పార్టీ విభజనకారులకు నిలయమని, అది విద్వేష పూరితమైన పార్టీ అని అభివర్ణించారు. అందుకే తాను రిపబ్లికన్ల వైపు మారిపోతు న్నట్లు చెప్పారు. అందుకే దేశాన్ని రక్షించేందుకు ట్రంప్‌నకు ఓటు వేయాలని పిలుపు నిచ్చారు. కమలాహారిస్ విజయం సాధిస్తే ఎక్స్‌ను మూసేయిస్తుందని ఆరోపించారు. మస్క్ మొత్తం ఆరు కంపెనీలు నిర్వహిస్తున్నారు. ఇవి ఆయా రంగాల్లో సృజనాత్మకంగా పనిచేసేవే. ముఖ్యంగా టెస్లా, స్పేస్ ఎక్స్, న్యూరాలింక్ కంపెనీలపై ప్రభుత్వ నిబంధనల ప్రభావం అధికంగా ఉంటుంది. ఈనేపథ్యంలో ట్రంప్‌తో ఉన్న సంబంధాలను వాడుకొని కంపెనీలపై ప్రభుత్వ ఏజెన్సీల నిబంధనల సడలింపులు, ఒత్తిడిని ఆయన తగ్గించుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మీడియా, టెక్నాలజీలతో పాటు ఉన్నతరంగాల ప్రముఖుల పట్ల జోబైడెన్ వ్యవహరిస్తున్న తీరుపై పలుమార్లు ఎలాన్ మస్క్ బహిరంగంగా విమర్శలు గుప్పించారు. ప్రజల్లో ట్రంప్‌పై ఉన్న వ్యతిరేకతను సైతం అనుకూలంగా మార్చేలా మస్క్ తన వ్యూహ, ప్రతివ్యూహాలతో ఆకట్టుకున్నారు. అలాగే ట్రంప్ గెలిస్తే కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో సూపర్ సక్సెస్ అయ్యారు. అలాగే ప్రపంచకుబేరుల జాబితాలో మస్క్ ముందు వరుసలో ఉండడం, ఆకట్టుకునేలా మాట్లాడం కూడా ట్రంప్‌నకు అనుకూలంగా పనిచేశాయి.

# కలెక్టర్‌కే ఎసరు పెట్టిండ్లు...

**- ములుగు జిల్లా కలెక్టర్ పేరుతో ఫేక్ ఖాతాలు**
**- ఫేక్ మేసేజ్‌లు పంపుతున్న కేటుగాళ్లు**
**- నియంత్రణ కాని సైబర్ నేరాలు**
**- మోసపూరిత మెసేజ్‌లు నమ్మవద్దు**
**- పోలీసులకు కలెక్టర్ ఫిర్యాదు**

**జయశంకర్**

**భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**



సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొద్దీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. ఒకవైపు పోలీసుశాఖ సైబర్ నేరాలు, మోసాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా సైబర్‌నేరగాళ్లు తమ చాతుర్యం ప్రదర్శిస్తూనే ఉన్నారు. ప్రతి రోజు రాష్ట్రంలో అక్కడక్కడా సైబర్ నేరాలు జరుగుతూనే ఉన్నాయి. సైబర్ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నా పోలీసులకు సవాల్ చేసినట్లు సైబర్ నేరగాళ్లు తమ టెక్నాలజీని వినియోగిస్తూ అమాయకుల నుంచి డబ్బులు దోచుకుంటున్నారు. అయితే ఫేక్ కాల్స్, మెసేజ్‌లు, ఆప్‌లు, లింక్‌లతో సైబర్ నేరగాళ్లు తాజాగా ఉన్నతాధికారుల ఫేక్ ఐడీలను సృష్టించి అమాయకులకు వల వేస్తున్నారు.తాజాగా ములుగు జిల్లా కలెక్టర్ పేరుతో ఫేస్‌బుక్ ఫేక్ ఐడీని సృష్టించి ఫేక్ మెసేజ్‌లు పంపుతున్నట్లు ములుగు పోలీసులకు కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించారు. ఈ ఖాతాను ఉపయోగించుకుని పలువురి నుంచి డబ్బు వసూలు చేసేందుకు సైబర్ నేరగాళ్లు ప్రయత్నించారు. కలెక్టర్ దివాకర టిఎస్ పేరు, ఫొటోతో ఫేస్ బుక్ ఐడీని సృష్టించి సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉండే వారి ఖాతాలకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపిస్తున్నారు. వారు అక్సెప్ట్ చేసిన అనంతరం మెస్సెంజర్ లో మెసేజ్ లు పంపించారు. గమనించిన కలెక్టర్ దివాకర టిఎస్ ములుగు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు తన అసలు ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరూ డబ్బులు అడిగిన ఇవ్వొద్దని కలెక్టర్ సూచించారు. తన పేరును సృష్టించిన అకౌంట్ మోసపూరితమైనది, ఆ అకౌంట్ ద్వారా వచ్చే వాటికి సమాధానం ఇవ్వవద్దని, వీలైనంత త్వరగా ఆ అకౌంట్‌ను బ్లాక్ చేయమని కలెక్టర్ కోరారు. కలెక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైనా సాంకేతిక పరిజ్ఞానం మంచి కంటే చెడుకే ఎక్కువగా ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# ప్రాణాలతో చెలగాటం



**పెద్దిపల్లి వద్ద గోదావరి రేవుపై ప్రమాదకరంగా పడవ ప్రయాణం సాగుతున్నా సంబంధిత అధికార యంత్రాంగానికి పట్టినట్లుగా లేదు. ధరల సూచిక బోర్డు రేవు వద్ద మచ్చుకైనా కానరాదు. పరిమితికి మించి పడవపై ప్రయాణికులను ఎక్కించుకోవడమే కాకుండా లైఫ్ జాకెట్లు వాడడం లేదు. ఇక ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా చార్జి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాటదారు నిబంధనలను నీళ్లలో ముంచినా అడిగేవారు లేరు. ఊహించని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరనేది తెలియడం లేదు.**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి (నినాదం) :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జెట్టిగూడెం టు సింగారం గోదావరి రేవుపై పడవ ప్రయాణం ప్రమాదకరంగా ఉందని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలం పాటదారు ప్రభుత్వ నిబంధనలను నీళ్లలో ముంచి అంతా నా ఇష్టం అన్నట్లుగా ఎంతో నిర్లక్ష్యంగా గోదావరిపై పడవ నడుపుతున్నారు. ఆ నిర్లక్ష్యం ఫలితంగా ఊహించని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరనే ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది. 2000 సంవత్సరంలో చర్ల మండలం తేగడ వద్ద తాలిపేరు వాగుపై పడవ బోల్తాపడి మునిగిన ఘటనలో 27 మంది మృతి చెందారు. ఆ విషాద ఘటన ఇంకా భద్రాద్రి ప్రాంత ప్రజలు మర్చిపోలేదు. ఇలా తెలుగు రాష్ట్రాల్లో గతంలో జరిగిన ప్రమాదాల దృష్ట్యా పడవ లేదా లాంచీల ప్రయాణంలో ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా లైఫ్ జాకెట్స్ ఉపయోగించాలనేది ప్రభుత్వ నిబంధన. వేలంపాట నిబంధనల్లోను కాలమ్ నెం 7 ద్వారా ఈ విషయం పేర్కొన్నారు. లైఫ్ జాకెట్స్ వాడకుంటే వేలంపాట రద్దు చేసే అధికారం ఉంది. జెట్టిగూడెం (పెద్దిపల్లి) రేవులో వాడకానికి కాదుగదా కనీసం చూడటానికి కూడా పడవలో లైఫ్ జాకెట్లు కానరావు. గిరిజనుడి పేరుతో ఓ గిరిజనేతరుడు ఈ రేవు వేలం దక్కించుకొని పడవ నడుపుతున్నాడు. లైఫ్ జాకెట్స్ గురించి పడవ నడిపే సదరు వ్యక్తిని ప్రశ్నిస్తే ఇక్కడ లైఫ్ జాకెట్స్ అవసరం లేదని చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గోదావరిపై ఊహించని ప్రమాదం సంభవిస్తే పడవలో ప్రయాణికులు ప్రాణాలు రక్షించుకునేందుకు లైఫ్ జాకెట్లు ఎంతో అవసరం. అందుకే ప్రభుత్వం కండిషన్ పెట్టింది. అంతటి ప్రాధాన్యత కలిగిన లైఫ్ జాకెట్లు లేకుండా పడవ నడుపుతుంటే గ్రామ పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయకుండా ఏమి చేస్తున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. వేలంపాట ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చిందని అధికారులు సంబరపడితే సరిపోతుందా ప్రజల ప్రాణాల గురించి వారికి పట్టింపులేదా అని నిలదీస్తున్నారు.

## రేవు వద్ద కనిపించని ధరల పట్టిక బోర్డు

వేలంపాట నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీ నిర్ణయించిన విధంగా పెద్దవాళ్లకు రూ 60, పిల్లలకు రూ 30 మాత్రమే వసూలు చేయాలి. కానీ రూ 100 వసూలు చేస్తున్నట్లుగా ప్రయాణీకులు చెబుతున్నారు. వాహనాలకు కూడా బాగా ఎక్కువ తీసుకుంటున్నారనేది ప్రయాణీకుల ఆరోపణ. వేలం షరతు ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక ప్రజలకు కనిపించే విధంగా రేవు వద్ద, సమీప బస్టాప్ వద్ద పాటదారు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ మచ్చుకైనా ఎక్కడా ఒక్క బోర్డు కనిపించదు. ఇక పడవ ఎక్కిన వారికి గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకంతో ఉన్న రసీదు తప్పనిసరిగా ఇవ్వాలి. కానీ పెద్దిపల్లి రేవులో రసీదు విధానమే లేదు. దీనిపై పంచాయతీ వారు పట్టించుకోవడం లేదు ఎక్కువ వసూలు చేస్తున్న కారణంగా తమకి రసీదు ఇవ్వాలని ప్రయాణీకులు అడిగితే ఇక్కడ అలాంటి విధానంలేదని, ఎక్కితే ఎక్కండి లేదంటే దిగిపోండని పడవ నిర్వాహకుడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పలుమార్లు

## వాగ్వివాదం జరిగినట్లు సమాచారం.

పడవపై పరిమితికి మించి ప్రయాణీకులు నాలుగు టన్నుల బరువు కలిగిన పడవపై 20 మందిని ఎక్కించాలనేది ఇరిగేషన్ శాఖ వారి నిబంధన. గోదావరిపై నడిపే పడవ బరువు ఎంత. ఆ బరువుకి తగినట్లు ఎంతమందిని ఎక్కించాలనేది పడవ ముందు భాగంలో తప్పనిసరిగా రాయించాలి. ఆ షరతు ప్రకారమే లైసెన్స్ మంజూరు చేస్తారు. కానీ ప్రయాణీకులు ఎక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ ట్రిప్పులు వేయడం కంటె ఎక్కువ మందిని దాటిస్తే సరిపోతుందనే ఉద్దేశ్యంతో పడవ నిర్వాహకులు పరిమితికి మించి ప్రయాణీకులను రేవు దాటిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రయాణీకులే చెప్పడం గమనార్హం. ఇలాంటి సందర్భాలలో ఊహించని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని జనం ప్రశ్నిస్తున్నారు ప్రతి మూడు నెలలకి ఒకసారి పడవలను రెవిన్యూ, పోలీస్, పిడబ్ల్యుడి శాఖల అధికారులచే తనిఖీ చేయించుకొని లైసన్స్ పొందాలి. ప్రస్తుతం పర్మినెంట్ లైసన్స్ లేకుండా పడవ నడుపుతున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈఈ వెంకటేష్‌ని వివరణ కోరగా ఇంకా పర్మినెంట్ లైసన్స్ ఇవ్వలేదని చెప్పారు. మరో విషయం ఏమంటే నాలుగు టన్నుల బరువుగల పడవకి అనుమతి పొంది రెండు టన్నుల పడవ తిప్పుతున్నట్లు తెలుస్తోంది. దీనిని గ్రామపంచాయతీ వారే కనిపెట్టి చర్యలు తీసుకోవాలి.



## కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులు ఆపాలి

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**కాటారం నవంబర్ 07 నినాదం న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకోవడం ఆపాలని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గురువారం కాటారంలో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పత్తి పెద్ద ఎత్తున పండిస్తున్నారన్నారు. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకోవడం వల్ల ఇక్కడ పత్తికి డిమాండ్ తగ్గి గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతులకు అన్యాయం జరుగుతున్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో చొరవ చూపి పత్తి దిగుమతులు పూర్తిగా నిలిపివేయాలన్నారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లించేందుకు సీసిఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు శ్రీధర్ బాబు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మార్కెటింగ్ అధికారి కనక శేఖర్ నాలుగు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ అకాడమీకి పీవీ సింధు భూమిపూజ



**అమరావతి, నవంబర్ 7 (నినాదం న్యూస్) :** విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీకి స్టార్ ప్లేయర్ పీవీ సింధు భూమి గురువారం పూజ చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అకాడమీ నిర్మాణానికి తన తల్లిదండ్రు లతో కలిసి గురువారం ఉదయం భూమి పూజ చేశారు. పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా పీవీ సింధు తెలిపారు. ఈ భూమి విషయంలో ఎలాంటి వివాదం లేదని.. ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. ఈ అకాడమీ ద్వారా ఎంతో మంది క్రీడాకా రులను తయారు చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అకాడమీకి సంబంధించిన అన్ని వివరా లూ త్వరలోనే వెల్లడిస్తామని ఈ సందర్భంగా పీవీ సింధు వెల్లడిరచారు. గత వైసీపీ ప్రభుత్వం పీవీ సింధుకు విశాఖపట్నంలోని పెదగదిలి కూడలి సమీపంలో భూమి కేటాయించిన విషయం తెలిసిందే.

## క్రాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

- అధ్యక్షుడిగా బోళ్ళ కార్తీక్ ఎన్నిక



**జమ్మికుంట, నవంబర్ 6 (నినాదం న్యూస్) :** జమ్మికుంట పట్టణ దీపావళి క్రాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బోళ్ల కార్తీక్ ను ఎన్నుకున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. గురువారం జరిగిన ఒక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని క్రాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కార్తీక్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రభుత్వ అనుమతులతో ఏర్పాటు చేసుకునే క్రాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నన్ను ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో షాపుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఉపాధ్యక్షులుగా కొమురవెల్లి శివన్న సెక్రటరీగా చోక్కారపు అఖిలేష్ జనరల్ సెక్రెటరీ గా దొడ్డేం మేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. దీపావళి క్రాకర్స్ విక్రయదారులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కార్తీక్ కృతజ్ఞతలు తెలిపారు.

## డిప్యూటీ సీఎం శాంతిభద్రతలు లేవంటే అర్థమేంటి

- దళిత హోంమంత్రి మీద అంత అక్కసా
- చంద్రబాబును ప్రశ్నించే ధైర్యం పవన్‌కు లేదు
- మాజీ సీఎం, వైకాపా అధినేత జగన్ విమర్శలు



**అమరావతి,నవంబర్7 (నినాదం న్యూస్) :** డిప్యూటీ సీఎం స్థాయి వ్యక్తి లా అండ్ ఆర్డర్ లేదని అనటం ఆశ్చర్యంగా ఉందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. దళిత మంత్రి విరీద విమర్శలు చేసి ఊరుకున్నారని.. లా అండ్ ఆర్డర్ గురించి ప్రశ్నించాల్సింది చంద్రబాబుని అంటూ ఆయన పేర్కొన్నారు. చంద్రబాబును ప్రశ్నించే ధైర్యం పవన్‌కు లేదన్నారు. దళిత మహిళ కాబట్టి పడుతుంది అని పవన్ ఆమెపై విమర్శలు చేశారన్నారు. సొంత నియోజకవర్గంలో అత్యాచారం చేస్తే పవన్ ఏం చేశారని జగన్ ప్రశ్నించారు. సినిమా డైలాగ్‌లు కొట్టమంటే మాత్రం పవన్ తోలు తీస్తా అని డైలాగ్‌లు కొడతారంటూ ఎద్దేవా చేశారు. డీజీపీ చట్టం వైపు, న్యాయం వైపు నిలబడాలన్నారు. డీజీపీకి మా ప్రభుత్వ హయంలో మంచి పదవి ఇచ్చామన్నారు. పదవీ వ్యామోహంతో డీజీపీ ఇలా తయారయ్యాడని విమర్శించారు. డీజీపీ అధికార పార్టీ కార్యకర్తల మాదిరి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంలో పోలీసులు సరిగా పనిచేస్తే అత్యాచారాలు, హత్యలు ఎందుకు జరుగుతాయని ప్రశ్నించారు.సుప్రీం కోర్టు ఆదేశాలను కూడా వెటకారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే రీతిలో వ్యవహరిస్తున్న పోలీసులు ప్రభుత్వం ఎప్పుడు ఇదే ఉండదు అని తెలుసుకోవాలన్నారు. పోలీసులపై ప్రైవేట్ కేసులు వేస్తామన హెచ్చరించారు. జమిలి గిమిలి అంటున్నారని.. అధికారం కూడా త్వరగా కోల్పోవచ్చని జగన్ జోస్యం చెప్పారు. లేకపోయినా నాలుగేళ్ల సమయం మాత్రమే ఉంటుందన్నారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్ అయ్యాక కూడా పోలీసుల సంగతి కూడా చూస్తామన్నారు.సప్త సముద్రాల అవతల ఉన్నా పోలీసులను ఇక్కడకు పిలిపిస్తామన్నారు. చేసిన తప్పులను బయటకు తీసి చట్టం ముందు దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు. రెడ్ బుక్ పెట్టడం వాళ్లకు మాత్రమే తెలుసా.. రెడ్ బుక్ పెట్టడం పెద్ద విషయం కాదన్నారు. బాధితులు అందరూ రెడ్ బుక్ పెట్టుకుంటారన్నారు. వాళ్లు అందరూ వచ్చి నాకు వినతులు ఇస్తే చూస్తూ ఊరుకోనన్నారు. వెయ్యి ఎకరాల్లో 4 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని.. ఆ ప్రభుత్వ భూమి కూడా తీసుకోలేదని ఎమ్మార్వో చెప్పిందని జగన్ వెల్లడిరచారు. అలాంటి చోటుకి పవన్ వెళ్లారన్నారు. పక్కనే భవ్య సిమెంట్స్ వాళ్లు ఎకరం 50 నుంచి 90 వేలకు కొన్నారని.. మేం ఎకరం 3 లక్షలకు తక్కువకు కొనలేదని జగన్ చెప్పారు. గ్రామ సభల్లో ఎకరం 2.70 లక్షలు అడిగితే తాను 3 లక్షలు ఇవ్వాలని చెప్పానన్నారు. తాడిపత్రి దివాకర్ రెడ్డిపై అనేక ఆరోపణలు గతంలో వచ్చాయన్నారు. తాను తీసుకున్నది అంతా ప్రైవేట్ భూములు మాత్రమేనని జగన్ వెల్లడిరచారు. సిమెంట్ ఫ్యాక్టరీలకు నీరు ఇవ్వటం ప్రభుత్వ బాధ్యత కాదా అంటూ ప్రశ్నించారు. పవన్ అసలు ఎలా మంత్రి అయ్యారో అర్థం కాదని ఎద్దేవా చేశారు. పవన్‌కు ఏం బుద్ధి ఉందో ఏం జ్ఞానం ఉందో ఏంటో అంటూ విమర్శించారు. గతంలో చంద్రబాబు నన్ను ఇబ్బంది పెడితే కోర్టుకు వెళ్ళగా అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. పరిశ్రమలు పెట్టే జిందాల్ కడపలో పరిశ్రమ పెట్టడం కోసం పనులు మొదలు పెట్టారన్నారు. జిందాల్‌ను ఇబ్బంది పెట్టడం కోసం జిత్వానీతో తప్పుడు ఫిర్యాదులు చేయించి ఇబ్బంది పెట్టారని అన్నారు.ఒరిస్సాలో ఆర్సెల్లర్ మిట్టల్ పరిశ్రమ పెడితే ఇక్కడ కూడా పెడుతున్నారు అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. సరస్వతి పవర్ కట్టకపోవటానికి కారణం టీడీపీ కాంగ్రెస్ వాళ్ళే కదా అంటూ విమర్శించారు. వీళ్ళ కేసులు వల్లే సరస్వతి భూములు ఈడీ అటాచ్ చేసిందని జగన్ అన్నారు.

# డిప్యూటీ సీఎంతో హోంమంత్రి అనిత భేటీ

- తాజా రాజకీయాలతో పాటు శాంతి భద్రతలపైనా చర్చ
- నేరాల అదుపులో ప్రత్యేక దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి సూచన



**అమరావతి,నవంబర్7 (నినాదం న్యూస్) :** హోంమంత్రిపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల అనంతరం ఏపీ రాజకీయాలు వేడెక్కిన క్రమంలో హోంమంత్రి అనిత డిప్యూటి సిఎం పవన్ కళ్యాణత్‌తో భేటీ అయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఫేక్ పోస్టులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హోం శాఖ తీసుకుంటున్న చర్యలను పవన్ కళ్యాణ్‌కు అనిత వివరించారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆడబిడ్డలకు అన్యాయం చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు అనిత తెలిపారు. జన సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రతిక్షణం శ్రమించే ప్రజా ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమని నేతలు చర్చించుకున్నారు. తానూ ఫేక్ పోస్టు బాధితురాలినంటూ అంటూ అనిత పవన్ కల్యాణ్‌తో అన్నారు. తన కూతురు కన్నీరు చూసే తాను ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేశానని పవన్ వెల్లడిరచారు. ఈ క్రమంలో హెూం మంత్రి అనిత ఆసక్తికర పోస్ట్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ తో మార్యదపూర్వకంగా సమావేశమైనట్లు పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హెూం శాఖ తీసుకుంటున్న చర్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఆడబిడ్డలకు అన్యాయం చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా గట్టి చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారన్నారు. జన సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రతిక్షణం పరిశ్రమించే ప్రజా ప్రభుత్వం తమ కూటమి ప్రభుత్వం అంటూ అనిత పేర్కొన్నారు. ఇటీవల పిఠాపురం పర్యటనలో రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హెూం మంత్రి బాధ్యత వహించాలని.. మరింత కఠినంగా వ్యవహరించాలంటూ పవన్ కళ్యాణ్ సూచించారు. అయితే.. ఈ వ్యాఖ్యలపై స్పందించిన హెూంమంత్రి అనిత.. దీనిని తాను పాజిటివ్‌గా తీసుకుంటున్నానని చెప్పారు.. హెూం మంత్రిగా తాను ఫెయిల్ అని పవన్ ఎక్కడా అనలేదని.. పవన్ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. ఈ క్రమంలోనే.. పవన్ కళ్యాణ్ ఢల్లీ పర్యటనకు వెళ్లడం.. ఆ తర్వాత కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో భేటీ అవ్వడం.. వెనువెంటనే.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, హెూంమంత్రి అనిత సమావేశం అవ్వడం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది..

## విజయవాడలో రైతుల ఇంటికి స్వయంగా వెళ్లిన ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి

- ల్యాండ్ పూలింగ్‌పై అనుమానాలు నివృత్తి చేసేందుకు కార్యక్రమం



**విజయవాడ, నవంబర్ 7 (నినాదం న్యూస్):** విజయవాడలో ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ గురువారం పర్యటించారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ అనుమానాలను నివృత్తి చేసేందుకు ఆయన రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లారు. విజయవాడలోని రాజధాని రైతు అనుమోల్ గాంధీ నివాసానికి మంత్రి వెళ్లారు. ఇప్పటికే రాజధాని గ్రామాల్లో పలువురు రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పూలింగ్ అంగీకార పత్రాలను స్వీకరించారు. అయితే.. ఇప్పటి వరకు భూములు ఇవ్వని రైతుల ఇళ్లకు వెళ్లిన మంత్రి.. ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి వివరాలను వెల్లడిస్తున్నారు. గతంలో పలు అనుమానాలు, భయాలతో పలువురు రైతులు రాజధాని అమరావతికి భూములు ఇవ్వలేదు. వారి వల్ల రాజధాని డిజైనింగ్, నిర్మాణాలకు కొంత మేర ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో స్వయంగా మంత్రి నారాయణ రంగంలోకి దిగారు. భూములు ఇవ్వకుండా భయంతో, అనుమానాలతో ఉన్న రైతుల ఇళ్లకు మంత్రి నారాయణ వెళ్లి అన్నదాతలను కలుస్తున్నారు. ల్యాండ్ పూలింగ్, రాజధాని నిర్మాణం ఆవశ్యకతను వివరిస్తున్నారు. ప్రస్తుతం విజయవాడలో ఉన్న రాజధాని రైతు అనుమోల్ గాంధీ నివాసానికి మంత్రి వెళ్లి కలిశారు. రాజధాని అమరావతి ప్రాముఖ్యత, రాజధాని నిర్మాణం ఆవశ్యకతపై వివరించి.. రాజధానికి ఇవ్వాల్సిన భూములు ఇవ్వాలని వినతి చేశారు. ఇక ఇప్పటికే రాజధాని గ్రామాల్లో ఇప్పటి వరకు భూములు ఇవ్వని రైతుల ఇళ్లకు వెళ్లి పలువురిని స్వయంగా కలిసి... రాజధానికి భూములు ఇచ్చి రాజధాని నిర్మాణానికి సహకరించాలని నారాయణ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నట్లుగా తెలుస్తోంది. గత పదేళ్ల పాటు భూములిచ్చేందుకు నిరాకరించిన రైతులు ఇప్పుడు కాస్త మెత్తబడుతున్నట్లు సమాచారం. మంత్రి నారాయణ స్వయంగా ఇంటికెళ్లి.. భూముల విషయంలో ఆయన అడిగిన తీరుకు కొంతమంది రైతులు మెత్తబడి భూములు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి నారాయణ చేస్తున్న ఈ ప్రయత్నం పూర్తి స్థాయిలో సక్సెస్ అయితేనే రాజధాని నిర్మాణం వేగవంతం అవుతుంది.

## కాటారం ఐటీఐ కళాశాల నిర్మాణ స్థలం పరిశీలన

- టీజీ ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**కాటారం, నవంబర్7 (నినాదం న్యూస్) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో నిర్మించనున్న ఐటీఐ కళాశాల నిర్మాణ స్థలాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టిజి ఐఐసి) మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ ప్రణాళికలు, మౌలిక సదుపాయాల అమలు పద్ధతులు మరియు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. కాలేజీ నిర్మాణం పటిష్టంగా, నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులకు అత్యాధునిక సదుపాయాలు, శిక్షణా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష హోదా లేనప్పుడు అసెంబ్లీకి వెళ్లి ఏం లాభం

- అందుకే అసెంబ్లీకి రాదల్చుకోలేదన్న జగన్



**అమరావతి,నవంబర్7 (నినాదం న్యూస్):** అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ నిర్ణయించింది. ప్రతి 3 రోజులకు ఒకసారి విరీడియా ద్వారా చంద్రబాబును ప్రశ్నిస్తానని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రకటించారు. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష కూటమి ఉంటాయని. మేం కాకుండా ప్రతిపక్షం లేనపుడు మమ్మల్ని ప్రతిపక్షంగా గుర్తించాలని జగన్ కోరారు. ప్రతిపక్షాన్ని గుర్తిస్తే ఎంత మంది ఎమ్మెల్యేలు ఉన్నా నాయకుడు ఉంటారు కదా అంటూ వ్యాఖ్యానించారు. 40 శాతం ఓట్లు వచ్చిన వారిని గుర్తించరా అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడిగా గుర్తిస్తే సభలో మైక్ ఇవ్వాలి.. సభా పక్ష నాయకుడికి, ప్రతి పక్ష నాయకుడికి మైక్ ఇస్తేనే ప్రజా సమస్యలు చెప్పే అవకాశం ఉంటుందని జగన్ పేర్కొన్నారు. సమస్యలు చెప్పనీయకుండా ఉండటానికే ప్రతిపక్ష పార్టీని గుర్తించటం లేదన్నారు. మైక్ ఇస్తే ప్రభుత్వాన్ని ఎండగడతామని భయమని ఆయన అన్నారు. మైక్ ఇవ్వనపుడు అసెంబ్లీకి వెళ్లి ఉపయోగం ఏమి ఉందని అన్నారు. విరీడియా సమక్షంలో ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో బ్జడెట్ సహా కొన్ని చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఇప్పటివరకూ ఉన్న ఓటాన్ అకౌంట్ బ్జడెట్‌తో ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలో పూర్తి స్థాయి బ్జడెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలన్న దానిపై బీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ

**అమరావతి, నవంబర్ 7 (నినాదం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తూ వైసీపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో గుంటూరు-కృష్ణా, ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుంది. ఈ సందర్భంగా వైసీపీ కూడా ఎన్నికలకు సన్నద్ధం అవుతుండగా సడెన్‌గా రెండు జిల్లాల్లో ఎన్నికలను బాయికాట్ చేస్తున్నట్లు వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్నినాని ప్రకటించడం సంచలనంగా మారింది. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం లేదని, తమ నేతలను, కార్యకర్తలను అక్రమ కేసులతో వేధిస్తున్న పరిస్థితుల్లో బైకాట్ నిర్ణయం తీసుకున్నామని పేర్నినాని గురువారం తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏపీలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతుందని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వాపోవడం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పడుతుందని వ్యాఖ్యనించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో అత్యంత దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటుందని ఆరోపించారు. అప్రజాస్వామికంగా పోలీసులను అడ్డంగా పెట్టి వైసీపీ రాజకీయ నాయకులపై వేధింపులకు పాల్పడుతున్న దృష్ట్యా వైసీపీ ఎమ్మెల్సీ పోటీ నుంచి దూరంగా ఉంటున్నట్లు తెలిపారు.

## మద్యం షాపును ముట్టడించిన మహిళలు

**గుంటూరు, నవంబర్ 7 (నినాదం న్యూస్) :** గుంటూరులో మహిళలు మద్యం షాపును ముట్టడిరచారు. మణీ హెూటల్ సెంటర్‌లో ఇళ్ల, ప్రార్థన మందిరాల మధ్య మద్యం షాపు ఉండటంతో స్థానిక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై మద్యం షాపు నిర్వాహకులకు పలు మార్లు చెప్పిన పట్టించుకోలేదు. సమస్యను ఎక్సైజ్ సిబ్బందికి తీసుకెళ్లిన ప్రజల అభ్యర్థనను వారు లెక్కచేయనట్లు తెలుస్తుంది. ఇక విసుగు చెందిన స్థానిక మహిళలు మద్యం షాపును ముట్టడిరచారు. ఈ నేపథ్యంలో మహిళలు, మద్యం షాపు నిర్వాహకులకు మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం షాపు అక్కడి నుండి తీసివేయాలని మహిళలు పెద్ద ఎత్తన ఆందోళన చేశారు. వారిపై మద్యం షాపు నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. కాగా, ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో కొత్త లిక్కర్ షాపులు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ప్రకటించిన లిక్కర్ పాలసీకి అనుగుణంగా అమ్మకాలు జరగడమే కాకుండా తిరిగి బ్రాండెడ్ అమ్మకాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే, కొన్ని షాపులు ఇళ్లు, గుడులు, ప్రార్థన మందిరాల మధ్య ఉండటంతో స్థానిక మహిళలు నిరసనలు తెలుపుతున్నారు. తమ ప్రాంతంలో మద్యం షాపులు వద్దంటూ ఆందోళనకు దిగుతున్నారు.

## పోడు పట్టాలకు పంట రుణాలు ఇవ్వాలి


- తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట గిరిజనుల ధర్నా



**మహాముత్తారం, నవంబర్ 7 (నినాదం న్యూస్):** అటవీ హక్కుల భూమి పట్టాలకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గిరిజన రైతులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేసి పట్టాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారని వారు తెలిపారు. అయితే రుణాల కోసం బ్యాంకులకు వెళ్తే ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ లేదంటూ బ్యాంకు మేనేజర్ తమ దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఈ పట్టాలకు పంట రుణాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినా బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో లావణి పట్టాలకు ఇచ్చిన రుణాలు ఆన్‌లైన్‌లో లేవని వాటిని తొలగించి వాటి స్థానంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను భర్తీ చేశారని వారు గుర్తు చేశారు. ఈ క్రమంలో మిగితా ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, లావణి పట్టాలకు పంట రుణాలు ఇప్పించాలని వారు కోరారు. అనంతరం పోడు, లావణి పట్టాలకు పంట రుణాలు ఇప్పించాలని తహశల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్క రాము గౌడ్, రాధారపు స్వామి, పోలం రాజేందర్, శ్రీపతి సురేష్‌తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి సీపీ రామన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- పాఠశాల హెచ్ఎం పాశం సంజీవరెడ్డి



**మహాముత్తారం, నవంబర్ 7 (నినాదం న్యూస్):** ప్రతి విద్యార్థి సీవీ రామన్‌ను స్ఫూర్తినిగా తీసుకుని శాస్త్రవేత్తలుగా ఎదుగాలని పాఠశాల హెచ్ఎం పాశం సంజీవరెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం ములుగుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నోబెల్ బహుమతి గ్రహీత సివి.రామన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ గొప్ప సైన్స్ శాస్త్రవేత్త సివి రామన్ మాత్రమేనని ప్రతి విద్యార్థి వారిని ఆదర్శంగా తీసుకొని సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు శాస్త్రీయ వైఖరులు, పరిజ్ఞానాన్ని పెంచుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభివృద్ధి పెంచే విధంగా జనవిజ్ఞాన వేదిక సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో చెకుముకి సైన్ సంబరాలలో భాగంగా పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దాసరి రాజేంద్రప్రసాద్, ఏ .అనిల్ నాయక్, సకరాం నాయక్, కామిడీ సతీష్ రెడ్డి,.ఎస్ చంద్రకళ, పి .ఈ.టి.వెంకటేష్ సిఆర్పి బాపు రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల పట్టికను ఏర్పాటు చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతి భాయ్



**ఖమ్మం, నవంబర్ 7( నినాదం న్యూస్):** జిల్లాలో ఉన్న ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా ఆస్పత్రిలో ఉన్న మందుల వివరాల పట్టికను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతి అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేయుచున్న సూపర్ వైజర్లకు, ఫార్మాసిస్టులకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఐడిఒసి నందు ప్రేరణ సమావేశమందిరంలో రివ్యూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కళావతి భాయి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బోర్డు నందు మందుల పట్టికను, సిటిజెన్ చార్ట్,స్థాఫ్ వివరాలు డిస్ప్లే చేయాలని చెప్పారు. అలాగే పీహెచ్సీ సబ్ సెంటర్ పరిధిలో అందించే సేవలను హెచ్ఎంఐఎస్ పోర్టల్ నందు నమోదు చేసి లక్ష్యాలను సాధిం చాలని అన్నారు. ముఖ్యంగా ప్రణాళిక, కోల్డ్ చైన్ నిర్వహణ, వాక్సిన్ పంపిణి, ఇమ్యూనైజెషన్ షెడ్యూల్, ఏఐఎఫ్ఐపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అలాగే ప్రతి గర్భిణీ, చిన్నారిని గుర్తించి సరైన సమయంలో సక్రమంగా టీకాలు అందించి ప్రతి లబ్ధిదారుణ్ణి యువిన్ పోర్టల్ నందు నమోదు చేయాలని, ఖర్చు అయిన వాక్సిన్ను ఏవిన్ పోర్టల్లో తప్పనిసరిగ్గా నమోదు చేయాలని చెప్పారు. అన్ని వైద్య ఆరోగ్య కార్యక్ర మాలు జిల్లా లోఅమలు తీరు మెరుగు పరచి ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి వైద్యులు సిబ్బంది కృషి చేయాలని ఆమె చెప్పారు. అసంక్రమణ వ్యాధులను అరికట్టు టకు పరీక్షలు, చికిత్సలు మెరుగుగా చేయాలని, మందుల పంపిణి, విధానంలో లోపం లేకుండా లబ్దిదారులకు అందిం చాలని, ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్డేట్ చేయాలని ఆమె చెప్పారు తదనంతరం డిడిఎం పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా ఎలా నమోదు చేయాలో వివరించారు.కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చందునాయక్,డాక్టర్ రామారావు , సిహెచ్ఓ,హెచ్ఈఓ, పీహెచ్ఎన్లు సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం వితరణ

**కుటుంబ సభ్యులకు అందించిన బిఆర్ఎస్ నాయకులు**



**కారేపల్లి, నవంబర్ 7 (నినాదం న్యూస్):** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన బానోత్ వాల్య ఇటీవల మరణించగా వారి దశదిన కార్యక్రమానికి భాగ్యనగర్ తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ సుజాత బన్సిలాల్ 25 కేజీల బియ్యం, భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన ధరావత్ కళ్యాణ్ నినాదం విలేఖరి 25 కేజీల బియ్యం ను గ్రామా నాయకులు , యువకుల ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వాంకుడోత్ బన్సీలాల్, రాము ,గుగులోత్ మోహన్ , మలోత్ హరిరాం,వాంకుడోత్ అశోక్ , శివ,ఈశ్వర్,సాగర్ , వినాయక్ చరణ్, ఇస్లవత్ నరేశ్, బానోత్ కళ్యాణ్, ప్రవీణ్ ,జయంత్ , భూక్య కళ్యాణ్,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్సిసి కార్యాలయం కోసం స్థలాలను పరిశీలించిన కలెక్టర్



**ఖమ్మం, నవంబర్07,( నినాదం న్యూస్):** ఎన్.సి.సి. విధుల కోసం శాశ్వత కార్యాలయ భవనం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నగరంలో పలు స్థలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఖమ్మం త్రీ టౌన్ లోని పాత డిఈఓ ఆఫీస్ ప్రాంగణం, జిల్లా సబ్ జైల్ల అధికారి కార్యాలయం ప్రాంగణం స్థలాలను సందర్శించారు. ఆయా ప్రదేశాలను కలియతిరిగి కార్యాలయం విధుల నిర్వహణకు అనుకూలతను కలెక్టర్ పరిశీలించారు. మరింత విశాలమైన స్థలాలను గుర్తించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం స్థానిక కాల్వ ఒడ్డు వద్ద మున్నేరు తీగల వంతెన బిడ్జ్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. వైకుంఠదామం, కాల్వొడ్డు పరిసరాల ప్రాంతాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్లాన్ మ్యాప్ పై అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానికల ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో కర్నల్ ఎస్.కె. భద్ర, కర్నల్ నవీన్ యాదవ్, జిల్లా జైల్ల అధికారి జి. వెంకటేశ్వర్లు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దారు రాంప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తిలో క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్

- ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే ఉద్యోగం
- 28 మంది విద్యార్థుల ఎంపిక
- హర్షం వ్యక్తం చేసిన యాజమాన్యం



**సత్తుపల్లి, నవంబర్ 7 (నినాదం న్యూస్):** సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో స్పైడర్స్ సాఫ్ట్వేర్ కంపెని, సి.ఎస్.ఆర్ కార్పొరేట్ వారిచే క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్కు కళాశాలలో బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్న అన్ని బ్రాంచీలు విద్యార్థులు 183 మంది హాజరయ్యారని కళాశాల ట్రైనింగ్ ప్లేస్ మెంట్ ఆఫీసర్ డాక్టర్ డి.యన్.వి.కృష్ణారెడ్డి తెలియజేసారు. ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ రౌండ్, హెచ్.ఆర్ ఇంటర్వ్యూల ద్వారా మొత్తం 28 మంది విద్యార్థులను తుది జాబితాకు ఎంపిక చేయటం జరిగిందని కంపెనీ నుండి వచ్చిన హెచ్.ఆర్ మేనేజర్లు ప్రతిభ, ఐశ్వర్య తెలిపారు. తుది జాబితాకు అర్హత సాధించిన విద్యార్థులు బి.టెక్ పూర్తి అయిన వెంటనే వీరిని సాఫ్ట్వేర్ డెవలపర్ ఇంజనీర్ గా, వివిధ కేటగిరీ ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరిగింది. విద్యార్థులు తమ కోర్సులు పూర్తి అయిన వెంటనే మెడికల్ స్క్రీనింగ్ పూర్తి చేసి 15రోజులు ట్రైనింగ్ పూర్తయిన వెంటనే ఉద్యోగంలో జాయిన్ అవ్వడం జరుగుతుందని కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేషారత్నకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం పలు ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు, సంస్థలు ప్రతిభావంతులైన విద్యార్థినీ, విద్యార్థులను ఒడిసి పట్టుకునేందుకు అనుసరి స్తున్న విధానమే క్యాంపస్ రిక్రూట్ మెంట్ డ్రైవ్ లని, రిక్రూట్ మెంట్ పరంగా ఇప్పుడు యువత ముందు ఎన్నో అవకాశాలు మరెన్నో మార్గాలు అందుబాటులో వున్నాయని అన్నారు. ఈ సందర్భముగా సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ బండి.పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ బండి అన్విద క్యాంపస్ రిక్రూట్ మెంట్ డ్రైవ్ లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వర్చువల్ గా అభినందనలు తెలియజేసారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిం చాలనే నిర్దిష్టమైన లక్ష్యంతో ఉన్నతమైన విలువలు కలిగిన సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్ మెంట్ డ్రైవ్ ను ఇప్పటికే ప్రారంభించటం జరిగిందని తెలిపారు. తుది జాబితాకు ఎంపికైన విద్యార్థులను, అన్ని బ్రాంచీల విభాగాధిపతులను ప్రభాకర్ రెడ్డి అభినందించారు.

## పలు సేవ కార్యక్రమాలు చేసిన హేమలత బాలాజీ నాయక్

- అయ్యప్ప స్వాములకు సౌండ్ సిస్టం
- అంగన్వాడీ స్కూల్ విద్యార్థులకు గ్రౌండ్ మ్యాట్ అందజేత





**కారేపల్లి నవంబర్ 7నినాదం న్యూస్):** పొలంపల్లి గ్రామపంచాయతిలో వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్, తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనలతో పొలంపల్లి గ్రామపంచా యతీ సర్పంచ్ అభ్యర్థి దారావత్ హేమలత బాలాజీ నాయక్, కాంగ్రెస్ నాయకులు పలు సేవ కార్యక్ర మాలు నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప స్వామి దీక్షదారులు తమ భజనాలకు అవసరమైన సౌండ్ సిస్టం లేక ఇబ్బంది గురిఅవుతున్న విషయం ను పిఎస్ఆర్ యూత్ మండల అధ్యక్షులు జరుపుల ధోని నాయక్ పొలంపల్లి సర్పంచ్ అభ్యర్థి దారావత్ హేమ లత బాలాజీ నాయక్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన హేమలత బాలాజీ నాయక్ అయ్యప్ప స్వాములకు సౌండ్ సిస్టం ను అందించారు. అలాగే పొలంపల్లి తండా అంగన్వాడీ స్కూల్లో విద్యార్థులకు కింద కూర్చోడానికి ఇబ్బంది పడుతున్న విషయంను స్కూల్ టీచర్ హేమలత బాలాజీ దృష్టికి తేవడంతో రెండు గ్రౌండ్ మ్యాట్ను అంగన్వాడీ స్కూల్ విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమం యూత్ నాయకులు అజ్మీరా యుగంధర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు గుగులోత్ కళ్యాణ్, నవీన్, పిఎస్ఆర్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు పేరిట దగా చేసిన బీఆర్ఎస్

- దళితులకు అన్యాయం చేసిన హరీష్ రావు కౌశిక్ రెడ్డి
- ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు కౌశిక్ రెడ్డికి తెలిసే అంతా జరిగింది
- మతి భ్రమించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే.
- టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్



**జమ్మికుంట, నవంబర్ 6 (నినాదం న్యూస్) :**దళిత బంధు పేరిట దగా చేసింది ముమ్మాటికీ బీఆర్ఎస్ నాయకులే అని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ అన్నారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత బంధు నిధులు ఫ్రీజింగ్ చేసి ఆ నిధులను దారి మళ్లించింది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఈ విషయం అప్పుడు ఎమ్మెల్సీగా ఉన్న కౌశిక్ రెడ్డికి తెలుసని దానిని కప్పిపుచ్చి ఎన్నికలలో లబ్ధి పొందేందుకు తనను గెలిపిస్తేనే రెండో విడత వస్తుంది అని మభ్యపెట్టి ఓట్లు దండుకున్నాడు తీరా గెలిచాక ముఖం చాటేసి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఉన్న సమస్యలను గాలికి వదిలేసి కెసిఆర్ కేటీఆర్ మెప్పు పొందేందుకు పూటకో మాట మాట్లాడుతూ అవాకులు చెవాకులు పేలుతూ నోటికి ఏది వస్తే అది మాట్లాడుతూ పబ్బం గడుపుకుంటున్నాడు అన్నారు అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు దళిత బంధు పేరిట భారీ కుంభకోణం చేశారని ఎవరెవరు ఎంత దోచుకున్నారో పక్కా ఆధారాలతో బయటపెడతాం అన్నారు ఈ విషయం పై విచారణ జరిపించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని దళితుల పొట్ట కొట్టి డబ్బులు దండుకున్న ప్రతి ఒక్క నాయకుడి బండారం బయట పెడతాం అన్నారు దళిత బంధు పేరిట రాజకీయాలు చేస్తుంది నువ్వు ఎమ్మెల్సీగా అధికార పార్టీలో ఉన్న నువ్వు అప్పుడు ఎందుకు టెంట్ వేసుకొని సమస్య పరిష్కరించలేదు ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకు వెళ్ళలేదని హుజురాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి వొడితల ప్రణవ్ గారు విశేష కృషి చేస్తున్నారు అది జీర్ణించుకోలేక కేసీఆర్ కేటీఆర్ కు బానిసగా మారి నోటికి వచ్చినట్టు కౌశిక్ రెడ్డి మొరుగుతున్నాడు అని మండి పడ్డారు దళిత బంధు విషయం పై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారిస్తుందని తప్పకుండా దళితులకు న్యాయం చేస్తుంది పేద బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది ఎవరు అయోమయానికి గురి కావద్దని విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం కొనుగోలు తీరుపై అధికారులతో సమీక్ష సమావేశం



**సూర్యాపేట, నవంబర్ 7 (నినాదం న్యూస్):**వాన కాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పని తీరుపై గురువారం కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అదనపు జిల్లా కలెక్టర్ రెవెన్యూ పి రాంబాబుతో కలిసి డి ఆర్ డి ఓ ,డి పి ఎం అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించాలని తెలిపారు. ప్రతి కేంద్రంలో ప్రత్యేక అధికారిని కేటాయించినట్లు పేర్కొన్నారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తి అయిన వెంటనే 24 గంటల లో రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేసేలా సిబ్బంది పని చేయాలని సూచించారు.

## రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశానికే తెలంగాణ రోల్ మోడల్

- ముఖ్యమంత్రి కృషి, పట్టుదలతో తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి
- కాంగ్రెస్కు ప్రజలంతా అండగా ఉండాలి
- సీఎం రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, నవంబర్ 7(నినాదం న్యూస్ ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి అన్నిరంగాల్లో రోల్ మోడల్ గా నిలుస్తున్నదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్య మంత్రి నిరంతరం పట్టుదలతో కృషి చేస్తున్నారని చెప్పారు.గురువారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ, శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలకులు అప్పుల కుప్పగా మార్చిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిస్తున్న ఘనత రేవంత్ రెడ్డి కే దక్కుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమంతో పాటు రైతుల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు.హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దేందుకు ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకొని ముందుకు సాగుతున్నారని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా క్రీడారంగం మరింత మెరుగుపరిచేందుకు స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో కమ్ముకున్న చీకట్లను పారద్రోలి రాష్ట్రంలో వెలుగులు నింపుతున్న మహనీయుడు రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో గత 10 ఏళ్లలో కేవలం 12 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేసిందని విమర్శించారు. అన్నివర్గాల ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం ఎనిమిది నెలల కాలంలోనే 22 లక్షల 22,000 మందికి రుణమాఫీ చేశారని తెలిపారు. దీంతో వ్యవసాయాన్ని రైతులు పండుగలా చేసు కుంటున్నారని చెప్పారు. రైతులు రాజులుగా బతుకుతున్నారని, ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషివల్ల సాధ్యమైందని పేర్కొన్నారు. కేవలం 25 రోజుల్లోనే 18 వేల కోట్ల రుణమాఫీ చేయడం దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగలేదని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ఘనత అని వెలిచాల రాజేందర్ రావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు ప్రజాసేవలోనే నిమగ్నం కావాలని, తెలంగాణ రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథాన ముందుకు తీసుకెళ్లాలని రాజేందర్ రావు ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వెలిచాల రాజేందర్ రావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## మర్కోడులో ఇంటింటి సర్వే



**ఆళ్లపల్లి నవంబర్ 7 నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగనన కుటుంబ సర్వేలో భాగంగా మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో ముమ్మరంగా ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ కాంప్లెక్స్ హెచ్ఎం బాబులాల్, ఉపాధ్యాయులు రమేష్,చందరావు తదితరులు పాల్గొన్నారు.

# కొండ కోనలు దాటి వైద్య శిబిరం..





**ఆళ్లపల్లి,నవంబర్7 (నినాదం న్యూస్):** ఆళ్లపల్లి మండల పరిధిలోని బూసరాయి అనే గిరిజన గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించేందుకు వెళ్లాలంటే దట్టమైన అడవి ఆ గ్రామానికి సరైన రహదారి ఉండదు, వాగులు, వంకలు కొండ కోనలు దాటుకుంటూ సైతం పిహెచ్ సి,పోలీస్ బృందం వారు గురువారం వెళ్లి గిరిజన గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వ వైద్యురాలు సంఘమిత్ర ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించి మందులు పంపిణీ చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తదనంతరం టేకులపల్లి సిఐ సురేష్, స్థానిక ఎస్సై రతీస్ గొత్తికోయ గ్రామ యూత్కు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరైనా తారాస పడితే వెంటనే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని చెడు అలవాట్లకి ఎవరు బానిస కాకుండా క్రీడలు ఆడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ ఎస్ పి గణేష్, పీహెచ్సీ సిబ్బంది హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్ బాబు, నరేష్, ఏఎన్ఎం సుగుణ, విశ్వనాథం, శ్రీ హర్ష తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న గ్రేటర్ వరంగల్ మేయర్



**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 07 (నినాదం న్యూస్):** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం జీడబ్ల్యూఎంసి పరిధిలోని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఖాజీపేట చౌరస్తా లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య , కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే తో కలసి పాల్గొని సమర్థ నిర్వహణకు గణకులకు పలు సూచనలు చేసిన గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి. అనంతరం ఖాజీపేట వాటర్ ట్యాంక్ ప్రాంతం లో ఇంటింటికి తిరిగి స్టిక్కరింగ్ అంటించే ప్రక్రియను ఎమ్మెల్యే, కలెక్టర్ తో కలిసి పరిశీలించిన మేయర్.ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ లు జక్కుల రవీందర్, విజయ శ్రీ రజాలే, అదనపు కమిషనర్ జోనా, ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, ఇన్చార్జి సి పి రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా
- సీసీఐ తేమ శాతం నిబంధనలను ఎత్తివేయాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్



**ఖమ్మం, నవంబర్ 7( నినాదం న్యూస్):** ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సిసిఐ పత్తి కొనుగోలు ఏర్పాటు చేయాలని, ఈ నామ్ పేరుతో జెండా పాట లేకుండా పత్తి కొనుగోలు తో రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని , సిసిఐ తేమ శాతం నిబంధనలు సడలించి రైతులు దగ్గర పత్తి కొనుగోలు వేగవంతం చేయాలి అని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పత్తి మార్కెట్ లో కొనుగోలు జరుగుతున్న తీరు ను రైతుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసిన అరకోర మద్దతు ధర క్వింటాలకు రూ 7521 కూడా లభించే పరిస్థితి లేదని అన్నారు,6700 నుంచి 5000 లోపు పత్తి కొనుగోలు ఖమ్మం మార్కెట్లో జరుగుతుంది అని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)తేమ శాతం నిబంధనలు పత్తి రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నాయి అని తేమ శాతం నిబంధనలు సడలించి రైతులు దగ్గర పత్తి కొనుగోలు వేగవంతం చేయాలి అని డిమాండ్ చేశారు, కొనుగోలు సమయం లో నిర్ణయం చేసిన ధర కూడా పత్తి కాటాలు సమయం కు కోత పెట్టి రైతులు నష్టం చేయడం పై వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు,ఈ వ్యవసాయ సీజన్లో అధిక వర్షాలు తెగుళ్లమూలంగా పత్తి దిగుబడి సగానికంటే తగ్గిపోయింది అని అరకొరగా పండిన పత్తి అమ్మకం లో రైతులు నష్టపోతున్నారు అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులకు మద్దతు ధర అందించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు, ఎర్రా శ్రీనివాసరావు, తాళ్ళపల్లి కృష్ణ, శీలం నరసింహారావు,ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు వాసిరెడ్డి ప్రసాద్ ఎస్ కె మీరా, సుదర్శన్ రెడ్డి,చెరకు మల్లి కుటుంబరావు,కొల్లేటి ఉపేందర్,బోడేపూడి వీరభద్రం, పాపినేని రాం నర్సయ్య, బండారు యాకయ్య, హిమం, తదితరులు పాల్గొన్నారు

## కేజీబీవీ ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలి

**ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేత**



**కాటారం, నవంబర్ 7 (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం, మినిమం టైమ్ స్కేల్ వర్తింపచేయాలని కేజీబీవీ యూని యన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు చల్ల సునీత సభ్యులు విజయ, కవిత,రాజేశ్వరి,నళిని, తదితరులు గురువారం కాటారంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారని జిల్లా అధ్యక్షురాలు చల్ల సునీత, ఉద్యోగులు తెలిపారు.

## తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా దిగజర్ల శ్రీనివాస్



**డోర్నకల్ /మరిపెడ నవంబర్ 07(నినాదం న్యూస్):** తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రానికి చెందిన దిగజర్ల శ్రీనివాస్ ఎంపిక అయ్యారు. గత దశాబ్ద కాలంగా సంఘం అభ్యున్నతికి కృషి చేస్తూ పద్మశాలి ల హక్కుల సాధనకు కృషి చేస్తున్న ఆయనకు రాష్ట్ర పద్మశాలి సంఘం స్టేట్ కమిటీలో స్థానం కల్పించింది.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన ఎంపిక కు సహరించిన,రాష్ట్ర అధ్యక్షులు వల్లకంటి రాజ్ కుమార్, జిల్లా అధ్యక్షులు వేముల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ, కోశాధికారి పెండెం రమేష్ లతో పాటు మహబూబాబాద్ జిల్లా,మరిపెడ పద్మశాలి ప్రతినిధులకు, కులస్తులకు ప్రత్యేక కృత్ఞతలు తెలిపారు.ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలి సంఘం అభ్యున్నతికి కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

## వరంగల్ రైల్వే స్టేషన్‌లో యాంటీ డ్రగ్స్ టీం తనిఖీలు



**వరంగల్ బ్యూరో (నినాదం న్యూస్):** మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా గురువారం డ్రగ్స్ టీం, ఇంతేజార్ గంజ్ పోలీసుల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో పోలీస్ జాగిలంతో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీసులు అనుమానస్పదంగా ప్రయాణి కుల సామానుతో పాటు, బ్యాగ్ లను పోలీ సులు పోలీస్ జాగిలంటో తనిఖీ చేయిం చారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ టీం ఇంచార్జి ఇన్స్ స్పెక్టర్ సురేష్ ప్రయాణికులతో మాట్లాడుతూ ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు రహస్యం గంజాయి లాంటి మత్తు పదార్థాలను అక్రమ చేస్తున్న, విక్రయిస్తున్న, వినియోగిస్తున్న తక్షణమే 8712584473 సెల్ నంబర్ కు సమాచారం అందించాలని. సమాచారం అందించిన వారి వివరాలు గొప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో యాంటీ డ్రగ్స్ టీమ్ ఇన్స్పెక్టర్స్ జె సురేష్, ఆర్ఐ శివ కేశవులు, ఆర్ ఎస్ఐ పూర్ణ చంద్రా రెడ్డి , ఎస్ఐ చాంద్ పాషా, ఏఎస్ఐ సాంబయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు .

## రాష్ట్ర స్థాయి క్రీడకు ఎంపికైన జంగాలపల్లి విద్యార్థి





**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** ములుగు మండలం జంగాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న రిషిక అనేక విద్యార్థి అండర్ 17 ఖోఖో క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బుధవారం పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్దాయి ఖోఖో క్రీడకు ఎంపికైన క్రీడాకారిణి రిషికను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈనెల 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన అండర్ 17 ఖోఖో బాలికల విభాగంలో ములుగు జిల్లా జంగాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు అజ్మీర రిషిక, గుగులోతు శివానిలు అత్యంత ప్రతిభను కనపర్చగా అజ్మీర రిషీక రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి శ్యామల శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రిడా జట్టుకు ఎంపికైన క్రీడాకారిని ఈనెల 8 నుండి 10 వరకు ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడలలో పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు గుండెబోయిన మల్లయ్య తెలిపారు. మారుమూల ప్రాంతాలో విద్య అభ్యసిస్తూ రాష్ట్ర స్దాయి క్రీడకు ఎంపికైన అజ్మీర రిషికను పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్, రమేష్, వీరభద్రయ్య, కృష్ణమూర్తి, అరుణకుమారి, పద్మలు అభినందించారు.

## 25వ రోజు అయ్యప్ప స్వాములకు అన్నదానం



**కోదాడ (అనంతగిరి), నవంబర్ 7(నినాదం న్యూస్):** తెలంగాణ శబరిమల గా పేరుగాంచిన అనంతగిరి శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సన్నిధిలో 48 రోజుల పాటు నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు తెలిపారు. గురువారం అన్నదాన కార్యక్రమంలో దాతలుగా అనంతగిరి మండలం వసంతాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పులిగండ్ల శ్రీనివాసరావు, జానకి దంపతులు వ్యవహరించారు ఈ కార్యక్రమంలో పందిరి వీరయ్య ,గాదం శ్రీను, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ, జంగ శ్రీను, నల్లచర్ల రామకృష్ణ ,270 మంది అయ్యప్పలు పాల్గొన్నారు.

## మరమ్మతులకు నోచుకోని చేతి పంపు

### -మురుగునీరు చేరి కలుషితమవుతున్న మంచినీరు
### -అనారోగ్యానికి ప్రజలు గురయ్యే అవకాశం



**కోదాడ, అనంతగిరి, నవంబర్ 7(నినాదం న్యూస్):** గ్రామీణ ప్రాంతాలలో గతంలో అనేక చేతిపం పులను చూసే వాళ్ళం. ఆర్థిక స్తోమత లేక ఇండ్లో బోరు ఏసుకోలేనివారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేతి పంపులను వాడే వారు. కాలక్రమమైన ప్రభుత్వం అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేతిపంపులు కనుమరుగయ్యాయి. వాటిని మరమ్మతులు చేసే నాథుడే కరవయ్యారు. ఇప్పటికీ కొన్ని గ్రామాలలో అప్పటి చేతిపంపులు ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. అనేకమంది పేదోడికి నీటిని అందిస్తున్నాయి. గతంలో అనంతగిరి మండల వ్యాప్తంగా చేతిపంపుల మరమ్మత్తులకు ప్రత్యేక నిదులు కేటాయించేవారు. కానీ ప్రస్తుతం పట్టించుకునే వారు లేరు. అనంతగిరి మండలం పాలవరం గ్రామంలోని 8 వ వార్డులో ఉన్న చేతి పంపు అనేకమంది ప్రజలకు దాహార్తి తీరుస్తుంది. ఇంటి అవసరాలకు కూడా ఉపయోగపడుతుంది. కానీ ప్రస్తుతం మరమ్మతులకు నోచుకో పోవడంతో చేతిపంపు కింది భాగం పూర్తిగా తుప్పు పట్టి ఊడిపోతూ ఉండడంతో పక్కనే ఉన్న డ్రైనేజీ వాటర్ బోరులోకి వెళుతున్నాయి. దీంతో నీరు కలుషితమవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఏ అవకాశం లేకపోవడంతో ఆ చేతి పంపు నీటినే తాగాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు కలుషితం కావడంతో ఎప్పుడు ఏ జబ్బులు వస్తాయో తెలియని పరిస్థితి, అధికారులు స్పందించి చేతిపంపు మరమ్మత్తులు చేసి తిరిగి వాడుకులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# జన విజ్ఞాన వేదిక ప్రజల్లో చైతన్యం కలిగిస్తుంది

- సైన్స్ పై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- మునిసిపల్ కమీషనర్ నరేష్ రెడ్డి





**డోర్నకల్ /మరిపెడ నవంబర్ 07(నినాదం న్యూస్ ):** జన విజ్ఞాన వేదిక ప్రతి ఏటా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా పాఠశాల స్థాయిలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరిపెడ లో మండల తహశీల్దార్ డి. సైదులు,మున్సిపల్ కమీషనర్ కె. నరేష్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.అనంత రావు, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు బయగాని రామ్మోహన్ సంయుక్తంగా ఆవిష్కరించి పాఠశాల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ సంధర్భంగా జరిగిన కార్యక్రమంలో తహశిల్దార్ సైదులు మాట్లాడుతూ సైన్స్ తోనే సమగ్రాభివృద్ధి కలుగుతుందని,శాస్త్రీయ దృక్పథంను ప్రజలు అలవర్చుకొవాలని,మూఢ నమ్మకాలు,అంధ విశ్వాసాల నిర్మూలనకు ప్రజలందరు కృషి చేయాలని అన్నారు.కమీషనర్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజలలో చైతన్యం కల్గిస్తుందని,విజ్ఞాన శాస్త్ర ఫలితాలను అందరికి అందిస్తుందని అన్నారు.పాఠశాల ప్రధానోపాధయులు అనంతరావు మాట్లాడుతూ చెకుముకి పరీక్ష ద్వారా విధార్థులలో సృజనాత్మకత పెరుగుతుందని,అంతర్గత శక్తులు వెలికి తీయబడతాయని అన్నారు.జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు బయగాని రాంమోహన్ మాట్లాడుతూ ప్రజల కోసం సైన్స్,ప్రగతి కోసం సైన్స్,శాంతికోసం సైన్స్, దేశం కోసం సైన్స్,స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదాలతో జన విజ్ఞాన వేదిక పని చేస్తుందని,శాస్త్ర ప్రచారం చేస్తూ,ప్రజలలో శాస్త్రీయ ధృక్పదాన్ని పెంపొందిస్తుందని అన్నారు.పాఠశాల స్థాయిలో 8, 9, 10 వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్ లో పాల్గొనగా, 8వ తరగతి నుండి సాయి చరణ్, 9వ తరగతి నుండి స్వాతి 10 వ తరగతి నుండి స్వప్న మండల స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు.విజేతలకు జన విజ్ఞాన వేదిక కన్వీనర్ శ్రీశైలం బహుమతి ప్రధానం చేశారు. ఎంపి కైన విద్యార్థులు మండల స్థాయిలో జరిగే పోటీలలో నవంబర్ 21,2024 న పాల్గొంటారు.జెవివి మండల ఉపాధ్యక్షులు జనార్ధనాచారి, కన్వీనర్లు శ్రీశైలం,స్వప్న, రాజకు మారి,ఉపాధ్యా యులు,విద్యార్థులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలియజేశారు.

# పోలీసులపై ప్రజలకు నమ్మకాన్ని పెంచండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- శాయంపేట పోలీస్టేషన్ తనిఖీ



**వరంగల్ బ్యూరో (నినాదం న్యూస్):** పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం హనుమకొండ జిల్లా శాయంపేట పోలీస్ స్టేషన్ ను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసుల గౌరవ వం దనం స్వీకరించిన పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరుచేసిన కిట్ ఆర్టికల్స్ ను తనిఖీ చేశారు. స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీ షీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు కోర్ట్ లో పెండింగ్ లో వున్న కేసులు, వాటికి సంబందించిన దర్యాప్తు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ లో నిర్వహిస్తున్న పలురకాల రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సమస్యతో పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలి. ఫిర్యాదు వచ్చి వెంటనే స్పందించాలని, ప్రజలకు పోలీసులపై వున్న నమ్మకానికి తగ్గాటుగానే పోలీసులు. నీజాయితీ తో పనిచేయాలని, పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ట లకు భంగం కలిగించే విధంగా వ్యవహారిస్తే చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ చేతులమీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో పండ్ల మొక్కను నాటారు. ఈ తనిఖీల్లో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్,పరకాల ఏసీపీ కిశోర్, సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ రంజిత్ రావు, ఎస్. ఐ ప్రమోద్ కుమార్ తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వరి కోత సమయంలో 18-20 ఆర్‌పిఎమ్ నిర్వహించాలి

- ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టవద్దు
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** ప్రతి హార్వెస్టర్ వరికోత సమయంలో 18-20 ఆర్‌పిఎమ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2024-25 ఖరీఫ్‌లో పంట కోతలో పాల్గొనే హార్వెస్టర్ యజమానులతో ఎస్పి షభరిష్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్ మహేందర్ జి లతో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌పిఎమ్ నిర్వహించడం ద్వారా మంచి వరి వస్తుందని, తాలూ, పండని ధాన్యం కూడా తొలగించబడుతుందని తెలిపారు. హార్వెస్టర్ ఈ విధానాన్ని అనుసరిస్తే, రైతులు వరి సగటు నాణ్యత కోసం మళ్లీ వరిని శుభ్రం చేయాల్సిన అవసరం ఉండదని, రైతులకు ఖర్చులు తగ్గుతాయని అన్నారు. అన్ని మండల వ్యవసాయ అధికారులు, హార్వెస్టర్ యజమానులతో మండల స్థాయిలో సమావేశం నిర్వహించి స్పష్టమైన సూచనలు ఇవ్వాలని, రైతులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతుంది, ధాన్యం కొనుగోలు కు సంబంధించి ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ పనిచేస్తుందా, గన్నీ సంచులు అందినాయా, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయా, ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు అయిన రైతులకు సకాలంలో డబ్బులు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డిఓ ఎన్.వెంకటేష్, డిసిఎస్ఓ షా ఫైజల్ హుసేని, డిఎండిసిఎస్ఓ రాంపతి, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్,డీఎం గిరిజన సహకార కార్పొరేషన్ ప్రతాప్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, తహసిల్దార్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్ నితీష్, హార్వెస్టర్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# దళితులు ఐక్యంగా ఉంటేనే రాజ్యాధికారం

- మనువాదుల కుట్రలను తిప్పికొట్టాలి
- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



**వరంగల్ ప్రతినిధి నవంబర్ 07 (నినాదం న్యూస్):** దళితులు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం దిశగా పయనించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు.ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోరుతూ నిర్వహిస్తున్న మాలల మహాపాదయాత్ర గురువారం వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చేరుకుంది.ఈ సందర్భంగా కాశిబుగ్గ లోని అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతల తో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం నుండి హైదరాబాదు వరకు 38 రోజుల పాటు 16జిల్లాలు 35నియోజకవర్గాల మీదుగా మాలల మహాపాదయాత్ర జరుగుతున్నట్లు తెలిపారు. ఆశాస్త్రీయమైన వర్గీకరణను నిలిపివేసి, మాలలపై జరుగుతున్న కుట్రలు మానుకోవాలన్నారు. దేశంలో దళితుల మధ్య అనైక్యతను తీసుకువచ్చేందుకు పాలకులు అగ్రకులాలు మనువాదులు ఆడుతున్న కుట్రల పట్ల దళితులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మందకృష్ణ చేస్తున్న పోరాటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మాలల కష్టం తో ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి పదవి నుండి ఎలా దింపాలో మాలలకు తెలుసన్నారు.వాస్తవాలు తెలుసుకోకుండా, శాస్త్రీయ ఆధారాలు లేకుండా రాష్ట్రం లోని అన్ని రాజకీయ పార్టీలు ఒక్కటై మాదిగల అవకాశాలను మాలలు దోచుకుంటున్నారని ఆరోపించడం సరైన పద్ధతి కాదన్నారు. అంబేద్కర్ వాదంపై జరుగుతున్న మనువాద కుట్రలను తిప్పి కొట్టేందుకు సాగుతున్న మాలల మహాపాదయాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలుపాలన్నారు. ఈ కార్యక్రమం లో జాతీయ మాల మహానాడు నాయకులు బొల్లం రామ్ కుమార్, కొమ్ము శ్రీకాంత్, ఊసిల్ల ఉదయ్, పెరుమండ్ల రవి, శంకర్, పాపారావు, సంజీవ, రఘు, అంకూస్, రవికుమార్, బండి రజనీ కుమార్, ముదుసు నరసింహ, దాసరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# వర్గ పోరాటాలతో అస్తిత్వ పోరాటాలు



**వరంగల్ ప్రతినిధి నవంబర్ 07 (నినాదం న్యూస్):** దేశంలో పెట్టుబడిదారీ భూస్వామ్య అవశేషాలతో ఫాసిస్టు పాలన అన్ని వర్గాల ప్రజలపై రాజ్యాంగ సంస్థలపై తీవ్రమైన పైశాచిక దాడులను దోపిడీ అణచివేతలను కొనసాగిస్తున్న నేపథ్యం లో వర్గ పోరాటాలతో అస్తిత్వ పోరాటాలు ఆత్మగౌరవ పోరాటాలు సామాజిక న్యాయ పోరాటాలు ఐక్య పోరాటాలు కొనసాగించవలసిన ఆవశ్యకత ఆసన్నమైందని నేదునూరి జ్యోతి తెలిపారు.గురువారం జగిత్యాల జిల్లా కోరుట్ల పార్టీ కార్యాలయం ఎన్నం రాధా అధ్యక్షతలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా స్థాయి సమావేశంలో హాజరై మాట్లాడుతూ దళితులు గా వెనుకబడిన తరగతులు గా మహిళలు గా భిన్న సెక్షన్లు గా పోరాటాలు కొనసాగిస్తున్న సామాజిక శక్తులు వర్గ పోరాట శక్తి తో మమేకమై పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలనకు ఐక్యత పోరాటాలు అవసరమన్నారు. దోపిడీ పాలకవర్గాల రాజ్యాధికారాన్ని కూలదోసి సమ సమాజాన్ని నిర్మించుకోవడం ద్వారానే మహిళా సమస్యలతో పాటు సకల సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందని పేర్కొన్నారు. శ్వేత సౌదం లో కమలా హరీష్ ఓడిపోవడానికి పురుష అహంకార ఆధిపత్య ధోరణి కారణం ఒకటే అని పేర్కొన్నారు. భూమి సంపద దేశము లోని ఆధిపత్య శక్తుల ఆధీనం లో చేరిపోయి సామ్రాజ్యవాదం తో జతకట్టి ప్రజా పోరాటాలని అనిచి వేయ చూస్తూన్న పాలకులు అంతమయ్యే రోజు ఎంతో దూరం లేదన్నారు. గ్రామస్థాయి నుంచి మహిళా సంఘాన్ని నిర్మించి మహిళా హక్కుల పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల శాంత, ఎస్ గంగామణి, సాంబార్ సంతోష పాల్గొన్నారు.

## నిరుద్యోగులు ఆర్థికంగా నిలదొక్కోవడానికి చిరు వ్యాపారాలు ఆధారం



**వరంగల్ ప్రతినిధి నవంబర్ 07 (నినాదం న్యూస్):** నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కు ఎదురు చూడకుండా తమ జీవనం కొనసాగించుటకు చిన్నచిన్న వ్యాపారంలు మొగ్గు చూపాలని గ్రేటర్ వరంగల్ కరీమాబాద్ 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఉర్సు దర్గా వద్ద శ్రీ వైష్ణవి మిల్క్ షాపును ప్రారంభించినారు. ఉన్నత విద్యను అభ్యసించి ఎటువంటి ఉద్యోగ అవకాశాలు లేనందున ఆర్థికంగా నిలదొక్కవటానికి ఉర్సు కురుమవాడ కి చెందిన చీర వైష్ణవి వ్యాపారం చేయడానికి ముందుకు రావడానికి కార్పోరేటర్ మరుపల్ల రవి అభినందించినారు. నిరుద్యోగులు వ్యాపారాలు చేసుకునే వారికి ప్రభుత్వం ముందుకు వచ్చి బ్యాంకుల ద్వారా సబ్సిడీ ఇప్పించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరినారు. ఈ కార్యక్రమం లో చీర భరత్, మరుపల్ల గౌతమ్, వేణుగోపాల్, భగత్, కార్తీక్, మధు తదితరులు పాల్గొన్నారు.


## ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

### - నవంబర్ 09,10 లలో ప్రత్యేక క్యాంపుల ఏర్పాటు
### - కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి,(నినాదం న్యూస్):** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి దివాకర టిఎస్ తెలిపారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ 2025 కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ చేపట్టిందని 01జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలో ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు 29 అక్టోబర్ 2024 న జారీ చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై అక్షేపణలు, అభ్యంతరాలు తీసుకోవడం, 09,10 నవంబర్ 2024 లలో ప్రత్యేక క్యాంపేయిన్ డే లను నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ములుగు నియోజక ర్గానికి చెందిన ముసాయిదా ఓటరు జాబితాను జారీ చేయడం జరిగిందని, ముసాయిదాను పరిశీలించి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేసుకునేలా అవకాశం కల్పించడం జరుగుతుందని, జాబితాలో తప్పొప్పుల సవరణ, పేర్లపై అక్షేపణలు, అభ్యంతరాలను తెలపడానికి 29 అక్టోబర్ 2024 నుండి 28 నవంబర్ 2024 వరకు గడువు ఇవ్వడం జరిగిందని, దీని కోసం 09,10 నవంబర్ 2024న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపేయిన్ డేలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్పెషల్ క్యాంపేయిన్ లను నిర్వహించడానికి సంబందిత బూత్ స్థాయి అధికారులు వారి పోలింగ్ కేంద్రాలలో ఉదయం 10.00 గంటలోగా హాజరు కావాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తిచేసి లాజికల్ ఎర్రర్స్ లేకుండా చూడాలని, పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండే ట్రాన్స్ జెండార్, వికలాంగులు ఓటర్లుగా నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీ లు, జర్నలిస్టులు, జ్యుడీషరి, ఇతర ప్రజాప్రతినిధులు,ముఖ్యమైన వ్యక్తుల వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్ఓ సూపర్ వైజర్లు పరిశీలించి ధృవీకరించి, ధృవీకరణను సమర్పించాలన్నారు. ఈఆర్ఓలు కనీసం 10 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వివరాలను ధృవీకరించుకోని జిల్లా ఎన్నికల అధికారిని ధృవీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రం పరిదిలోని విఐపిల వివరాలు జాబితా నుండి తొలగిపోకుండా సరిచూసుకొని ఈఆర్ఓ లు నిర్ధారించుకోవాలని తెలిపారు.

## వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి



**వరంగల్ ప్రతినిధి నవంబర్ 07 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఈ నెల 9,10 శనివారం, ఆదివారం లలో నియోజకవర్గ పరిధి లోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవెల్ అధికారి బి ఎల్ ఓ అందుబాటులో ఉంటారు. మీరు, మీ కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లు వారి యొక్క పోలింగ్ కేంద్రాల కి వెళ్లి ఓటర్ లిస్ట్ లో ఉన్నాయో లేదో చెక్ చేసుకోగలరు. ఒక వేళ ఓటర్ లిస్టు లో పేరు లేక పోతే ఆధర్ కార్డ్ జిరాక్స్, ఫోటో అక్కడ అందుబాటులో ఉన్న బూత్ లెవెల్ అధికారి బి ఎల్ ఓ కి ఇచ్చి ఓటర్ లిస్టు లో పేరు నమోదు చేసుకోగలరు.ఈ ఓటర్ లిస్టు ద్వారానే రాబోయే మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలకు వెళ్ళడం జరుగుతుంది.

## ముఖ్యమంత్రికి చిత్రకారుడి
# జన్మదిన శుభాకాంక్షలు



**కొడంగల్ నినాదం :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా దౌల్తాబాద్ మండలం లోని యాంకి గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు (కార్టూనిస్ట్) సున్నపు అశోక్ కార్టూన్ పై రేవంత్ రెడ్డి చిత్రపటాలను గీసి తన అభిమానాన్ని చాటుకున్నడు.రేవంత్ రెడ్డి తన మనువడితో మరియుఆయన స్పీచ్ ఇస్తున్న ఫోటోలు, వివిధ సందర్భాల్లో కనబడిన చిత్రాలను గీసి రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశాడు.ఈసందర్భంగా రేవంత్ రెడ్డి అభిమానులు సున్నపు అశోక్ ను అభినందిస్తున్నారు.

## పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు చిరు సాయం



**కొల్చారం నవంబర్ 7 (నినాదం న్యూస్) :** కష్టపడి చదివితేనే జీవితంలో రాణిస్తారని కొల్చారం అంగన్వాడి టీచర్ చౌరి గారి మేఘమాల అన్నారు. మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారం మూడో నెంబర్ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్ చౌరిగారి మేఘమాల మనుమరాళ్ళు మోదిని ఆశ్రిత ఎనిమిదవ జన్మదినం, మోదిని హన్విక నాలుగవ జన్మదినం పురస్కరించుకొని గురువారం అంగన్వాడి విద్యార్థులకు బ్యాగులు, పలకా బలపాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు క్రమశిక్షణతో పౌష్టికాహారం తింటూ చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి పాఠశాల ఆయమ్మ ప్రమీల, మౌనిక, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వాడొద్దు



**మహేశ్వరం, నవంబర్ 7 ( నినాదం న్యూస్) :** మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కందుకూరు సీఐ సీతారాం విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల కట్టడిలో భాగంగా కందుకూరు మండల కేంద్రం, గూడూరు గేటు ఆవరణలో ఉన్న ఎస్ఆర్ఎ భవనంలో మహేశ్వరం బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఈమనీ శ్రీలక్ష్మీ ఆధ్వ ర్యంలో మాదకద్రవ్యాల నిరోధకతపై అహగాహనా కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశను ఉండే మాదక ద్రవ్యాల వల్ల వచ్చే అనర్థాలను తెలుసుకోవా లన్నారు. వీటి వినియోగం వల్ల వచ్చే అనర్థాలు ప్రజల ప్రాణాలకు హానికరమన్నారు. మాదకద్ర వ్యాల వినియోగం వలన ఊపిరితిత్తులు, మూత్రపిండా లు, టీబీ, కేన్సర్ లాంటి ప్రమాదకరమైన జబ్బులు వస్తా యన్నారు. వీటి కట్టడికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే 100 నెంబరు డయల్ చేయా లన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## నకులేశ్వరి దేవి పీఠంలో కోటి దీపోత్సవంలో
# పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి




**కుత్బుల్లాపూర్, నవంబర్ 7 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ కైలాష్ హిల్స్ శ్రీ నకులేశ్వరి దేవి సిద్ధి పీఠంలో జరుగుతున్న కోటి దీపోత్సవ కార్యక్రమంలో వర్ధిల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మహా శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖ: సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎండీ లాయక్, నరేష్ రెడ్డి, అబ్దు భాయ్, గఫ్ఫార్, అజయ్, శ్రీనివాస్, అనిల్ రెడ్డి, సతీష్ బాబు, కిష్ట రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాగ రాజు, శ్రీలత, లలిత, రహీం, దేవేందర్ రెడ్డి, మహేష్, ఖాజ, రెహమాన్, గౌస్ పాల్గొన్నారు.

## సంపూర్ణ ఇంటింటి కులగణనకు వచ్చే
## ఎన్యూమరేటర్లకు పార్టీ శ్రేణులు సహకరించాలి

- **కూన శ్రీశైలం గౌడ్**



**కుత్బుల్లాపూర్, నవంబర్ 7 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నివాసానికి సంపూర్ణ కుల గణన నిర్వహించే ఎన్యుమ రేటర్లు స్టిక్కర్ అతికించారు. ఈ సందర్భంగా కూనా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ కుల సర్వే( సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారని పేర్కొన్నారు. నవంబర్ 20 వ తేదీలోపు కులగణనను పూర్తి చేయాలనే సంకల్పంతో చేపట్టిన కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అందరూ ప్రజల సహకారం తీసుకొని పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు . ఈ సర్వే చేయడానికి ఇంటికి వచ్చిన అధికారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అండగా ఉండి ప్రతి కుటుంబం వద్ద సర్వే వివరాలను అందించే విధంగా అధికారులకు సహకరించాలని వివరించారు.

## నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ

- **బీజేపీ నాయకురాలు అనూష మహేష్ యాదవ్**



**మాదాపూర్ న్యూస్ నినాదం ప్రతినిధి :** బిజెపి హఫీజ్ పేట్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీమతి బోయిని అనూష మహేష్ యాదవ్ గారి జన్మదిన సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని హఫీజ్ పేట్ డివిజన్ లో దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు గారు పాల్గొని పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా అనే వారు లేక అందురూ ఉండి కూడ కొందరు ఏ ఆసరా లేకుండా బస్ స్టాప్ లోనూ ఫుట్ పాత్ ల మీద ఆలయాల పరిసరాల్లోనూ తలదాచుకుంటూ దీనమైన స్థితిలో ఉంటారు అని అన్నారు.అలాంటి వారు అందురూ ఈ తీవ్రమైన చలికి అనేక రకాలుగా ఇబ్బందులు పడుతుంటారు.ఇలాంటి వారికి మనం చేసేది చిన్నసహాయం కావచ్చు కాని అవసరం ఉన్నవారికి చేస్తే అది మాటలకందని తృప్తిని ఇస్తుంది అన్ని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సలీం, వెంకన్న, దేవేందర్, లక్ష్మణ్, నవీన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# యాదవ కులస్తులకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

- లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతాం
- యాదవ హక్కుల పోరాట సమితి




**ఖైరతాబాద్: నవంబర్ 07 (నినాదం న్యూస్) :** యాదవ కులస్తులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోరాట సమితి సభ్యులు చిలుకల శ్రీనివాస్, వెంకటరమణ, కటారి రాములు, గుడిగే శ్రీనివాస్ లతో కలిసి మాట్లాడారు.. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 20 శాతం పైగా జనాభా కలిగిన యాదవులకు పదవులలో సముచిత స్థానం కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో యాదవులకు అన్యాయం జరిగిందని గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తూ పార్టీ అధికారంలోకి రావడానికి యాదవులు తీవ్ర కృషి చేశారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా యాదవులకు తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో 20 రోజుల్లో యాదవులకు మంత్రి పదవిలో చోటు కల్పించడం తో పాటు మూడు ఎమ్మెల్సీ పదవులు, ఐదు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.యాదవ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 5000 కోట్ల రూపాయలను కార్పొరేషన్ కు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవుల సత్తా చూపించి కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని హెచ్చరించారు.

## మహేశ్వరంలో కరెంట్ కొరత లేకుండా చూడాలి


- **విద్యుత్ అధికారులతో కేఎల్ఆర్ చర్చ**



**మహేశ్వరం, నవంబర్ 7 (నినాదం న్యూస్) :** మహేశ్వరం నియోజకవర్గంలో విద్యుత్ సమస్య లేకుండా చూడాలని అధికారులను మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. తుక్కుగూడ కేఎల్ఆర్ కార్యాలయంలో ఎస్ఈ, డీఈ, ఏడీ సహా ఏఈలు మర్యాదపూర్వకంగా లక్ష్మారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కిచ్చెన్న మాట్లాడుతూ.... ట్రాన్స్ఫర్మర్ల కొరత, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. అవసరమైన కరెంటు సామగ్రి కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేస్తానని కేఎల్ఆర్ హామీ ఇచ్చారు. భవిష్యత్ (20 ఏళ్ల పాటు) విద్యుత్ అవసరాలకు దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా ఏర్పట్లు చేసుకోవాలని అధికారులను సూచించారు.

## జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప పార్కులను అభివృద్ధి చేయ్యండి

- **సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్**



**కుత్బుల్లాపూర్, నవంబర్ 7 (నినాదం న్యూస్) :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రజవాని కార్యక్రమంలో భాగంగా గత నెలలో జగద్గిరిగుట్ట రాజీవ్ గురకల్ప పార్కులను అభివృద్ధి చెయ్యాలని సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశామని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు. వినతిపత్రం అందజేసి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు సంబంధిత అధికారులు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులకు ఆదేశాలు జరిచేసి వెంటనే పార్కులు అభివృద్ధి అయ్యేలా చూడాలని నేడు గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి కి సిపిఐ బృందం మరోసారి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు డిప్యూటీ కమిషనర్ తో మాట్లాడుతూ జగత్గిరిగుట్ట రాజీవగృహకల్ప లోని పార్కులు నిరూపయోగంగా మారాయన్నారు. పార్కు స్థలాలలో మట్టి,వ్యర్ధాలు వేస్తున్నారని, రాత్రి సమయంలో గంజాయి,మందు బాబులకు అడ్డగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పార్కులో అభివృద్ధి అయ్యేలా చర్యలు చేపట్టి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. రాజీవగృహకల్ప లో రోడ్డు కు ఇరువైపుల డబ్బాలు వేసుకొని వ్యాపారం మాటున వెనుక ఉన్న స్థలాన్ని ఆక్రమించడానికి పన్నాగం పన్నుతున్నారని తెలిపారు. ఇదే విషయం పత్రికలో వచ్చాయని ఇందులో జి హెచ్ ఏం సి కాంట్రాక్టర్ హస్తం ఉందని కూడా వార్తా కథనాల్లో పేర్కొన్నట్లు ఉమా మహేష్ మల్లారెడ్డికి వివరించారు. అలాంటి వారు మునిసిపల్ కు ఎలాంటి సంబంధం ఉన్నా వెంటనే వారి పై చర్య తీసుకోవాలని కోరారు.లేకపోతే దీన్నే అదునుగా చూసుకొని ఇతర మునిసిపల్ వారు కూడా పనిచేసే అవకాశం ఉన్నదన్నారు. జగత్గిరిగుట్ట రోడ్ నంబర్ 1లో సీసీ రోడ్ పూర్తిగా ధ్వంసం అయ్యిందని కొత్త రోడ్డు వెయ్యాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, సహదేవ్ రెడ్డి,ఇమామ్,వెంకటేష్ లు పాల్గొన్నారు.

## కార్తీక మాస వనభోజనాలకు కొలను గోపాల్‌రెడ్డికి ఆహ్వానం



**కుత్బుల్లాపూర్, నవంబర్ 7 (నినాదం న్యూస్) :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి ని ప్రగతి నగర్ రెడ్డి సామాజిక వర్గం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్డీస్ కార్తీక మాస వనబోజన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాంబ శివారెడ్డి,శేఖర్ రెడ్డి,శివారెడ్డి,బలవంత్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి, ఆది రెడ్డి,ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

## చెక్ పూజా కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, నవంబర్ 7 (నినాదం న్యూస్) :** సుభాష్ నగర్ డివిజన్ రాంరెడ్డి నగర్‌లో నిర్వహించిన ఛత్ పూజా మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఛత్ పూజ, మహా పర్వ్ అని కూడా పిలుస్తారు, ఇది ప్రతి సంవత్సరం జరుపుకునే ముఖ్యమైన హిందూ పండుగ. ఈ పండుగను ప్రధానంగా బీహార్, జార?ండ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో జరుపుకుంటారు. ఈ రోజున భక్తులు అస్తమించే సూర్యునికి నీరు ( అర్ఘ్యం ) సమర్పిస్తారు, ఆహారం, నీరు లేకుండా భక్తి తో ఉపవాసం ఉంటారు అని సురేష్ రెడ్డి అన్నారు.మిమ్మల్ని అందరిని మా అన్న, తమ్ములు, అక్కచెల్లమ్మల లాగ, మా కుటుంబం లోని ఒకరిగా చూస్తాము అని సురేష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి వెంట రామ్ రెడ్డి నగర్, సుభాష్ నగర్ ఛత్ పూజ నిర్వాహకులు, బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ కమిటీ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయం



**జవహర్ నగర్, నవంబర్ 7: నినాదం న్యూస్ :** రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు సీఆర్పీఎఫ్ విద్యార్థి ఎంపికవ్వడం అభినందనీయమని ప్రిన్సిపల్ డి. అపర్ణ, ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్ అన్నారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి బాస్కెట్బాల్ 14వ బాలుర విభాగంలో ప్రత్యేక ప్రతిభ కనబర్చిన కూరపాటి వసంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో గురువారం సీఆర్పీఎఫ్ పాఠశాలలో ప్రిన్సిపల్ డి. అపర్ణ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ క్రీడలు మానసికొల్లాసానికి, శారీర ధృడత్వానికి దోహదం చేస్తాయని అన్నారు. సీఆర్పీఎఫ్ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీల్లో ప్రతిభ చూపించి జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని పేర్కొన్నారు. అనంతరం కూరపాటి వసంతు పాఠశాల బృందం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్, హెడ్ మిసెస్ ఆశాజీకుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్, భాస్కరెడ్డి, వినోద్, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవాలి

- **భువనగిరి యూత్ కాంగ్రెస్ లీడర్ నిఖిల్ రెడ్డి**




**ఖైరతాబాద్, నవంబర్07 (నినాదం న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచి సొంత పార్టీ నేతల పైన విమర్శలు చేస్తున్న తీన్మార్ మల్లన్న పై పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని భువనగిరి యూత్ కాంగ్రెస్ లీడర్ నిఖిల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో రెడ్డి లకు, బీసీలకు మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం తీన్మార్ మల్లన్న చేస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి ఎమ్మెల్సీగా గెలిపిస్తే సొంత పార్టీ నేతల పైనే విమర్శలు కురిపించడం ఎంతవరకు సమంజసమని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీలో తనకంటే ముందు నుంచి ఎంతోమంది సీనియర్ బీసీ లీడర్లు ఉన్నారని వారిని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీన్మార్ మల్లన్న కు అధిష్టానం నోటీసులు జారీ చేస్తూ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. తీన్మార్ మల్లన్న ను బీసీలు ఎవ్వరు నమ్మకూడదని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## సీఎస్సీ ఫర్టిలైజర్ షాప్స్
# రికార్డులు తనిఖీ

- మండల వ్యవసాయ అధికారి సతీష్



**కోహేడ, నవంబర్07 (నినాదం న్యూస్):** మండలలోని సిఎస్సి ఫెర్టిలైజర్ షాపుని మండల వ్యవసాయ అధికారి సతీష్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సక్రమంగా ఉన్నట్టు గుర్తియించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సిఎస్సి ఫెర్టిలైజర్ షాపులో యాసంగి సాగు కి మొక్కజొన్న, వరి,విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.రైతులు లూజ్ గా ఉన్న సంచులలోని విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు.విత్తన ప్యాకెట్,బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు రైతులు భద్రపరుచుకోవా లన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపబడిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.విత్తన డీలర్లు విత్తన చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఆయన వెంట విస్తరణ అధికారులు శ్రీధర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్. కృష్ణయ్య పోరాట ఫలితమే
# సమగ్ర కుటుంబ సర్వే

- మన్నె బస్వరాజ యాదవ్




**కొడంగల్ నినాదం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మాజీ రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఆర్ కృష్ణయ్య పోరాట ఫలితమే అని కొడంగల్ బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజు యాదవ్ అన్నారు. సమగ్ర కుల గణన చేపట్టాలని గతంలో ఆర్ కృష్ణయ్య హైకోర్టులో ఫిటిషన్ వేసిన సందర్భాన్ని గుర్తుచేశారు. ఈసమగ్ర కులగణనలో బిసి లు అందుబాటులో ఉండి, ఎన్యుమరేటర్స్‌కి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాన్ని నిలబెట్టుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు వేణుగోపాల్ ముదిరాజ్, జిల్లా యాదవ హక్కుల పోరాట సమితి గౌరవ అధ్యక్షులు పిరంపల్లి శ్రీనివాస్ యాదవ్, తాలూకా బీసీ సంఘం కార్యదర్శి, యాదగిరి పటేల్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు నర్సింలు యాదవ్,మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, బీసీ సంగం నాయకులు బాలకృష్ణ గౌడ్, పూర్ర వెంకటయ్యయాదవ్, బాబు, హన్మంతు, మోహన్, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డిలకు
## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మేయర్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 7 (నినాదం న్యూస్) :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజు యాదవ్ పిఎ శ్రీధర్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్ రెడ్డి ల జన్మదిన వేడుకల సందర్భంగా మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీధర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి లను షాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మల్లికార్జున స్వామి ఆలయంలో
# ఘనంగా చెట్ పూజా వేడుకలు

- **చెట్ పూజ వేడుకలకు హాజరైన శ్రీనివాస్ యాదవ్**



**కుత్బుల్లాపూర్, నవంబర్ 7 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ మెట్ కానీ గూడ ప్రాంతంలో వెలిసిన శ్రీ మల్లికార్జున స్వామి గుడి వద్ద చెట్ పూజా వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకలకు పిఎసిఎస్ డైరెక్టర్ పరుస శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా సర్రై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లోహరి సింగ్ యాదవ్ పాల్గొన్నారు.

## ఆర్ఓఆర్ బ్రిడ్జిపై ఉన్న గుంతను పూడ్చండి

- ప్రాణాలు పోతే కానీ స్పందించరా
- సిఐటియు జిల్లా కార్యదర్శి కొప్పుల శంకర్

**జమ్మికుంట, నవంబర్ 6 (నినాదం న్యూస్):** జమ్మికుంట ఆర్ఓఆర్ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలని, నిత్యం వంద లాది వాహనాలు వేలాది ప్రజలు తిరుగుతున్న సంద ర్భంగా, ప్రమాదం ఏర్పడితే దీనికి ఎవరు బాధ్యులని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ ప్రశ్నించారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆర్ వో ఆర్ బ్రిడ్జిపై నిరసన కార్యక్రమాన్ని తెలిపారు. పట్టణంలో 30 మంది కౌన్సిలర్లు, చైర్మన్, కమిషనర్ గారు, ప్రధాన రహదారి అయినా జమ్మికుంట నుండి హుజురాబాద్ కు ఉన్న, ఓర్ బ్రిడ్జి పైనుండి వెళ్తున్న, సంబంధిత శాఖ ఆర్ అండ్ బి గాని, స్థానిక మున్సిపల్ శాఖ గాని, పట్టించుకోకపోవడం, చాలా బాధాకరమైన అన్నారు, ఒకపక్క, ప్రభుత్వం, వాహనాల ద్వారా, టాక్సీ ల పేరిట, లక్షల కోట్ల రూపాయలు ఆదాయం పొందుతూ, నంబర్ ప్లేట్లు లేవని, ఇన్సూరెన్సు అయిపోయినవని, ప్రమాదాలు జరుగుతున్నావ నీ, మోటార్ వెహికల్ వాహనదారులపై, వేళల్లో పన్నులు వసూలు చేస్తూ, పోలీస్ శాఖ తరపున కూడా ఫైన్లు వేసి లక్షల రూపాయలు ఆదాయం సమకూర్చుకుంటుంది కానీ, చెడిపోయిన రోడ్లను బాగు చేయడంలో, ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరచడంలో, నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు బైరం సమ్మయ్య, కుసుమ రవి, బండ సురేష్, సాగర్ల సారంగ పనులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పాలనలో దగాపడ్డ ఉద్యమకారులు



**కరీంనగర్, నవంబర్ 7(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేయగా, రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వారి త్యాగాలను గుర్తించి గౌరవిస్తోందని మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 27, 28, తేదీల్లో కరీంనగర్ లోని అమరవీరుల స్థూపం నుంచి వేములవాడ మహాదేవుని ఆలయం వరకు నిర్వహించతలపెట్టిన మహా పాదయాత్రకు సంబంధించిన పోస్టర్ ను ఆయన గురువారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ,తెలంగాణ ఉద్యమకారులను గత ప్రభుత్వం తన రాజకీయ అవసరాల కోసం వాడుకొని వదిలేసిందని విమర్శించారు. అన్ని విధాలుగా ఉద్యమకారులను దగా చేసిందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక పోషించిన ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి సముచితరీతిలో గౌరవిస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తూచ తప్పకుండానెరవేరుస్తుందని, భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మంచి సంకల్పంతో నిర్వహించతలపెట్టిన ఈ పాదయాత్రను విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, రాష్ట్ర మహిళా నాయకురాలు ఐల ప్రసన్న, కంజర్ల రేణుక, భార్గవి , ఫోరం మండలాల అధ్యక్షులు దేవునూరి అంకూస్, గోశెట్టి సంజీవ్, బట్టి చంద్రమౌళి, భూమ సదానందం, కే విద్యాసాగర్, తాటిపల్లి శంకర్, నాయకులు మామిడి మొగిలి, చొప్పరి సుధాకర్, తార, మామిడి వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి పత్తి కృష్ణారెడ్డికి లేదు -టిఆర్ఎస్ నేత పర్లపెల్లి రమేష్



**జమ్మికుంట, నవంబర్ 6 (నినాదం న్యూస్) :** ప్రజల చేత ఎన్నుకోబడిన హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డిని విమర్శించే స్థాయి టిపిసిసి సభ్యులు పత్తి కృష్ణారెడ్డి కి లేదని టిఆర్ఎస్ నేత మాచనపల్లి మాజీ సర్పంచ్ పర్లపల్లి రమేష్ అన్నారు. గురువారం జమ్మికుంట లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన స్థానిక నేతలతో కలిసి మాట్లాడారు, బుధవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట లో గల గుండ్ల చెరువులో చేప పిల్లలను వదిలే కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడుతుండగా కొంతమంది కాంగ్రెస్ నేతలు కావాలని ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకొని నానా రభస చేయడం దిక్కుమాలిన చర్య అని ఆయన దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో జూలై ఆగస్టు నెలలో చెరువుల్లో చేపల పిల్లలను వదిలే వారని కాంగ్రెస్ ప్రభుత్వం హయాం లో నవంబర్ వచ్చిన చేప పిల్లలను వదిలే దిక్కు లేదని ఆయన అన్నారు. నవంబర్లో చాప పిల్లలను చెరువులో వదిలితే అవి తిరగమని ఇది కూడా తెలియని అధికార పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్లు ఎమ్మెల్యే పై మాట్లాడటం సిగ్గుచేటని ఆయన అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం మాజీ సీఎం కేసీఆర్ చెరువులో చేప పిల్లలను వదిలితే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కేవలం 50 వేల చేప పిల్లలను వదలడం అన్యాయమని ఆయన దుయ్యబట్టారు. బుధవారం సాయంత్రం కాంగ్రెస్ నేత పత్తి కృష్ణారెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే పై అవాకులు చవాకులు పేలాడని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని విమర్శించే స్థాయి పత్తి కృష్ణారెడ్డికి లేదు అని ఆయన అన్నారు. ఇకపై కౌశిక్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బట్టలు ఊడదీసి కొడతామని నాలుక చీరేస్తా మని వారు హెచ్చరించారు. టిఆర్ఎస్ నేతలు మంద రాజేష్ వేల్పుల శ్రీకాంత్ ఎలకలపల్లి రాజేష్ మల్లికార్జున్ ఘనమైన నాగరాజు యాదవ్ నాగేశ్వర్ ప్రశాంత్ కొత్తగట్టు భాస్కర్ ఎండి సలీం రిత్విక్ నవీన్ మహేష్ ఓ ప్రకాష్ ప్రవీణ్ సంపత్ రంజిత్ తదితర నాయకులు ఉన్నారు

## ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

**జమ్మికుంట నవంబర్ 7(నినాదం న్యూస్):** హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఓపెన్ ప్లేస్ లో చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ప్రహరీ గోడ నిర్మాణానికి రూ8 లక్షల నిధులు మంజూరి చేయించిన తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రణబ్ బాబు మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వరరావు వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి లకు హౌసింగ్ బోర్డ్ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమానికి సహకరించిన కమిషనర్ ఎండి ఆయాజ్ ఏఈ నరేష్ కి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఆరో వార్డు ప్రజల పక్షాన ఆరవ వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేష్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సుంకరి రమేష్ సాయినీ రవి వార్డు ప్రజలు మల్లికార్జున్ సాంబశివరెడ్డి కొమురయ్య పాల్గొన్నారు.

# ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్ల ఆహ్వానం

- కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**జగిత్యాల, నవంబర్ 07 (నినాదం న్యూస్):** ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఓటు హక్కు వినియోగించుకోవడం పై 2024 సంవత్సరంలో ఓటర్లకు అవగాహన పెంపొందించి చైతన్య పరచడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి, భారత ఎన్నికల సంఘం మీడియా అవార్డులను ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా హౌస్ ల నుంచి 2024 సం.నకు ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డులు నాలుగు విభాగాల్లో ఉన్నాయని, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఆన్‌లైన్ సోషల్ మీడియాకు ఒక్కొక్కటి చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓటరు హక్కులపై అవగాహన పెంపొందించడం, ఎలక్షన్ టెక్నాలజీ అంశాలను ప్రచారం చేయడం వంటి అంశాల్లో ప్రాముఖ్యతను చూపిన మీడియా సంస్థలను గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అవార్డులను జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, 2025 జనవరి 25న అందజేయనున్నట్లు తెలిపారు. ప్రచార నాణ్యత, ఖచ్చితత్వం, ప్రజా పరిజ్ఞానం, ఓటర్లకు సరైన సమాచారాన్ని అందించడం, ప్రత్యేక కథనాలు, చర్చలు వంటి అంశాల ఆధారంగా ఈ అవార్డులను నిర్ణయిస్తారని, ప్రతి విభాగంలో పాల్గొనే సంస్థలు తమ ప్రచారం సారాంశం, ప్రచురణ లేదా ప్రసారం వార్త ఇతర సంబంధిత ప్రచార కార్యకలాపాలతో సహా నిజ ప్రతులను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 10,2024 లోగా తమ సిఫార్సును రాజేష్ కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోక రోడ్, న్యూ ఢిల్లీ...110001 చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. ఈమెయిల్‌లో media-division@eci.gov.in కు పంపవచ్చని, హిందీ లేదా ఇంగ్లీష్ కాకుండా ఇతర భాషలలో ఉన్నట్లైతే ఆంగ్ల అనువాదం కూడా జతపరచాలని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఈ సి సి ప్రకటించిన 2024 ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు గాను క్రింద చూపిన నిబంధనలు, షరతులు వర్తిస్తాయని తెలిపారు. ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఆన్‌లైన్/సోషల్ మీడియా విభాగాల్లో అవార్డులు అందిస్తారన్నారు. ప్రతి విభాగంలో ఉన్నత ప్రమాణాలు తీసుకున్న ప్రసార సమయం, సామర్థ్యం, ప్రజలపై చూపిన ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. ప్రింట్ మీడియా ప్రచురించిన వ్యాసాల సంఖ్య, ఆర్టికల్స్ ప్రచురించిన ప్రింట్ ఏరియా స్క్వేర్ సెంటిమీటర్లు, పాఠకులలో అవగాహన కల్పించేందుకు చేసిన కార్యక్రమాల సమాచారాన్ని పీడీఎఫ్ సాఫ్ట్ కాపీ/వెబ్ అడ్రస్ లింక్/ఫుల్ సైజ్ ఫోటో కాపీ/ న్యూస్ పేపర్ ప్రింట్ కాఫీ/ఆర్టికల్స్ సమర్పించాలని తెలిపారు.టెలివిజన్, రేడియో ఎంట్రీలకు ప్రసారమైన కార్యక్రమం వ్యవధి, ఫ్రీక్వెన్సీ, మొత్తం ప్రసార సమయం వివరాలను సి డి, డివిడి లేదా పెన్ డ్రైవ్ ద్వారా సమర్పించాలని తెలిపారు. ఆన్‌లైన్/సోషల్ మీడియా పోస్ట్‌లు, బ్లాగ్‌లు, ట్వీట్‌లు, లేదా ఇతర సోషల్ మీడియా ప్రచారాల సమీక్షను, మరియు వాటి ప్రభావం వివరాలతో పీడీఎఫ్ సాఫ్ట్ కాపీ/వెబ్ అడ్రస్ లింక్/ ఆన్ లైన్ యాక్టివిటీ వివరాలు సమర్పించాలని సూచించారు. 2024 సంవత్సరం లోనే ప్రసారం, ప్రచురణ లేదా ఆన్‌లైన్‌లో పోస్టు చేయబడాలని ,ఇతర భాషలలో సమర్పించినట్లైతే ఆంగ్ల అనువాదం తప్పనిసరి అని తెలిపారు. ప్రతి ఎంట్రీ కి సంస్థ పేరు, చిరునామా, టెలిఫోన్, ఫ్యాక్స్ నంబర్లు, ఈమెయిల్ ,తదితర పూర్తి వివరాలతో 10 డిసెంబర్ 2024 లోగా పంపాలని పేర్కొన్నారు. ప్రతి ఎంట్రీని ప్రచారం నాణ్యత, సరికొత్త ప్రచార పద్ధతులు, ప్రజలపై సాధించిన ప్రభావం వంటి అంశాల ఆధారంగా ఆమోదిస్తారని తెలిపారు.

## ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన టిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు

- గుండ్ల చెరువు అభివృద్ధిని మరిచిన నాయకులు
- రైతుల కన్నీటి గోస మీకు తాకుతుంది
- బిజెపి పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్



**జమ్మికుంట, నవంబర్ 6 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట-జగ్గయ్యపల్లె శివారులోని గుండ్ల చెరువు గత ఆరు నెలలుగా మత్తడి గండి పడి రైతులకు ఆబాది జమ్మికుంట- జగ్గయ్య పల్లె గ్రామప్రజలకి రాకపోకలు ఇబ్బంది అవుతున్నప్పటికీ పట్టించుకోని కాంగ్రెస్- టీఆర్ఎస్ పార్టీలు వారి ఆధ్వర్యంలో చెరువు దగ్గర గొడవ పడడం చాలా సిగ్గుచేటని బిజెపి జమ్మికుంట పట్టణ శాఖ అధ్యక్షులు జీడి మల్లేష్ అన్నారు. గురువారం ఆబాది జమ్మికుంట లోని గుండ్ల చెరువు వద్ద స్థానిక బిజెపి నేతలతో కలిసి ఆయన మాట్లాడారు, రైతుల పంట ఇంటికి వచ్చే సమయంలో కూడా మత్తడి గండిని పూడ్చి (మరమ్మతులు) చేయకపోవడం రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని వారు పండించిన పంటను వల్భాపూర్ జగ్గయ్య పల్లె గ్రామల మీదుగా జమ్మికుంట మార్కెట్ కు వస్తే ట్రాక్టర్ కిరాయి లు ఎక్కువ అవుతుందని రైతులు మున్సిపల్ చైర్మన్ కు కానీ, కాంగ్రెస్ నాయకులకు కానీ మొర పెట్టుకున్నప్పుడు కూడా చిన్న గండిని పూడ్చలేని దద్దమ్మ లని బిజెపి నాయకులు బిజెపి పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ లు ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడం హాస్యాస్పదంగా ఉందని వారు అన్నారు. ఇదిగో ఇస్తాం అదిగో తెస్తాం అంటూ కాంగ్రెస్ టిఆర్ఎస్ నేతలు మాట్లాడడమే తప్ప ప్రజలకు ఒరిగింది ఏమి లేదని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో జీడి మల్లేష్, ఆకుల రాజేందర్, ఠాగూర్ రాజేష్, కొమ్ము అశోక్, కైలాస కోటి గణేష్ , బచ్చు శివన్న, ఇటికాల స్వరూప, తూడి రవిచంద్ర రెడ్డి, బూరుగుపల్లి రాము, రాచపల్లి ప్రశాంత్ రామస్వామి, పోడేటి అనిల్, దార కృష్ణ, ఎర్ర వెంకటేష్,మధు పాల్గొన్నారు

## బీసీ హాస్టళ్ళకు నూతన భవనాలు నిర్మించండి

- అద్దె భవనాల్లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ప్రణవ్‌కి ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి



**జమ్మికుంట, నవంబర్ 6 (నినాదం న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గంలో బిసి బాలుర,బాలికల హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని ప్రభుత్వం మంత్రి దృష్టికి తీసుకెళ్లి నూతన భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ.. అఖిల భారత విద్యార్థి సమాఖ్య( ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో ఉన్న సంక్షేమ బిసి బాలుర బాలికల హాస్టల్స్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయని అలాగే హుజురాబాద్ నియోజకవర్గంలో గల వీణవంక గురుకుల సైదాపూర్ గురుకులాలు హుజురాబాద్ మండల కేంద్రంలో రైస్ మిల్లుల మధ్యలో ఉన్నాయని తెలిపారు. దీనివల్ల రైస్ మీల్లుల ద్వారా వచ్చే పోగా వలన చర్మ సమస్యలు శ్వాశకోశ సమస్యలు వస్తున్నాయని అలాగే బిసి బాలికల సంక్షేమ హాస్టళ్లు మెన్ రోడ్డు పక్కన ఉన్నాయని విద్యార్థులు పాఠశాల కు వెళ్లి వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హాస్టళ్లలో చదివే విద్యార్థులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కాబట్టి పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉంది కనుక ప్రభుత్వం దృష్టికి మంత్రి దృష్టికి తీసుకెళ్లి వేంటనే నూతన భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, మండల అధ్యక్షుడు దోమ్మాటి వేణుగోపాల్, మండల సహాయ కార్యదర్శి రాంపేల్లి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్వల పార్కుకు వెలిచాల పార్కుగా పేరు పెట్టాలి

- జగపతిరావు విగ్రహం ఏర్పాటుకు 20 గుంటల స్థలం కేటాయించాలి
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నేతల వినతి



**కరీంనగర్, నవంబర్ 7(నినాదం న్యూస్ ):** కరీంనగర్ ఉజ్వల పార్కుకు దివంగత నేత, తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు పేరు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి సరిల్లా రతన్ రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గండి రాజేశ్వరరావు పలువురు నాయకులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా కరీంనగర్ నగర పరిధిలో జగపతిరావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు 20 గుంటల స్థలాన్ని కేటాయించాలని కోరారు. జగపతిరావు రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేశారని, పేదల సంక్షేమం కోసం నిరంతరం పరితపించారని పేర్కొన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా లిమిట్స్‌లోని ఏ ప్రదేశంలోనైనా విగ్రహం ఏర్పాటు చేసేందుకు 20 గుంటల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా జగపతిరావు పనిచేసిన కాలంలో దిగువ మానేర్ డ్యామ్ పక్కన ఒక ఉజ్వల పార్కును ఏర్పాటు చేయించారని చెప్పారు. ఇది కరీంనగర్ కే ప్రస్తుతం తలమానికంగా నిలుస్తున్నదని తెలిపారు. ప్రజలకు పర్యటకంగా ఎంతో ఉపయోగపడుతుందని, ఉజ్వల పార్కుకు పేరు పెట్టాలని వినతి పత్రంలో కోరారు. జగపతిరావు 1972 నుంచి 1977 వరకు జగిత్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా, 1978 నుంచి 1984 వరకు ఎమ్మెల్సీగా,. 1989 నుండి 1994 వరకు కరీంనగర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పనిచేశారని తెలిపారు. జగపతిరావు కాంగ్రెస్ పార్టీ చాలా సీనియర్ నేత, డైనమిక్ లీడర్ అని పేర్కొన్నారు. ఆయన అభివృద్ధి చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించి కరీంనగర్ ప్రజలు ఆయనను ప్రజాబంధు అని పిలుస్తారనీ తెలిపారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో జగపతిరావు కరీంనగర్‌లో అడవుల శాతం తక్కువగా ఉన్నందున అతను చాలాసార్లు లోతైన ఆలోచన చేసి కరీంనగర్ ఉజ్వల పార్కు ఏర్పాటుకు శాయశక్తుల కృషి చేశారని తెలిపారు. జగపతిరావుకు మొక్కలు అన్న చెట్లన్న ఎంతో ప్రాణమని, ఆయన ఇంట్లో మొక్కలతో ఒక పెద్ద నందన వనమే ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రజల్లో మంచి పేరును జగపతిరావు పేరును కరీంనగర్ ఉజ్వల పార్కు పెట్టాలని మంత్రిని కాంగ్రెస్ నాయకులు కోరారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు : మహమ్మద్ జానీ



**జమ్మికుంట, నవంబర్ 6 (నినాదం న్యూస్) :** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని జమ్మికుంట మైనార్టీ సెల్ నాయకులు మహమ్మద్ జానీ అన్నారు. గురు వారం జమ్మికుంట పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ జాని మాట్లాడుతూ నిన్న ఆబాది జమ్మికుంటలో జరిగిన చాప పిల్లల కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని విలేకరులతో మాట్లాడుతుండగా కొంతమంది కాంగ్రెస్ గుండాలు హేయమైన చర్యలు చేశారని అన్నారు గత ప్రభుత్వం హుజురాబాద్ నియోజకవర్గం కి లక్షలాది చాప పిల్లలు పంపిణీ చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హుజురాబాద్ నియోజకవర్గం లో వేళల్లో చేప పిల్లల పంపిణీ చేస్తున్నారని ఎమ్మెల్యే మాట్లాడుతుండగా కావాలని కొంతమంది కాంగ్రెస్ నేతలు బుధవారం ఎమ్మెల్యే పై అవాకులు చవాకులు మాట్లాడడం సిగ్గుచేటని ఆయన అన్నారు. గత ప్రభుత్వం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను కళ్యాణం జరిగిన నెల రెండు నెలలు లోపు ఇచ్చేవారని కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడిచిన ఇప్పటివరకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఇవ్వలేదని అన్నారు జమ్మికుంట పట్టణంలో బుధవారం కొంతమంది విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అనవసరమైన మాటలు మాట్లాడారని ఎమ్మెల్యే పై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- డ్రగ్స్, మాదకద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహన
- విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి
- ఎక్సైజ్ సీఐ మాధవి లత



**జమ్మికుంట, నవంబర్ 6 (నినాదం న్యూస్) :** విద్యార్థులు డ్రగ్స్ కు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తు కొరకు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జమ్మికుంట పట్టణ ఎక్సైజ్ ఎస్సై సౌమ్య తెలిపారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని స్రవంతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సౌమ్య మాట్లాడుతూ, ఉజ్వలమైన భవిష్యత్తు కొరకు ఇప్పుడు కష్టపడి చదివితే తర్వాత ప్రశాంతమైన జీవితాన్ని పొందవచ్చునని ఆమె విద్యార్థులకు సూచించారు. దాదాపు ఇక్కడున్న విద్యార్థులు అందరూ కూడా రైతు కుటుంబం నుండి వచ్చిన వారే ఎక్కువగా ఉన్నారని మీరు మీ తల్లిదండ్రులు పడే కష్టాన్ని చూసి ఉంటారని వారి కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని కళాశాలకు వచ్చి లెక్చరర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని జీవితంలో మంచి స్థానంలో నిలబడడానికి ప్రయత్నం చేయాలని ఆమె తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం డ్రగ్స్ గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఒకసారి అలవాటు పడితే మీ జీవితాలు సర్వనాశనం అవుతాయని ఆమె తెలిపారు. మీ జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానికోసం అహర్నిశలు కష్టపడి చదువుకొని మీ భవిష్యత్తును బంగారం చేసుకోవాలని ఆమె తెలిపారు. చెడు అలవాట్లకు అలవాటు పడితే మీ కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని ఆమె తెలిపారు. నేటి యువత సిగరెట్లు పాన్ మసాలాలు తినడానికి బాగా అలవాటు పడుతున్నారని అవి ఆరోగ్యానికి మంచిది కాదని మీ తల్లిదండ్రులు పడే కష్టాన్ని చూసి మీరు బుద్ధిగా చదువుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా మనతో పాటు చదువుతున్న ఆడపిల్లలను మనం గౌరవించాలని వారితో మర్యాదగా ప్రవర్తించాలని ఆమె సూచించారు. అనవసరమైన అలవాట్లు చేసుకుంటే జీవితం సర్వనాశనం అవ్వడమే కాకుండా మీ కుటుంబాలు కూడా మిమ్మల్ని చీదరించు కునే పరిస్థితి వస్తుందని అలాంటి పరిస్థితి రాకుండా ముందుగానే అందరు జాగ్రత్తగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సౌమ్య జిల్లా చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ అధికారి తో పాటు కళాశాల సిబ్బంది కొండ విజయ్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలి : మోటి వేషనల్ స్పీకర్ పగిడోజు వెంకటరమణ




**సూర్యాపేట ప్రతినిధి నవంబర్ 7 (నినాదం న్యూస్) :** విద్యార్థి దశ నుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకొని ప్రణాళికతో చదువుతూ ముందుకు సాగాలని టిటిటి డబ్ల్యూఎస్ నీలగిరి 171 బ్యాచ్ మోటివేషనల్ స్పీకర్ పగిడోజు వెంకటరమణ అన్నారు. గురువారం నూతన కల్ మండలం వెంకెపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సులభ పద్ధతిలో గుర్తుండే విధంగా మేలు కువలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమిస్తే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెల్సన్, ఉపాధ్యాయుడు శ్రీశైలం ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# పోషకాల గనిగా ఉసిరికాయలు



చలికాలం మొదలవగానే మనకు ఉసిరికాయలు విరివిగా లభిస్తుంటాయి. ఉసిరికాయలను పోషకాలకు గనిగా చెబుతారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానంలో ఉసిరిని ఎన్నో వేల ఏళ్ల నుంచి ఉపయోగిస్తున్నారు. దీన్ని అనేక ఔషధాల తయారీలో వాడుతుంటారు. ఉసిరి కాయల్లో అనేక విటమిన్లు, మినరల్స్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనకు అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. రోజూ ఒక ఉసిరికాయను ఈ సీజన్‌లో తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

### గుండెకు రక్షణ...

ఉసిరికాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని, వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె సంబంధ వ్యాధులు రావు. అలాగే క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. ఉసిరికాయలను తినడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ సైతం తగ్గుతుంది. బీపీ నియంత్రణలోకి వస్తుంది. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఉసిరికాయలను తినడం వల్ల శిరోజాలు సైతం ఆరోగ్యంగా ఉంటాయి. ఉసిరికాయలతో జుట్టు దృఢంగా మారుతుంది. చుండ్రు తగ్గుతుంది. జుట్టు తెల్లబడకుండా నిరోధించవచ్చు. ఉసిరికాయలను తింటే జుట్టు పెరుగుదలకు అవసరం అయ్యే పోషకాలు లభిస్తాయి. దీంతో జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరిగి కాంతివంతంగా మారుతాయి.




**రోగ నిరోధక శక్తికి..** ఉసిరికాయను విటమిన్ సి కి నెలవుగా చెప్పవచ్చు. విటమిన్ సి ఈ కాయల్లో సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేయడంల ఎంతగానో సహాయం చేస్తుంది. ఉసిరికాయలను తినడం వల్ల ఇన్‌పెక్షన్ల నుంచి బయట పడవచ్చు. రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. దీంతో ఈ సీజన్‌లో వచ్చే దగ్గు, జలుబు, ఫ్లూ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉసిరికాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ఈ కాయల్లో ఉండే విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ మాదిరిగా పనిచేస్తుంది. దీని వల్ల ఫ్రీ ర్యాడికల్స్ నాశనం అవుతాయి. కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచుతుంది. ఉసిరికాయలను తరచూ తినడం వల్ల వృద్ధాప్య ఛాయలు రావు. ముఖం మీది ముడతలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. చర్మంలో సహజసిద్ధమైన కాంతి పెరుగుతుంది.

**జీర్ణ సమస్యలకు..** జీర్ణ సమస్యలను తగ్గించడంలోనూ ఉసిరికాయలు అద్భుతంగా పనిచేస్తాయి. ఉసిరికాయల్లో డైటరీ ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది విరేచనం సాఫీగా అయ్యేలా చేస్తుంది. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. ఉసిరికాయలను తింటే జీర్ణాశయంలో ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మనం తిన్న ఆహారాలను సులభంగా జీర్ణం చేస్తాయి. ఉసిరికాయలను తినడం వల్ల మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా కొవ్వు కరుగుతుంది. దీంతో బరువును నియంత్రించడం తేలికవుతుంది. ఉసిరికాయల్లో ఉండే ఫైబర్ ఆకలిని నియంత్రిస్తుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయలేదు. ఫలితంగా ఆహారం తక్కువగా తింటారు. దీంతో అధిక బరువు తగ్గడం సులభతరం అవుతుంది. ఉసిరికాయలను తినడం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఎంతగానో మేలు జరుగుతుంది.



**డయాబెటిస్ ఉన్నవారికి..** డయాబెటిస్ ఉన్నవారికి కూడా ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. ఇది బ్లడ్ షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తుంది. ఉసిరికాయల్లో క్రోమియం అనే మూలకం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల శరీరం ఇన్సులిన్‌ను ఎక్కువగా ఉపయోగించుకుటుంది. దీంతో షుగర్ కంట్రోల్ అవుతుంది. ఉసిరికాయలను రోజూ ఒకటి చొప్పున తింటుంటే మధుమేహుల్లో షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయి. డయాబెటిస్ అదుపులోకి వస్తుంది. ఇలా ఉసిరికాయలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొంద వచ్చు. కనుక వీటిని ఈ సీజన్‌లో మరిచిపోకుండా రోజుకు ఒకటి చొప్పున తినండి.



## అవని

# అధిక రక్తపోటు ముప్పు..!



ఆధునిక జీవనశైలి కారణంగా పెద్దసంఖ్యలో ప్రజలు రక్తపోటు బారినపడుతున్నారు. హైబీపీ నియంత్ర ణలో లేకుంటే అది ఇతర అనారోగ్యాలకూ దారితీస్తుంది. బీపీ అదుపులో లేకుంటే హృద్రోగ ముప్పు వెంటాడుతుంది. బీపీని ఎప్పటికప్పుడు నియంత్రించుకోవడం అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే మనకు తెలియకుండానే మన అలవాట్లు బీపీని పెంచుతుంటాయి. శారీరక వ్యాయామం చేయనివారు, చురుకైన జీవనశశైలి అనుసరించని వారిలో అధిక రక్తపోటుతో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. శారీరక వ్యాయామం లోపిస్తే అధిక బరువు పెరగడం, ఊబకాయం ఫలితంగా హైబీపీ వేధిస్తుంది. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు అరగంట సమయం వ్యాయామానికి వెచ్చిస్తే ఆరోగ్యంగా ఉండటమే కాకుండా బరువు పెరగకుండా చూసుకోవచ్చు. వాకింగ్ లేదా ఇంట్లోనే తేలికపాటి వ్యాయామాలతో చురుకుగా ఉండవచ్చు. ఇక స్మోకింగ్, పొగాకు నమలడం, మద్యపానం బీపీని పెంచడమే కాకుండా క్యాన్సర్ ముప్పునూ ముందుకుతెస్తుంది. ఇక ఒత్తిడి బీపీని పెంచి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఎంతటి మనిషినైనా చిత్తు చేసే ఒత్తిడిని నివారించేందుకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్ అనుసరించాలి. వీటితో పాటు కెఫీన్‌ను అధికంగా తీసుకోవడం, ఉప్పును మోతాదు మించి వాడటం హైబీపీకి కారణమవుతుంది.

# మసాలా ఫుడ్స్‌లో నిమ్మరసం పిండుకుంటున్నారా..



నిమ్మకాయలో ఎన్నో ఔషధ గుణాలుంటాయి. ఒంట్లో వేడిని తగ్గించడానికి, డీహైడ్రేషన్‌కు గురైన బాడీని వెంటనే హైడ్రేట్ చేయడానికి నిమ్మరసాన్ని వినియోగిస్తుంటారు. పరగడుపునే నిమ్మరసంతో షర్బత్ చేసుకుని తాగితే కడుపులోని మలినాలు సులువుగా బయటికి పోతాయంటారు. అదేవిధంగా కొన్ని రకాల ఆహార పదార్థాలకు కూడా నిమ్మ పులుపు తోడైతే ఆ ఆహారానికి కమ్మదనం వస్తుంది. కానీ ఈ నిమ్మరసం కొన్ని రకాల ఆహార పదార్థాలతో కలిస్తే విషపూరితం అయ్యే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మరి నిమ్మరసంతో కలపకూడని ఆ పదార్థాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. పాలు, పాల సంబంధ ఉత్పత్తులతో నిమ్మరసాన్ని కలుపగూడదు. ఏ రకమైన పాల ఉత్పత్తులతో కూడా నిమ్మకాయను కలిపి తీసుకోకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు. పాలు, నిమ్మరసం ఒకేసారి తాగడం ఆరోగ్యానికి హానికరమని, దాంతో గుండెల్లో మంటగా అనిపించడం, వాంతులు అవడం లాంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు. అదేవిధంగా మసాలా వంటకాల్లో కూడా నిమ్మరసాన్ని ఉపయోగించడం మానుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. బిర్యానీలు, ఇతర మసాలా ఆహారాల్లో ఘాటును భరించడం కోసం, పుల్లని రుచి కోసం చాలా మంది నిమ్మరసాన్ని పిండుకుంటారు. కానీ దానివల్ల ఎసిడిటీ బారినపడే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు. ఎందుకంటే నిమ్మకాయలో సిట్రిక్ యాసిడ్ ఉండటమేగాక ఆ నిమ్మకాయ పిండుకోవడం వల్ల మసాలా ఘాటు తగ్గుతుంది. దాంతో అతిగా మసాలాను తీసుకుం టాం. ఇది ఎసిడిటీకి కారణమవుతుంది. రెడ్ వైన్ తీసుకునేటప్పుడు కూడా నిమ్మకాయను ఏ రూపంలోనూ తీసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. నిమ్మ రసం వైన్ రుచిని, వాసనను చెడగొట్టడమేగాక ఆరోగ్యానికి హాని చేస్తుంది. పెరుగు, చల్ల లాంటి పాల ఉత్పత్తులతో కూడా నిమ్మరసం తీసుకోవడం మంచిది కాదు. ఆయుర్వేదం ప్రకారం పాల ఉత్పత్తులతో నిమ్మరసం జోడించడం ఆరోగ్యానికి హానికరం. నిమ్మరసం శరీరంలో ఎసిడిటీని కలిగిస్తుంది.

## మార్కెట్

### దాతృత్వంలో ఫస్ట్ హెచ్ సీఎల్ టెక్ ఫౌండర్ శివ్ నాడార్..



దాతృత్వం అనేది ఒక వరం. ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్న మేరకు విరాళాలు ఇస్తూనే ఉంటారు. ఇక వ్యాపార వేత్తలు, సెలబ్రిటీలు, పారిశ్రామికవేత్తల్లో కూడా దాతలు ఉంటారు. అలా దాతృత్వంలో మొదటి వరుసలో నిలుస్తారు ప్రముఖ టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఫౌండర్ శివ్ నాడార్ (79). గత ఐదేండ్లలో దేశంలోనే వరుసగా మూడోసారి అత్యంత ఉదారంగా విరాళాలిస్తున్న దాతల్లో శివ్ నాడార్ మొదటి స్థానంలో నిలుస్తారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,153 కోట్ల విరాళాలు ఇచ్చారు. అంటే ప్రతి రోజూ రూ.5.9 కోట్లు విరాళం ఇస్తూ వచ్చారని ఎడిల్ గివ్ హరున్ ఇండియా ఫిలాంథ్రఫీ లిస్ట్ –2024 పేర్కొంది. శివ్ నాడార్ ఫౌండేషన్ ద్వారా ఈ విరాళాలు అందజేశారు. ఇక మహిళల్లో ఇన్ఫోసిస్ కో ఫౌండర్ నందన్ నిలేకని సతీమణి రోహిణి నిలేకనీ మొదటి స్థానంలో నిలుస్తారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.154 కోట్ల విరాళాలు అందజేశారు. రోహిణి నిలేకని ఫిలాంత్రఫీస్ అనే ఫౌండేషన్ ద్వారా మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తున్న సంస్థలకు, పర్యావరణ సుస్థిరత కోసం విరాళాలు అందజేస్తుంటారు. దాతల్లో పిన్న వయస్కుడు జెరోధా కో ఫౌండర్ నిఖిల్ కామత్ (38) మొదటి స్థానంలో ఉంటారు. మానసిక ఆరోగ్యం, ఆర్థిక అక్షరాస్యత, విద్యా రంగం కోసం విరాళాలు ఇస్తారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎడిల్ గివ్ హురున్ ఇండియా ఫిలాంథ్రపీ లిస్ట్ –2024లో 203 మంది దాతలు రూ.8,783 కోట్ల విరాళాలు ఇచ్చారు. రెండేండ్ల క్రితంతో పోలిస్తే 55 శాతం విరాళాలు పెరిగాయి. 18 మంది దాతలు రూ100 కోట్ల పై చిలుకు విరాళాలు ఇచ్చారు. 30 మంది దాతలు రూ.50 కోట్ల పై చిలుకు (2019 నుంచి 125 శాతం వృద్ధి), 61 మంది దాతలు రూ.20 కోట్ల పై చిలుకు (ఐదేండ్ల క్రితంతో పోలిస్తే 128 శాతం వృద్ధి) విరాళాలు అందజేశారు.

# రూ.80 వేల దిగువన బంగారం

## ఒక్కరోజే రూ.2,900 తగ్గిన వెండి..!



అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవ్వడంతో బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. మూడు రోజుల్లో రూ.3750 పతనమై రూ.79,500 మార్కుకు చేరుకున్నది. కిలో వెండి ధర రూ.6,950 వద్ద స్థిర పడింది. గురువారం దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారట్ల బంగారం తులం ధర రూ.1,650 పతనమై రూ.79,500 వద్దకు చేరుకుని రూ.80వేల దిగువకు పడిపోయింది. బుధవారం తులం బంగారం ధర (24 క్యారట్స్) రూ.81,150 వద్ద కొనసాగింది. మరోవైపు కిలో వెండి ధర రూ. 2,900 పతనమై రూ.93,800 వద్ద నిలిచింది. బుధవారం కిలో వెండి ధర రూ.96,700 వద్ద స్థిర పడింది. గురువారం 99.5 స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1650 క్షీణించి రూ.79,100 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్లలోనూ సెంటిమెంట్ బలహీనంగా ఉండటంతో బంగారం ధర పడిపోయింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో తులం బంగారం డిసెంబర్ డెలివరీ గోల్డ్ కాంట్రాక్ట్స్ ధర ఫ్లాట్ గా రూ.76,655 వద్ద కొనసాగుతున్నది. కిలో వెండి డిసెంబర్ డెలివరీ సిల్వర్ కాంట్రాక్ట్స్ ధర రూ.90,811 వద్ద ముగిసింది. కీలక వడ్డీరేట్ల తగ్గింపు విషయమై గురువారం రాత్రి వెలువడనున్న యూఎస్ ఫెడ్ రిజర్వు నిర్ణయం కోసం ఇన్వెస్టర్లు ఎదురు చూస్తున్నారు. కామెక్స్ గోల్డ్ లో ఔన్స్ బంగారం ధర 1.90 డాలర్లు తగ్గి 2674 డాలర్లు పలికింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక నేపథ్యంలోనే బంగారం ధర తగ్గుతుందని భావిస్తున్నారు. ఔన్స్ వెండి ధర 0.24 శాతం తగ్గి 31.26 డాలర్లకు పడిపోయింది. జూలై తర్వాత తొలిసారి అమెరికా డాలర్ విలువ పెరిగింది.

# అందరి దృష్టి యూఎస్ ఫెడ్ పైనే..

## రెండు రోజుల లాభాలకు బ్రేక్..!



అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలతో రెండు రోజుల పాటు లాభాలు గడించిన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. వడ్డీరేట్ల తగ్గింపుపై యూఎస్ ఫెడ్ రిజర్వు తీసుకునే నిర్ణయం మీద అందరూ దృష్టిని కేంద్రీకరించడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఫలితంగా బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 836.34 పాయింట్ల పతనంతో 79,541.79 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్ లో ఒకానొక దశలో 958.79 పాయింట్ల మేర నష్టపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 284.70 పాయింట్లు నష్టపోయి 24,199.35 పాయింట్ల వద్ద స్థిర పడింది. బీఎస్ఈ–30 ఇండెక్స్‌లో టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ భారీగా నష్టపోగా, ఎస్బీఐ మాత్రమే లాభాలతో ముగిసింది. బుధవారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,445.59 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. ఇక బీఎస్ఈ మిడ్ క్యాప్ –100 ఇండెక్స్ 0.67, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.44 శాతం నష్టపోయాయి. బీఎస్ఈ మెటల్ 2.54 శాతం, యుటిలిటీస్ 1.82 శాతం, కమోడిటీస్ 1.40 శాతం, రియాల్టీ 1.45 శాతం, పవర్ 1.42 శాతం, ఆటో 1.40 శాతం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈలో 2,134 స్టాట్స్ నష్టాలతో, 1821 స్టాక్స్ లాభాలతో స్థిరపడగా, 98 స్టాక్స్ యధాతథంగా కొనసాగాయి. గ్లోబల్ బెంచ్ మార్క్ క్రూడాయిల్ 0.33 శాతం తగ్గి 74.67 డాలర్లు పలికింది.

### అనిల్ అంబానీ పవర్ సంస్థలకు షాక్..

#### సోలార్ ఎలక్ట్రిసిటీ బోర్డు మూడేండ్ల బ్యాన్..



అనిల్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ పవర్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు భారతీయ సౌర ఇంధన సంస్థ (ఎస్ఈసీఐ) గట్టి షాక్ ఇచ్చింది. వచ్చే మూడేండ్లు సోలార్ విద్యుత్ తయారీకి బిడ్లు దాఖలు చేయకుండా రిలయన్స్ పవర్, దాని అనుబంధ సంస్థలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇంతకు ముందు సౌర విద్యుత్ తయారీ ప్రాజెక్టులకు ఫేక్ బ్యాంక్ గ్యారంటీలు సమర్పించినట్లు ఎస్ఈసీఐ తనిఖీల్లో తేలింది. ఎస్ఈసీఐ గత జూన్ లో ఒక గిగావాట్ సౌర విద్యుత్, 2 గిగావాట్ల స్టాండలోన్ బ్యాటరీ ఎనర్జీ సోలార్ సిస్టమ్ కోసం బిడ్లు ఆహ్వానించింది. ఈ బిడ్డింగ్ లో రిలయన్స్ పవర్ అనుబంధ మహారాష్ట్ర ఎనర్జీ జనరేషన్ అలియాస్ రిలయన్స్ ఎన్ యూ బీఈఎస్ఎస్ సంస్థ పాల్గొంది. చివరి రౌండ్ బిడ్డింగ్ లో నకిలీ బ్యాంకు గ్యారంటీలు సమర్పించిందని తమ తనిఖీల్లో తేలిందని ఎస్ఈసీఐ తెలిపింది. దీంతో బిడ్డింగ్ ప్రక్రియ నిలిపివేసి వెంటనే సంస్థపై చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఇంతకు ముందు అనిల్ అంబానీపై ఐదేండ్ల పాటు సెక్యూరిటీ మార్కెట్ల నుంచి ఐదేండ్ల నిషేధం విధిస్తూ సెబీ ఆదేశాలు జారీ చేసింది.

### రెండో రోజూ స్విగ్గీ ఐపీఓలో అంతంతే సబ్ స్క్రిప్షన్లు..

ఫుడ్ డెలివరీ అండ్ క్విక్ కామర్స్ మేజర్ 'స్విగ్గీ' ఐపీఓకు గురువారం రెండో రోజు కూడా 35 శాతం షేర్లకే సబ్ స్క్రిప్షన్లు వచ్చాయి. ఎన్ఎస్ఈ వెల్లడించిన డేటా ప్రకారం 16,09,703 షేర్లకు 5,56,98,652 షేర్లకు మాత్రమే బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు 84 శాతం బిడ్లు దాఖలు చేస్తే క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 28 శాతం బిడ్లు ఫైల్ చేశారు. ఇక నాన్ ఇన్ స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 14 శాతం సబ్ స్క్రిప్షన్లు చేశారు. మరోవైపు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.5,085 కోట్ల నిధులు సేకరించినట్లు మంగళవారం స్విగ్గీ వెల్లడించింది. బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న స్విగ్గీ ఐపీఓలో షేర్ విలువ రూ.371–390గా ప్రతిపాదించింది. ఐపీఓ ద్వారా రూ.11,327 కోట్ల నిధులు సేకరించాలని తలపెట్టింది. అందులో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.6,828 కోట్లు, తాజాగా షేర్ల జారీ ద్వారా రూ.4,499 కోట్ల నిధులు సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, జేపీ మోర్గాన్ ఇండియా, సిటీ గ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, బీఓఎఫ్ఏ సెక్యూరిటీస్ ఇండియా, జెఫరీస్ ఇండియా, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ అవెండస్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు. .స్విగ్గీ ఐపీఓ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.



## రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు ఖేలో ఇండియా క్రీడాకారులు ఎంపిక

### -జిల్లా కోచ్ గెల్లు మధుకర్ యాదవ్



**సుల్తానాబాద్, నవంబర్ 07 (నినాదం న్యూస్):** రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు ఖే లో ఇండియా క్రీడా కారులు అజయ్, మహాలక్ష్మి ఎంపిక య్యారని ఖే లో ఇండియా కోచ్ గెల్లు మధుకర్ యాదవ్ తెలిపా రు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫె డరేషన్ అధ్వర్యంలో మండల కేంద్రంలోని సెంట్ మేరీ పాఠశాలలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖోఖో టోర్నమెంట్ లో పెద్దపల్లి జిల్లా జట్టు తరపు న సుల్తానాబాద్ ఖోఖో కేలో ఇండియా కేంద్రంలో మధుకర్ యాదవ్ కోచింగ్ లో శిక్షణ పొందుతున్న ఖోఖో క్రీడాకారులు అజయ్, మహాలక్ష్మి ప్రతిభని చాటి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఎం పికైన క్రీడాకారులు అజయ్,మహాలక్ష్మిలను జిల్లా క్రీడా అధికారి సురేష్ ,సోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ము స్త్యాల రవీందర్, సాయిరి మహేందర్, పిఈటిలు దాసరి రమేష్, ప్రసాద్,ఎండీ ఇక్బాల్, ఎండీ అ జ్జు, తల్లిదండ్రులు, పలువురు అభినందనలు తెలియజేశారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రోహిత్ వర్మ

### -అభినందించిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్, చైర్మన్ యాదగిరి గౌడ్



**గోదావరిఖని నవంబర్ 07 (నినాదం న్యూస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈ నెల 4న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ లో ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనిలోని విశ్వభారతి స్కూల్ కు చెందిన 8వ తరగతి విద్యార్థి జి.రోహిత్ వర్మ 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 15 నుండి 17వ తేదీ వరకు ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పాఠశాల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్ అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి రాంచీ (జార?ండ్) లో జరిగే జాతీయస్థాయి పోటీల అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తిరుపతి, ప్రిన్సిపాల్ ప్రవీణ్, పీఈటీ భాస్కర్ అభినందనలు తెలిపారు.

## నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

### -అదనపు కలెక్టర్ వేణు

**పెద్దపల్లి ప్రతినిధి , నవంబర్07( నినాదం న్యూస్):** జిల్లాలో ఖరీఫ్ 2023-24, యాసంగి 2023-24 సీజన్ కు సంబంధించి పెండింగ్ సీఎంఆర్ డెలివరీని నవంబర్ 30లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణు ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లో గురువారం అదనపు కలెక్టర్ వేణు అధికారులతో పెండింగ్ లో ఉన్న సి.ఎం.ఆర్. పై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణు మాట్లాడుతూ సి.ఎం.ఆర్. బాకీ ఉన్న రైస్ మిల్లర్లు సకాలంలో మిల్లింగ్ చేసి అప్పగించకపోతే చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలోని పౌరసరఫరాల శాఖ అధికారులు, డిప్యూటీ తహసిల్దారులు, ప్రతిరోజు సీఎంఆర్ డెలివరీని పర్యవేక్షించాలన్నారు. రేషన్ షాపులను రెగ్యులర్ గా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సెమినార్‌లో పాల్గొన్న జిల్లా నాయకులు




**బెల్లంపల్లి నవంబర్ 7 (నినాదం న్యూస్):** హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం నుండి జరుగుతున్న జాతీయ సెమినార్ లో మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,మతోన్మాద కార్పొరేట్ శక్తుల ప్రమాదం,వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం అనే అంశంపై జాతీయ సెమినార్ కు మంచిర్యాల జిల్లా నలుమూలల నుండి తమ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలతో హాజరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మహిళా కార్యదర్శి దుర్గం లక్ష్మి,బర్ల స్రవంతి,కాంపల్లి రాధ,మినుగు పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతుల అభ్యున్నతి కోసమే సిసిఐ ద్వారా కొనుగోలు

### -బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి నవంబర్ 7 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృ త్వంలో ప్రభుత్వం సిసిఐ ద్వారా పత్తి రైతులకు మద్దతు ధరతో పత్తి కొను గోలు చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. తాండూరు మండలం రేపల్లె వాడలోని శ్రీరామ జిన్నింగ్ మిల్లులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా నిర్వహించే పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం ఇద్దరు యువ పత్తి రైతులు ప్రసాద్,రాము లను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించారు. రైతులకు క్వింటాల్ కు 7వేల521మద్దతు ధర ఉంటుందని ఆయన తెలిపారు. రైతులు పత్తి కొనుగోలు కేంద్రానికి తేమ తక్కువగా ఉండి,చెత్త లేని నాణ్యత గల పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ముఖ్యంగా రైతులు దళారులకు పత్తిని విక్రయించి మోసపోవద్దని సూచించారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పటిష్ట చర్యలు తీసుకున్నారని తెలిపారు. అంతేకాకుండా ఏక కాలంలో రైతులకు 2లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అదే విధంగా అటు వడ్లు,ఇటు పత్తి కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన తమను నేరుగా సంప్రదించాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా పట్టణంలోని రడగంబాల బస్తీలో ఆలయ ధ్వజస్థంభం ప్రతిష్టాపన పూజా కార్యక్రమానికి ఎంపి గడ్డం వంశీకృష్ణ తో కలిసి హాజర య్యారు. జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దిన్,సంబంధిత అధికారులు, జిన్నింగ్ మిల్లు యాజమాన్యం,సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# రెడ్డి గాండ్ల కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు





**జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 07 నినాదం న్యూస్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం బి ఎల్ ఎం గార్డెన్ లో జరిగిన రెడ్డి గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రెడ్డి గాండ్ల కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా చైర్మన్ గా అయిత ప్రకాష్ రెడ్డిని నియమించడం జరిగిందని, పార్టీ కోసం కష్టపడ్డవారిని గుర్తించడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్ట పడి పని చేసిన వారికే పదవులు వస్తాయని రాష్ట్ర ఐటీ పరిశ్ర మల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంథని నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలకోసం త్వరలోనే పరిష్కారం ఉంటుందని, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు త్వరలోనే పూర్తి చేసి, ఈ ప్రాంత ప్రజలకు సాగు, త్రాగు నీరు అందించ డం జరుగుతుందని పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదువు కొని నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పన చేస్తామ ని హామీ ఇచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్య క్షులు గద్దె సమ్మి రెడ్డి, తెప్పల దేవేందర్ రెడ్డి, చల్ల జక్కి రెడ్డి, సింగల్విండో చైర్మన్లు చల్ల తిరుపతయ్య, తోటపల్లి ప్రశాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, రెడ్డి గార్ల కుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

# క్వింటాల్ సన్నవడ్లకు 500 బోనస్ చెల్లిస్తాం

- బోనస్ పై ప్రతిపక్ష నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సతీమణి మానాలి ఠాకూర్



**గోదావరిఖని నవంబర్ 07 (నినాదం న్యూస్):** పాలకుర్తి మండలంలో బసంత్ నగర్ ఎయిర్ పోర్ట్ లో, రామారావు పల్లి ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతు రామగుండం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా రాజ్ ఠాకూర్ ని గెలిచినప్పటి నుంచి వడ్ల కొనుగోలులో గింజ కట్టింగ్ లేకుండా చూసామన్నారు.. దాన్య కొనుగోలు కేంద్రాల్లో గాని, మిల్లుల్లో గాని ధాన్యంలో కోత విధిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అలాగే కేంద్రాల్లో 41 కిలోలు మాత్రమే ధాన్యాన్ని తూకం వేయాలని అధికంగా తూకం వేసినా కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో క్వింటాలుకు పది, పన్నెండు కిలోల వరకు వడ్లు కటింగ్ చేశారన్నారు. కానీ కాంగ్రెస్ హయాంలో కటింగ్ మాటే ఉండదని స్పష్టం చేశారు. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాక వారికి వెంటనే రశీదులు ఇవ్వాలని, ఈ ప్రక్రియలో మిల్లర్లకు రైతులకు ఎలాంటి సంబంధం లేకుండా చూడాలని అధికారులు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సంబంధిత అధికారులు, రైతులు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎస్ పాఠశాలలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు



**సుల్తానాబాద్,నవంబర్ 07 (నినాదం న్యూస్):** సుల్తానాబాద్ మండల కేంద్రంలో గురువారం ల యన్స్ క్లబ్,ఐపీఎస్ పాఠశాల యాజమాన్యం ఆ ధ్వర్యం లో క్యాన్సర్ పై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్ర భుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, డాక్టర్ రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రమాదేవి, జిల్లా కో-ఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, ఐపీఎస్ పా ఠశాల ప్రిన్సిపల్ కృష్ణప్రియ లు మాట్లాడుతూ, నే టి సమాజంలో క్యాన్సర్ మహమ్మారి పెనుభూతం గా తయారైందని,ముఖ్యంగా ఆడవారిలో రొమ్ము క్యాన్సర్, ఎండోమెట్రియల్ క్యాన్సర్, ఓవేరియన్ క్యాన్సర్ లాంటివి వ్యాపించకుండా తగు జాగ్రత్త లు తీసుకోవాలి అని కోరారు. క్యాన్సర్ లక్షణాలు వచ్చిన వెంటనే డాక్టర్ ను సంప్రదించి, తొలి దశ లోనే నివారణకు మందులతో అరికట్టవచ్చునని అన్నారు. అదేవిధంగా ధూమపానం, పాన్ మసా లా వంటి వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. సాధ్యమైనంతవరకు స్వచ్ఛమైన కూరగయలు, ఆకుకూరల ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సాంబమూర్తి, చకిలం వెంకటేశ్వర్లు, నోముల వేణుగోపాల్, విద్యార్థినీ విద్యార్థులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్వర్టు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- నగర మేయర్ బంగి అనిల్ కుమార్
- వికలాంగులకు బ్యాటరీ సైకిల్లని త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా అందిస్తాం



**గోదావరిఖని నవంబర్ 07 (నినాదం న్యూస్):** కల్వర్ట్ నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్. రామగుండం నగర పాలక సంస్థ 30 వ డివిజన్ మల్లిఖార్జున నగర్ లో నిర్మాణంలో ఉన్న కల్వర్ట్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల సౌకర్యార్థం పట్టణ ప్రగతి నిధులతో రూ 12.00 లక్షల వ్యయంతో ఈ కల్వర్ట్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కల్వర్ట్ నిర్మాణం పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు ఉపయోగంలోకి తీసుకువస్తామని అన్నారు. ఆనంతరం జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో సింగరేణి ఆర్ జి వన్ కమ్యూనిటి హాల్ లో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీకి అర్హులను ఎంపిక చేయడానికి నిర్వహిస్తున్నశిబిరాన్ని మేయర్ సందర్శించారు. అర్హులైన శారీరక వికలాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లను త్వరలో శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో అర్హులైన వారందరికీ పరిమితి లేకుండా ఉపకరణాలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. అర్హులైన వారు సంక్షేమ శాఖకు వెంటనే ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి వేణు గోపాల్ రావు, వికలాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కొట్టె రాజయ్య , ఐ సి డి ఎస్ సి డి పి ఓ అలేఖ్య , వికలాంగుల సమాఖ్య ప్రతినిధులు సంతోష , వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేటర్లకు వాస్తవ వివరాలను చెప్పాలి



**పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 07(నినాదం న్యూస్):** ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు వాస్తవ వివరాలను చెప్పాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంథని మండలంలోని ఆరెంద, అడవి సోమన్‌పల్లి గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పర్యటించారు. ఆరెందలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే గురించి ఎన్యుమరేటర్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఎన్యుమరేటర్లు ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. ఆరెంద పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు వెంకటాపూర్ నుంచి నుంచి ప్రత్యేక తరగతులకు హాజరయ్యేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిల్ లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం అడవి సోమనపల్లిలో కోకో కోలా సంస్థ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట మంథని ఆర్డీవో సురేష్, తహసిల్దార్ రాజయ్య, టి.జి.ఐ.ఐ.సి చీఫ్ ఇంజనీర్ వినోద్ కుమార్, టి.జి.ఐ.ఐ.సి జోనల్ మేనేజర్ పద్మజ, డిప్యూటీ జోనల్ మేనేజర్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్



**బెల్లంపల్లి నవంబర్ 7 (నినాదం న్యూస్):** మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ,బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్,మంచిర్యాల కలెక్టర్ దీపక్,మంచిర్యాల జిల్లా అధికారులు, మంచిర్యాల, క్యాతనపల్లి ల మున్సిపల్ చైర్ పర్సన్ లతో గురువారం జరిగిన దిశా నిర్దేశం సమావేశంలో బెల్లంపల్లి చైర్ పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు జిల్లా ప్రభుత్వ అధికారులు జిల్లా అభివృద్ధిపై చర్చలు జరిపారు. అదేవి ధంగా మున్సిపల్ అభివృద్ధికై ప్రత్యేక నిధులు కేటాయిం చాలని ఎంపి,ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్ లను కోరినట్లు చైర్ పర్సన్ తెలిపారు.

## మంథని వ్యవసాయమార్కెట్‌లో ఉచిత వైద్య శిబిరం

### -150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు




**మంథని టౌన్ నవంబర్ 07 (నినాదం న్యూస్)** మంథని పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో కరీంనగర్ మెడికోవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని గురువారం మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిసతీష్‌కుమార్ప్రారంభించారు. డాక్టర్ దీక్షిత్ 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఎకో మొదలగు సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మెడికోవర్ సెంటర్ హెడ్ గుర్రంకిరణ్ మాట్లాడుతూ అగ్రికల్చర్ మార్కెట్ సిబ్బందికి, రైతులకు, స్థానిక ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే కాకుండా సెలవులతో సంబంధం లేకుండా రాత్రి పగలనే తేడా లేకుండా సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని హరీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా రక్తదానం



**బెల్లంపల్లి నవంబర్ 7 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 55వ పుట్టినరోజు సందర్భంగా రేవంత్ రెడ్డి సైన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్ బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పాటు చేసి ప్రజలందరికీ చేరువయ్యారని రెండోసారి ఆయన ముఖ్యమంత్రి కావడం అందరి ఆకాంక్ష అని అన్నారు. ప్రజల మనిషి,నిజాయితి పరుడు,మృదు స్వబావి,పేదల పెన్నిధి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గంలో మున్సిపల్ శాఖ మంత్రి పదవి ఇవ్వాలని సిఎం కు,ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గె వినతిపత్రాలు పంపినట్లు తెలిపారు. అదేవిధంగా బెల్లంపల్లి పట్టణంలోని 34వార్డులలో అండర్ డ్రైనేజీ,సిసి రోడ్ల నిర్మాణాలకు 5కోట్ల రూపాయలు నిధుల మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు.

## అధిక సభ్యత్వ నమోదుకు కృషి చేయాలి



**బెల్లంపల్లి నవంబర్ 7 (నినాదం న్యూస్):** బెల్లంపల్లి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ అనుబంధ కార్మిక సంఘం టిఎన్టియుసి కార్యాలయంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు,టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి టి మణి రాం సింగ్,ఎస్సి ఎల్ యు వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయలు ఏడుకొండలు లు మాట్లాడుతు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్ టి ఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని,అనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసిందని అన్నారు. సింగరేణిలో నిరుద్యోగులకు పరుగు పందెం ద్వారా 35నుంచి 40వేల మంది వరకు ఉద్యోగాలు భర్తీ చేసి సింగరేణి సంస్థ బి ఐ ఎఫ్ ఆర్ లోకి వెళ్లినప్పుడు1263 కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం వద్ద నుండి అప్పుగా తెచ్చి బి ఐ ఎఫ్ ఆర్ లోకి వెళ్లకుండా రక్షించిన ఘనత ఆనాటి టిడిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సింగరేణి లాభాల్లోకి వచ్చిన తర్వాత10శాతం నుండి ఈ సంవత్సరం 33శాతం లాభాల వాటా తీసుకుంటున్నారంటె అది తెలుగుదేశం పార్టీ ఘనతనే అని అన్నారు.

# కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించండి

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 6 నినాదం న్యూస్:**బుధవారం ప్రారంభమైన సామాజిక ,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న అధికారులకు ప్రజలందరూ సహకరించాలని, వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డ్ నెంబర్ 26 ఇష్కాన్ బాది కాలనీలో, వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామం లో సమగ్ర కుటుంబ సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఒక ఇంటిలో ఎంత మంది కుటుంబ సభ్యులు, ఎన్ని కుటుంబాలు ఉన్నాయని వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఇంటి సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని, సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ,ఆర్థిక, విద్య ,ఉపాధి, రాజకీయ ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నదని, అందువలన తప్పు సమాచారం ఇవ్వకుండా సరైన సమాచారాన్ని ఇస్తే భవిష్యత్తులో ఈ సమాచారం ఉపయోగపడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఈరోజు నుండి 8 వరకు ఇండ్లను సందర్శించి ఇండ్ల జాబితాను రూపొందించడం జరుగుతుందని, అనంతరం సర్వేకు ప్రభుత్వం రూపొందించిన సుమారు 75 కాలంలలో వివరాల సేకరణ చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రజలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పట్టాదారు పాస్ బుక్ వంటివి సిద్ధంగా ఉంచుకుని ఎన్యుమరేటర్లకు అందుబాటులో ఉండి సమాచారం ఇచ్చి సహకరించాలని అన్నారు సర్వే ఫారంలో ఎన్యుమరేటర్లు ఎట్టి పరిస్థితులలో తప్పులు నింపవద్దని, ఏవైనా సందేహాలు ఉంటే సూపర్వైజర్లు, లేదా మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఇండ్ల జాబితా తయారీ సందర్భంగా ఇంటిని సందర్శించినట్లుగా స్టిక్కర్ అతికించాలని తెలిపారు. సర్వే ఫారంలో పూర్తి వివరాలను నింపాలని తెలిపారు. జిల్లాలోని అందరు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సమగ్ర సర్వే విషయంపై విస్తృతంగా టామ్ టామ్ వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. సమగ్ర సర్వేకు వివరాలు ఇచ్చేందుకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. ఆకస్మికత నిఖీల ద్వారా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఏంపిడిఓ, తహసీల్దార్,ఎన్యుమరేటర్లు తదితరులు ఉన్నారు.

# ఇక్కడా.. అక్కడా..?

- సొంతూరు వదిలిన వారు ఎక్కడ నమోదు చేసుకోవాలో ?
- కులగణన సర్వేలో ఈ అంశంపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



**పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 07 (నినాదం):**"పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ఓ వ్యక్తి ఉపాధి కోసం కరీంనగర్ లో ఉంటున్నాడు. గురువారం మంథనిలోని అతని ఇంటికి వెళ్లిన ఎన్యుమ రేటర్ పరిచయం ఉన్నవాడే కావడంతో ఫోన్ చేసి మీ వివరాలు ఎక్కడ నమోదు చేసుకుంటారని ప్రశ్నించాడు. దీంతో కరీంనగర్ లో ఉంటున్న వ్యక్తి ఆలోచనలో పడ్డాడు. వివరాలు ఎక్కడ నమోదు చేసుకుంటే బాగుంటుందని ఎన్యుమరేటర్ని అడిగాడు. ప్రభుత్వం మాకు కూడా స్పష్టత ఇవ్వలేదని ఎన్యుమ రేటర్ బదులిచ్చాడు "కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కుల గణన సర్వే రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 6 నుంచి ప్రారంభమైంది. శుక్రవారం వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికి స్టిక్కర్లు వేయనున్నారు. ఈనెల తొమ్మిదో తేదీ నుంచి కుటుంబాల వివరాల సేకరణ మొదలు కానుంది. అయితే ఈ సర్వేపై ఇప్పటికే అనుమానాలు, అపోహాలు నెలకొన్నాయి. కాగా ఉద్యోగం, ఉపాధి, ఇతర కారణాలతో స్వగ్రామాలు వదిలి వేరే చోట ఉంటున్న కుటుంబాలు తమ వివరాలను ఎక్కడ నమోదు చేసుకోవాలనే అంశంపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. దీంతో సొంతూరు వదిలి ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు తమ వివరాలు ఎక్కడ నమోదు చేసుకోవాలో తెలియక తికమక పడుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన తాజా సర్వేలో 56 అంశాలకు సంబంధించిన వివరాలు ఎన్యుమరేటర్లు నమోదు చేయనున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల విధానాల రూపకల్పనకు ఈ సర్వే చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇదిలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు ఉద్యోగం, ఉపాధి కోసం స్వగ్రామాలు వదిలి పట్టణ ప్రాంతాల్లో ఉంటున్నారు. కొందరైతే ఇతర రాష్ట్రాల్లోనూ నివాసం ఉంటున్నారు. ఊరు వదిలిన క్రమంలో కొందరు ఆధార్ కార్డులో అడ్రస్ మార్పులు కూడా చేయించుకున్నారు. మరికొందరేమో ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ఆధార్ కార్డుల్లో అడ్రస్ స్వగ్రామం పేరుతోనే ఉన్నాయి. మరికొందరు పరిస్థితి ఇంకోలా ఉంది. కుటుంబ యజమాని ఆధార్ కార్డులో స్వగ్రామం గాకుండా ఉంటున్న గ్రామం పేరు, కుటుంబ సభ్యులవి సొంతూరు అడ్రస్ తో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజా సర్వేలో కుటుంబ వివరాలు ఎక్కడ నమోదు చేయించుకోవాలనే అంశంలో చాలా మంది అయోమయ పరిస్థితిలో ఉన్నారు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్వే నిర్వహించగా, ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా స్వగ్రామాలకు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా చేపట్టిన కులగణన సర్వేలో స్వగ్రామాలు వదిలిన కుటుంబాలు వివరాల నమోదు చేసుకునే విషయంలో సందిగ్ధంలో పడ్డాయి. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

## మిషన్ భగీరథ నీరు వృధా



పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో మిషన్ భగీరథ నీరు వృధా పాలవుతోంది. కుళాయి పైపులకు బిరడాల్లేక పోవడంతో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నీటి వృధా కొనసాగుతోంది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.

**– కొట్టె రవీందర్, పెద్దపల్లి ప్రతినిధి, నినాదం న్యూస్:**

## పొదలు ఇలా... కరెంటు ఎలా...



పల్లెలు... పట్టణాలలో కరెంటు తీగలకు అడ్డు వస్తున్నాయని చెట్ల కొమ్మలను నరికి వేసే అధికారులు అటవీ ప్రాంతాల్లో విద్యుత్ స్థంబాలను ముళ్ల పొదలు అల్లుకు పోయినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ సరఫరా అయ్యే స్థంబానికి పొదలు అల్లుకుపోయినా కనీసం వాటిని తొలగించాలనే ఆలోచన చేయడం లేదు. ముళ్ల పొదలతో విద్యుత్ సరఫరాలో అంతరాయమో లేక ఏదైనా ప్రమాదమో జరిగితే కానీ అధికారుల్లో చలనం కన్పించేలా లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కొర్లకుంట ప్రధాన రహదారిలో ఓ విద్యుత్ స్థంబాన్ని ముళ్ల పొదలు ఇలా అల్లుకు పోయాయి. నీడనిచ్చే చెట్ల కొమ్మలను తొలగించే అధికారులు ఈ ముళ్ల పొదలను ఎప్పుడు తొలగిస్తారని పలువురు చర్చించుకోవడం గమనార్హం...

**– అజ్మీర దాకు నాయక్, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, నినాదం న్యూస్:**

# సమగ్ర సర్వేలో ప్రతి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తాం : కలెక్టర్ రాహుల్ శర్మ


**జయశంకర్ భూపాలపల్లి, ప్రతినిధి నవంబర్ 07 నినాదం న్యూస్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో బుధవారం ప్రారంభమైందని, ప్రతి ఇంటికి ఎన్యూమరేటర్లు వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారని ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర సర్వేలో ముందు ఇళ్ల గుర్తింపు తర్వాతే సర్వే ఉంటుందని, ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ చేస్తారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎన్యూమరేటర్లు ఇళ్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టి సర్వే స్టిక్కరింగ్ చేస్తునట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లకు సర్వే చేయాల్సిన ఇళ్లను కేటాయించామని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఉదయం తరగతులు బోధించి మధ్యాహ్నం తర్వాత సర్వేలో పాల్గొనన్నారని అన్నారు. జిల్లాలోని 241 గ్రామ పంచాయతీలు, ఒక మున్సిపాలిటీల పరిధిలోని ఇండ్లను ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొయ్యూరు గ్రామ పంచాయతీ పరిధిలో 150 ఎన్యూమరేషన్ బ్లాకులు ఉన్నాయని, బుధవారం వరకు 68 ఇండ్లు పూర్తి అయ్యాయని, మిగిలిన ఇండ్లు సర్వే నేటితో పూర్తి అవుతుందని తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతిల్లో గణన ప్రక్రియ ప్రారంభం అయినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ముందుగా కుటుంబాలు, గృహాల సంఖ్య వంటి వివరాల సేకరణకు జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు 933 ఎన్యూమరేషన్ బ్లాక్ (ఈబీ)లను గుర్తించామని తెలిపారు. సర్వే తదుపరి డేటా ఎంట్రీ చేసేందుకు అవసరమైన కంప్యూటర్లు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్లును సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన కంప్యూటర్లు ప్రభుత్వ కార్యాలయాలు నుండి తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ రవి కుమార్, ఎంపిడిఓ శ్యామ్ సుందర్, సూపర్ వైజర్ కమల, ఎన్యూమరేటర్ శాంతి లత తదితరులు పాల్గొన్నారు.



## సినిమా నినాదం

## షారుక్ ఖాన్‌కు బెదిరింపులు

బాలీవుడ్ ఫిల్మ్ స్టార్ షారుక్ ఖాన్‌కు బెదిరింపులు వచ్చాయి. 50 లక్షలు ఇవ్వాలంటూ ఓ గుర్తు తెలియని వ్యక్తి .. షారుక్‌ను బెదిరించినట్లు ముంబై పోలీసులు వెల్లడించారు. బాంద్రా పోలీసు స్టేషన్‌లో దీనిపై కేసు నమోదు అయ్యింది. గుర్తు తెలియని వ్యక్తిపై ఆ కేసును రిజిస్టర్ చేశారు. భారత న్యాయ సంహితలోని 308(4), 351(3)(4) సెక్షన్ల కింద కేసును నమోదు చేశారు. చత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్ నుంచి నేరుగా ముంబై పోలీసులకే బెదిరింపు కాల్ వచ్చింది. ఫైజాన్ అనే యువకుడి ఆ బెదిరింపు ఫోన్ కాల్ చేసినట్లు తెలిసింది. గత అక్టోబర్‌లో కూడా షారుక్‌కు బెదిరింపు కాల్స్ వచ్చాయి. పఠాన్, జవాన్ సినిమాలు హిట్ కొట్టిన తర్వాత ఆ కాల్స్ వచ్చాయి. ఇటీవల మరో బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌కు ఫోన్ బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఆ బెదిరింపులకు పాల్పడింది. కృష్ణ జింకను చంపిన కేసులో.. బిష్ణోయ్ గ్యాంగ్ సల్మాన్‌ను వెంటాడు తున్నది. ఆ గ్యాంగ్ అతని వద్ద 5 కోట్లు డిమాండ్ చేసినట్లు తెలిసిందే.



## ఉందిలే మంచి కాలం




కన్నడ భామ పూజాహెగ్డే కెరీ ర్ తొలినాళ్లలోనే అగ్ర హీరోల చిత్రాల్లో అవకాశాలు దక్కించు కొనిసత్తా చాటింది. ముఖ్యంగా తెలుగునాట యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అయితే గత కొన్నేళ్లుగా ఈ భామకు అదృష్టం ఏమాత్రం కలిసి రావడం లేదు. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో ఆమె నటించిన చిత్రాలన్నీ డిజాస్టర్స్‌గా మిగిలాయి. దీంతో పూజాహెగ్డే కెరీర్ ఇక ముగిసి నట్లే అని భావించారు. కానీ ఈ భామ అనూహ్యంగా పుంజుకుంది. తెలుగు, తమిళంలో భారీ అవకాశాలను దక్కించుకొని అందరినీ ఆశ్చర్యపరచింది. (ఇలా వరుస భారీ ఆఫర్లతో కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందే ప్రయత్నాలో ఉంది పూజాహెగ్డే. ఫెయిల్యూర్స్ వల్ల ఎప్పుడూ బాధపడలేదని, మంచి సమయం కోసం ఓపిగ్గా ఎదురుచూశానని, భవిష్యత్తులో అంతా మంచే జరుగుతుందనే నమ్మకం ఉందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ధీమా వ్యక్తం చేసింది పూజాహెగ్డే.





## అనుష్క బర్త్‌డే స్పెషల్...

### ఘాటి ఫస్ట్ లుక్ రిలీజ్



టాలీవుడ్ నటి అనుష్క శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఘాటి. ఈ సినిమాకు వేదం, కంచె చిత్రాల దర్శకుడు జాగర్లమూడి కృష్ణ (క్రిష్) దర్శకత్వం వహిస్తు న్నాడు. 4 ఏండ్ల నుంచి షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నేడు షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అయితే నేడు అనుష్క పుట్టినరోజు సందర్భంగా ఆమెకి శుభాకాంక్షలు తెలుపుతూ ఘాటి నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. బాధితురాలు, క్రిమినల్, లెజెండ్. అంటూ అనుష్క పోస్టర్‌ని పంచుకున్నారు. ఈ పోస్టర్‌ను చూస్తుం టే.. అరుంధతి తర్వాత మళ్లీ అలాంటి పవర్‌ఫుల్ రోల్‌లో అనుష్క నటించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా గ్లింప్స్‌ను నేడు సాయంత్రం 4.05 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

## పుష్ప...2కి తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్




అల్లు అర్జున్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ పుష్ప 2. ఈ సినిమా విడుదలకి ఇంకా నెల రోజులు కూడా లేదు అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఫస్ట్ ఆఫ్‌కి సంబం ధించి పనులు అన్ని పూర్తి అవ్వగా సెకండ్ పార్ట్‌లో ఐటం సాంగ్ మినహా మిగత అన్ని పనులు పూర్తి అయినట్లు తెలుస్తుంది. అయితే ఈ క్రమంలోనే ఈ సినిమాకు సంబంధించి ఒక షాకింగ్ బయటకు వచ్చింది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ నచ్చని సుకుమార్ మళ్లీ చేయమని చెప్పినట్లు తెలుస్తుంది. అయితే ఎడిటింగ్, డబ్బింగ్ పనులు ఇంకా పెండింగ్ ఉండడం తో ఈ పనిని థమన్‌కు అప్పగించబో తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే థమన్ కూడా కొన్ని బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌లను సుకుమార్‌కి వినిపించినట్లు సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు ఈ సినిమా విడుదలకు 29 రోజులో ఉండడంతో అడ్వాన్స్ బుకింగ్స్ ఒక్కొక్కటిగా స్టార్ట్ అవుతున్నాయి. ఇప్పటికే ఈ ఓవర్సీస్ బుకింగ్స్ స్టార్ట్ అవ్వగా రికార్డు సేల్స్‌తో బుకింగ్స్ అవుతున్నాయి. అల్లు అర్జున్ కథానా యకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందాన్న హీరోయిన్‌గా నటి స్తుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తు న్నాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది.

## 3 రాష్ట్రాలు... 11 థియేటర్లు..

### రాంచరణ్ గేమ్ ఛేంజర్ టీజర్ లాంచ్ సెలబ్రేషన్స్ ప్లాన్

గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా.. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు సుందరి అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. నవంబర్ 9న లక్నోలో గ్రాండ్‌గా గేమ్ ఛేంజర్ టీజర్ లాంచ్ చేయబోతున్న విషయం తెలిసిందే. లక్నోలోని ప్రతిభ థియేటర్ నుంచి షురూ అయి మరో రెండు రాష్ట్రాల్లో గేమ్ ఛేంజర్ లాంచ్ సందడిగా సాగనుంది. నవంబర్ 9న మూడు రాష్ట్రాలు 11 థియేటర్లలో సాయంత్రం 4:30 గంటల నుంచి సెలబ్రేషన్స్ ఉండబోతున్నాయని తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, వైజాగ్, విజయవాడ, తిరుపతి, కర్నూలు, అనంతపూర్, ఖమ్మం, రాజమండ్రి, నెల్లూరు ప్రాంతాల్లో లాంచ్ ఉండబోతుండగా.. కర్ణాటకలో బెంగళూరులోని ఊర్వశి థియేటర్‌లో లాంచ్ ఈవెంట్ జరుగనుంది. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. గేమ్ ఛేంజర్‌లో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తున్నాడు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్న ఈ సినిమాకు ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741